మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

www.ntnews.com /ntdailyonline NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 17.4.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 15 ॥ సంచిక (Issue): 312 ॥ వెల (Price) రూ.6.50 | PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD



మక్క రైతు మండిపాటు

కొనుగోలుకేంద్రాల కోసం ఆందోళన

నాగర్‌కర్నూల్‌లో రోడ్డెక్కిన రైతులు

23 వరకు మక్కలు మార్కెట్‌కు తేవొద్దన్న నోటీస్‌పై ఫైర్

నిర్మల్ జిల్లా కనకాపూర్‌లో ధర్నా

› 6




సాదాబైనామాలకు మోక్షమెప్పుడో?

జీవో 76 జారీ చేసినా అమలులో జాప్యం

హైకోర్టు ఓకే చెప్పినా ముందుకు కదలని ప్రభుత్వం

9లక్షల మంది రైతుల్లో తప్పని ఆందోళన

› 8



లోక్‌సభ సీట్లు 816

50% ఫార్ములా ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన

లోక్‌సభ ముందుకు మహిళా కోటా, డీలిమిటేషన్ బిల్లులు

ప్రస్తుతం ఇలా	డీలిమిటేషన్ తర్వాత
లోక్‌సభలో మొత్తం సీట్లు 543 (100%)	లోక్‌సభలో మొత్తం సీట్లు: 816 (100%)
5 దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా 129 (23.76%)	5 దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా 195 (23.89%)
మిగతా రాష్ట్రాల సీట్ల వాటా 414 (76.24%)	మిగతా రాష్ట్రాల సీట్ల వాటా 621 (76.11%)
దక్షిణాదికి మిగతా రాష్ట్రాల మధ్య సీట్ల అంతరం 285	దక్షిణాదికి మిగతా రాష్ట్రాల మధ్య సీట్ల అంతరం 426



ప్రధాని ప్రకటన

డీలిమిటేషన్‌కు సంబంధించి వెల్లువెత్తుతున్న అభ్యంతరాలపై స్పష్టతనిచ్చేందుకు లోక్‌సభలో గురువారం ప్రకటన చేస్తున్న ప్రధాని మోదీ



స్టాలిన్ నిరసన

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తూ చెన్నైలో ముసాయిదా ప్రతులను తగులబెడుతున్న డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్

17 నుంచి 26కు చేరనున్న తెలంగాణ లోక్‌సభ స్థానాలు

- 33 శాతం రిజర్వేషన్లతో మహిళలకు దక్కే సీట్లు 272
- పార్లమెంట్‌లో వివరాలను వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
- పునర్విభజనతో ఏ రాష్ట్రమూ నష్టపోదన్న ప్రధాని మోదీ
- ఉత్తరాది, దక్షిణాది భేదభావమేదీ తమకు లేదని ప్రకటన
- లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యం పెరుగుతుందన్న షా
- బిల్లు ఆమోదం పొందితే దేశంలో ప్రజాస్వామ్యం అంతం
- మహిళా కోటాను పునర్విభజనతో లింక్‌పై విపక్షం ఫైర్
- నేడు సాయంత్రం 4 గంటలకు బిల్లులపై లోక్‌సభలో ఓటింగ్


లోక్‌సభ స్థానాల పునర్విభజనపై క్రమంగా ఓ స్పష్టత వస్తున్నది. బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చిన నేపథ్యంలో.. డీలిమిటేషన్‌పై వెల్లువెత్తుతున్న అభ్యంతరాలపై కేంద్రం స్పష్టతనిచ్చేందుకు ప్రయత్నించింది. పునర్విభజన పూర్తయితే ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్య 816కు చేరుతుందని ప్రకటించింది. అయితే దక్షిణాదికి సీట్లసంఖ్యలో అన్యాయమేదీ జరుగబోదని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా చెప్తున్నా.. బిల్లు చుట్టూ అల్లుకున్న అనుమానాలు, వెల్లువెత్తుతున్న అభ్యంతరాలు తొలగిపోలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థపై బీజేపీ దాడిచేస్తున్నదని విపక్ష సభ్యులు విమర్శిస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సీట్ల పెంపు.. మూడు కీలక బిల్లులపై శుక్రవారం లోక్‌సభలో ఓటింగ్ జరుగనున్నది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): దేశంలో లోక్‌సభ సీట్ల పెంపునకు రంగం సిద్ధమైంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, యూటీల్లో సీట్ల పెంపునకు సంబంధించిన మూడు కీలక బిల్లులను కేంద్రం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ స్థానాలు డీలిమిటేషన్ తర్వాత 816కు చేరనున్నట్టు తెలిపింది. మొత్తం లోక్‌సభ సీట్లలో 272 స్థానాలను మహిళలకు కేటాయించనున్నట్టు వెల్లడించింది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఏ రాష్ట్రమూ నష్టపోదని ప్రధానమంత్రి మోదీ హామీనిచ్చారు. తమకు ఏ రాష్ట్రంపై వివక్ష లేదని పేర్కొన్నారు. 50 శాతం ఫార్ములా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి లోక్‌సభలో ప్రాతినిధ్యం మరింతగా పెరుగనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ మూడు కీలక బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ నిర్వహించనున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. డీలిమిటేషన్‌తో › IIవ పేజీలో

పార్లమెంట్ సాక్షిగా రేవంత్ నవ్వులపాలు

- డీలిమిటేషన్‌పై ముఖ్యమంత్రి హైబ్రిడ్ ప్రతిపాదన బ్యాక్‌ఫైర్
- జీఎస్డీపీతో ముడిపెట్టడంపై లోక్‌సభలో బీజేపీ మండిపాటు
- ప్రపంచంలోనే అత్యంత తెలివితక్కువ ప్రతిపాదనగా అభివర్ణన
- రేవంత్‌ను చూసి తెలంగాణ ప్రజలే నవ్వుకొంటున్నారని ఎద్దేవా



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వులపాలయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనపై రేవంత్ ప్రతిపాదించిన హైబ్రిడ్ విధానాన్ని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో తప్పుబట్టారు. డీలిమిటేషన్‌ను రాష్ట్ర జీఎస్డీపీతో ముడిపెట్టడం ప్రపంచంలోనే అత్యంత తెలివి తక్కువ ప్రతిపాదనగా అభివర్ణించారు. రేవంత్ వాదనలకు తెలంగాణ ప్రజలు కూడా నవ్వుకొంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల జీఎస్డీపీ ఎప్పుడూ స్థిరంగా ఉండదని, ఏటా మారుతుందని పేర్కొన్న బీజేపీ ఎంపీ.. నియోజకవర్గాల పునర్విభజనకు జీఎస్డీపీతో ముడిపెట్టడం మూర్ఖత్వమే › 5వ పేజీలో

IV
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 17 ఏప్రిల్ 2026
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బీసీలపై కాకిలెక్కలు

సామాజిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలంటే లెక్కలు పక్కాగా ఉండాలి. ఏ సామాజిక వర్గం జనాభా ఏమేరకు ఉందనేది తేలితేగానీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఆ వర్గాలకు అందించడం వీలుపడదు. అందుకు కులగణన తప్పనిసరి. కానీ ఈ భావన పట్ల రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ చిత్తశుద్ధి ఎప్పుడూ అనుమానాస్పదమే. కేంద్రంలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పుడు దీనిని ఏమాత్రం పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ మత రాజకీయాలకు పోటీగా ఈ భావనను ఇటీవలి కాలంలో ఎత్తుకున్నది. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందే దృష్టితోనే ఇలా చేసిందని పైకి తెలుస్తూనే ఉన్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు రిజర్వేషన్ 23 నుంచి 42 శాతానికి పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. శాస్త్రీయమైన పద్ధతిలో సేకరించిన గణాంకాలు లేకుండా దీనిని అమలు చేయడం సాధ్యం కాదనేది తెలిసిందే. దాంతో మొక్కుబడిగా సర్వేను ఓ తంతులాగా పూర్తి చేసింది. ఆ సర్వే జరుగుతున్నప్పుడే లోటుపాట్ల గురించి తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి. బీసీ సంఘాలు సర్వే తీరుతెన్నులపై అనుమానాలు వ్యక్తం చేశాయి కూడా. అన్నిటినీ బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా సర్వే జరిపింది కాంగ్రెస్ సర్కార్. ఇప్పుడు గందరగోళపు లెక్కలతో నివేదికను వండివార్చింది.

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన సర్వే నివేదిక ఆ అనుమానాలన్నీ నిజమేనని చాటిచెప్పింది. అప్పుడెప్పుడో ఏడాదిన్నర క్రితం చేపట్టిన లోపభూయిష్టమైన సర్వేపై సర్కార్ వండివార్చిన నివేదిక తప్పులతడకగా ఉందనే విమర్శలు అన్నివైపుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. జనాభా పెరుగుదల లెక్కలే ఈ విమర్శలకు ప్రధాన మూలంగా నిలుస్తున్నాయి. 2011-2024 మధ్యకాలంలో సుమారు 13 ఏండ్లలో 1.35 శాతం వృద్ధిరేటు ప్రకారం రాష్ట్ర జనాభా 70 లక్షలకు పైగా పెరగాలి. కానీ పెరిగింది కేవలం 20 లక్షలే. 2014లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3,68,76,544. అదేవిధంగా 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3,70,77,544. అంటే పదేండ్లలో పెరిగిన జనాభా బొటాబొటీగా రెండు లక్షలే అని చూపడం వింతల్లోకెల్లా వింత. ఇక బీసీ జనాభా విషయమై నివేదికలో కాకిలెక్కలు చోటుచేసుకున్నాయి. ముస్లిం బీసీలు లేకుండానే బీసీ జనాభా 51 శాతం కంటే ఎక్కువగా ఉంటుందనేది అందరూ ఆమోదించే అంచనా. కానీ, ప్రభుత్వ తాజా నివేదికలో రెండింటినీ కలిపి 56 శాతం మాత్రమేనని చూపడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైగా ముస్లిం రిజర్వేషన్లు కలిపి చూపడంపై బీసీ సంఘాలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మొత్తంగా పెండ్లిళ్ల సంఖ్య, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారుల సంఖ్య, పంపిణీ అయిన కేసీఆర్ కిట్ల సంఖ్యలతో పోలిస్తే ప్రభుత్వం చూపిన బీసీ జనాభా పెరుగుదల నమ్మశక్యంగా లేదు. అసలు ఎవరూ పిల్లలను కనడం లేదా అనే ప్రశ్న ఈ సందర్భంగా ఉత్పన్నమవుతున్నది. అసలు బీజీ జనాభా అంచనాల్లో ఇంతటి వ్యత్యాసం ఎందువల్ల వచ్చింది? ఇంకా బీసీల్లో సగం కులాల్లో పెద్దగా వెనుకబాటుతనం లేదని చెప్పడం కుట్రపూరితమే. కులం తెలిపేందుకు నిరాకరించిన వారిని ఓసీల్లో కలుపడం, అన్ని సామాజిక వర్గాల్లో ఓసీల లెక్కలు తీయడం ఎందుకు? మరోవైపు ఎస్సీల జనాభా తగ్గినట్టు చూపడం మరీ విడ్డూరం. నివేదికలోని లెక్కలు నిర్హేతుకంగా ఉన్నాయనేది తెలిసిపోతున్నది.

ఈ నివేదికను డాటా ప్రైవసీ పేరిట దాచేసి, అవసరమైన సందర్భాల్లో అసెంబ్లీకి సమర్పించకుండా తొక్కిపెట్టి, ఇప్పుడు ఆగమేఘాల మీద అర్ధరాత్రి బయటపెట్టడం ఎందుకు అనేది ప్రశ్న. ఓవైపు జగిత్యాలలో కేసీఆర్ నేతృత్వంలో ఈనెల 20న భారీ బహిరంగ సభ జరుగబోతున్న తరుణంలో, మరోవైపు కేంద్రం డీలిమిటేషన్ ఎజెండాను ఎత్తుకున్న సమయంలో హడావుడిగా సర్వే నివేదికను సందట్లో సడేమియా అన్నట్టుగా బైటపెట్టడంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. డీలిమిటేషన్‌ను మహిళల 33 శాతం కోటాకు ముడిపెట్టి మహిళా ఓట్లు దండుకోవాలని బీజేపీ చూస్తుంటే, బీసీలకు ఏదో ఒరగబెట్టినట్టు ప్రచారం చేసుకునేందుకు కాంగ్రెస్ తాపత్రయపడుతున్నది. రెండు పార్టీలది ఎన్నికల తాపత్రయమే. బీసీలనైనా, మహిళలనైనా మభ్యపెట్టడమే వారి నైజం.

బీజేపీ అధికార వ్యూహం.. 'పునర్విభజన'



సుక్కన్న

హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కొచ్చిలో నివసించే ఒక మధ్య తరగతి కుటుంబం గురించి ఆలోచిద్దాం. ఆ కుటుంబం కష్టపడి పనిచేస్తున్నది. పిల్లలను మంచి పాఠశాలకు పంపిస్తున్నది. కుటుంబ నియంత్రణతో జీవిస్తున్నది. పన్నులను నిజాయతీగా చెల్లిస్తున్నది. ఆయా నగరాలు కలిగిన రాష్ట్రాలు మంచి దవాఖానలు కలిగి ఉన్నాయి. పరిశ్రమలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. రాష్ట్రంలోని పరిమితమైన నీరు, భూమికి తగినట్టుగా జనాభా తక్కువగా ఉన్నది. జీవన విధానాలు అద్భుతంగా, పరిపూర్ణంగా లేకపోయినా, ప్రజలు మంచి విద్యావంతులై, క్రమశిక్షణ కలిగి జీవిస్తున్నారు. మెరుగైన సమాజాన్ని నిర్మిస్తున్నారు. కానీ ఇప్పుడు అలాంటి ప్రశాంతమైన సమాజంలోకి ఢిల్లీ నుంచి ఒక పెద్ద మార్పు రాబోతున్నది. దాని పేరు డీలిమిటేషన్.

కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొస్తున్న డీలిమిటేషన్ సాంకేతికంగా ఒక పదంగా కనిపించవచ్చు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను 850కి పెంచాలని కసరత్తు చేస్తున్నది. రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ఎంపీల సంఖ్యను పెంచనున్నది. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ మంది ఎంపీలు, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలకు తక్కువ మంది ఎంపీలు దక్కుతారు. ఈ పరిణామం దక్షిణాది సాధారణ ప్రజలకు ఇది తీవ్రమైన అన్యాయంగా కనిపిస్తున్నది. ఎందుకంటే జనాభా నియంత్రణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్దాలుగా చేపట్టిన కుటుంబ నియంత్రణ దక్షిణాది రాష్ట్రాల్లో విజయవంతంగా నడిచింది. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు ప్రభుత్వాల సూచనలను లెక్కచేయకపోవడం వల్ల అక్కడి జనాభా దక్షిణాదితో పోల్చితే ఎక్కువగా పెరిగింది. ఇప్పుడు జనాభా ఆధారంగా ఎంపీ సీట్లు కేటాయిస్తామంటే దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్ల కేటాయింపు జరగకపోవచ్చు. ఫలితంగా దేశంలో ఆయా రాష్ట్రాల ప్రభావం తగ్గవచ్చు. మెరుగైన జీవనం, క్రమశిక్షణ కలిగిన విధానం, గర్వపడే అభివృద్ధికే శిక్ష విధించినట్టుగా దక్షిణాది ప్రజలు భావించాల్సి వస్తున్నది.

ప్రస్తుతం లోక్‌సభ సీట్లు 543. ప్రతీ ఎంపీ నియోజకవర్గంలోని ఒకే ప్రజల సంఖ్య దాదాపు సమానం అనుకోవచ్చు. కానీ దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను సమర్థంగా నియంత్రించాయి. ఇప్పటికే ఉత్తరాదితో పోల్చితే దక్షిణాది రాష్ట్రాల్లోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువ. ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో జనాభా నియంత్రణలో ఉండటం, ప్రతీ నియోజకవర్గానికి సగటు ఓటర్ల సంఖ్య ఎక్కువ ఉండటం కొంచెం గందరగోళంగానే అనిపిస్తుంది. కానీ ఇది నేటి వాస్తవ పరిస్థితి. దక్షిణాది రాష్ట్రాల్లో ఒక లోక్‌సభ నియోజకవర్గానికి సగటున 18 లక్షల నుంచి 22 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ సంఖ్య సగటున 14 లక్షల నుంచి 16 లక్షల మధ్య ఉన్నది.

కేంద్రం చెప్తున్న లోక్‌సభ సీట్ల పెంపు పట్ల దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. అంటే, సీట్ల సంఖ్య పట్ల కాదు, కేంద్రం రాజకీయ ఉద్దేశాల పట్లనే ఈ ఆందోళన. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినా సామాజిక బాధ్యత కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడంలో ప్రజలు మెరుగైన భాగస్వామ్యం కనబర్చారు. బాలికల విద్య, చిన్న కుటుంబాలను ప్రోత్సహించడం, బలమైన ఆర్థిక వ్యవస్థల నిర్మాణం పట్ల శ్రద్ధ చూపారు. కేరళం అక్షరాస్యత శాతం 96%. తమిళనాడులో ప్రపంచస్థాయి పరిశ్రమలు ఉన్నాయి. కర్ణాటకలోని ఐటీ రంగ అభివృద్ధి దేశ ఐటీబూమ్‌కు కారణంగా నిలుస్తున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఫార్మా, వ్యవసాయ రంగాల ఉత్పత్తులకు నిలయాలుగా నిలుస్తున్నాయి. దక్షిణాది మహిళ సగటున సంతానోత్పత్తి రేటు 1.6-1.7 కాగా ఉత్తరాదిలో ఈ సంఖ్య 2.4-3గా ఉన్నది. దేశంలోని జీఎస్టీ వసూళ్లలో దక్షిణాది రాష్ట్రాల వాటా 31 శాతం. కానీ దక్షిణాది రాష్ట్రాలు చెల్లిస్తున్న పన్నుల్లో సగం కూడా కేంద్రం నుంచి తిరిగి కేటాయింపులు జరగడంలేదు. కేవలం జనాభా ఆధారంగా మాత్రమే లోక్‌సభ సీట్ల పెంపు జరిగితే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల గొంతు కుచించుకుపోతుంది. ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని సీట్లు 130 అంటే దాదాపు 23 శాతం. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఇది 18 శాతం కంటే కూడా తక్కువకు పడిపోయే అవకాశమున్నది.

ఎంపీల కేటాయింపు అనేది కేవలం సంఖ్యాపరమైనది కాదు. ఇది న్యాయానికి సంబంధించిన వ్యవహారం. దశాబ్దాలుగా దక్షిణాది ప్రభుత్వాలు పార్టీలకు అతీతంగా కుటుంబ నియంత్రణ, బాలికా విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై శిబిరాలు నిర్వహించాయి. ఇవన్నీ కూడా దేశానికి మేలు చేసే అంశాలు అని ప్రచారం నిర్వహించాయి. కానీ వాటన్నింటినీ సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించినందుకు లభిస్తున్న బహుమానం ఏంటంటే ఎంపీ సీట్ల కేటాయింపు, రాజకీయ అధికారంలో అన్యాయం. ఎక్కువ పిల్లల్ని కనండి, ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయంటూ ఉత్తరాది నేతలు బహిరంగ సభల్లో తరచుగా మాట్లాడుతూ ఉంటారు. ఈ మాటలు ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తాయి. భారత్‌ను సుస్థిరంగా ఉంచేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించే ప్రజలను నిరుత్సాహపరుస్తాయి.



దక్షిణాదిలోని ప్రజలు ఈ అన్యాయాన్ని తమ రోజువారీ జీవితంలోనూ చూస్తున్నారు. దక్షిణాదిలో వసూలు చేసిన పన్నులతో ఉత్తరాదిలో రహదారులు, పాఠశాలలు నిర్మిస్తుంటే ఇక్కడి నగరాల్లో ట్రాఫిక్, నీటి ఎద్దటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇక తక్కువ మంది ఎంపీలు అంటే దక్షిణాది రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం మరింత పెరగడమే అవుతుంది. పరిశ్రమల కేటాయింపు నుంచి రైతులకు న్యాయమైన ధరల అందించడం వరకు ప్రతీ విషయంలో అన్యాయం ఎదుర్కోవాల్సి వస్తుంది. అంటే దక్షిణాది ప్రజలు 'ఎక్కువ పని చేస్తాం, ఎక్కువ పన్నులు చెల్లిస్తాం, కానీ దేశ పాలనలో మాటకు విలువ తక్కువ' అనుకోవాల్సి ఉంటుంది.

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను న్యాయంగా జరుపుతామని, ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. ఈ మాటను తెలంగాణలోని బీఆర్‌ఎస్, తమిళనాడు నుంచి డీఎంకే, కర్ణాటక కాంగ్రెస్ నేతలు నమ్మడం లేదు. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ బిల్లు ఇప్పటికీ అమలు చేయడం లేదని గుర్తుచేస్తున్నారు. ఆ బిల్లు అమలు చేసిన తర్వాతనే డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. డీలిమిటేషన్ బిల్లు ప్రతులను తమిళనాడు సీఎం స్టాలిన్ కాల్చి, నిరసనను తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ రాజకీయ ఉద్దేశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాదిలో ఎక్కువగా ఎంపీ సీట్లు పెంచుకోవడం ఆ పార్టీ ఉద్దేశం అని నిపుణులు చెప్తున్నారు. దక్షిణాదిలో బీజేపీ ప్రాబల్యం తక్కువ. కాబట్టి ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి తమకు బలం ఉన్న రాష్ట్రాల్లో గెల్చుకునే సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావాలనేది బీజేపీ రాజకీయ జిమ్మిక్కు, అప్రజాస్వామిక వైఖరి అని అభివర్ణిస్తున్నారు. తమకు ఓటు వేయని ప్రాంతాల గొంతు నొక్కి, తమకు మద్దతుగా నిలిచే వారి స్వరం పెంచడం ద్వారా అధికారం చెలాయించాలని చూడటం దారుణమని మండిపడుతున్నారు. ఆటలో గెలవడం చేతగాక, ఆట నిబంధనలు మార్చినట్టుగా బీజేపీ తీరు ఉన్నదని చెప్తున్నారు. ఇదంతా ఎన్నికల సంస్కరణ ముసుగులో అధికారాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న వ్యవహారం అని విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు.

కేంద్రం తెరపైకి తీసుకొస్తున్న సమస్యకు పరిష్కారం ఏమిటి? అంటే.. దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేక సదుపాయాలు కోరడంలేదు. సమతుల్యమైన సూత్రాన్ని పాటించాలని మాత్రమే అడుగుతున్నారు. జనాభాను ప్రాతిపదికగా తీసుకోవచ్చు, అదే సమయంలో అభివృద్ధిని కూడా పరిగణలోకి తీసుకోవాలి. అక్షరాస్యత, ఆర్థిక భాగస్వామ్యం, కుటుంబ నియంత్రణలో సత్ఫలితాలు వంటి అంశాలను లెక్కలోకి తీసుకోవాలి. జనాభాకు 50 శాతం, అభివృద్ధి సూచీలకు 50 శాతం ప్రాధాన్యత కల్పిస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని మరికొందరు నిపుణులు సూచిస్తున్నారు. జనాభాకు సంబంధం లేకుండా రాజ్యసభను బలోపేతం చేయడం ద్వారా కూడా రాష్ట్రాలు తమ గొంతును వినిపించేందుకు అవకాశం కల్పించవచ్చు. ఒక మనిషి - ఒక ఓటు అనే సూత్రం ప్రకారం లోక్‌సభ సీట్ల పునర్విభజన అవసరమే. కానీ దేశం మొత్తానికి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించినట్టుగా ప్రక్రియ ఉండకూడదు. అభివృద్ధి చెందిన, విద్యావంతమైన దక్షిణాది ప్రపంచంతో పోటీ పడుతున్నది. అలాంటి దక్షిణాది అసంతృప్తితో ఉంటే 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' అని కేంద్రం చెప్తున్న మాటలకు అర్థం ఉండదు.

దక్షిణాదిలోని ప్రజలు ఉత్తరాది ప్రజలకు వ్యతిరేకం కాదు. దేశంలోని ప్రతి ఒక్కరికీ మంచి విద్య, వైద్యం అందాలని దక్షిణాది ప్రజలు కోరుతున్నారు. కానీ దక్షిణాది ప్రజల కఠోర శ్రమ, బాధ్యతాయుత కార్యక్రమాల అమలుకు గౌరవం ఆశిస్తున్నారు, శిక్షను కాదు. కేంద్రం తప్పనిసరిగా వినాల్సిందే. నియోజకవర్గాల పునర్విభజన అనేది సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయాలి, బలహీనపర్చవద్దు. సుపరిపాలనకు అభినందించాలి, శిక్షించకూడదు. దక్షిణాది మనోభావాలను, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా కేంద్రం ఒంటెత్తు పోకడలతో ముందుకు వెళ్తే ఇక్కడి ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. అది ఎవరికీ మంచిది కాదు, దక్షిణాది రాష్ట్రాలు అడుగుతున్నది ఏంటి? తమ గొంతు వినిపించేందుకు న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం. ప్రజాస్వామ్యంలో ఇది అత్యాశ అవుతుందా?

బీజేపీ మాటలు ప్రజల్లో నమ్మకం కలిగించట్లేదు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేస్తే అభివృద్ధికి శిక్ష వేసినట్టు అవుతుంది. దక్షిణాది ప్రజలు చెల్లిస్తున్న పన్నుల వాటాకు తగ్గట్టుగా సుపరిపాలన కావాలని కోరుకుంటారు. అందుకోసం తమ గొంతు వినిపించాలని ఆశిస్తారు. డీలిమిటేషన్ కోసం జనాభా ప్రాతిపదికతో పాటు, మానవ అభివృద్ధి సూచీలను పరిగణలోకి తీసుకోవాలి, మహిళా రిజర్వేషన్‌ను అనుసంధానం చేయాలి. సబ్ కా సాత్ అంటే ఉత్తరాదిలోని అందరితో కలిసి అనేలా ఉండొద్దు. దక్షిణాదినీ భాగస్వామ్యం చేయాలి. మనుషులను లెక్కించడమే కాదు, మనుషుల కృషిని గుర్తించినప్పుడే సమతుల్యత సాధ్యమవుతుంది, ఈ అంశాన్ని కేంద్రం గుర్తించాలి. దేశం కోసం కృషి చేసే వారిని గౌరవించాలి, శిక్షించకూడదు.



కాలేజ్ అధ్యాపకులా.. మార్కెట్ ఏజెంట్లా?



ఎడమ శ్రీనివాసరెడ్డి
99499 05069

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను పెంచడానికి అడ్మిషన్ అవుట్‌రీచ్, మొబిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇటీవల ఆదేశించారు. దీని ప్రకారం అధ్యాపకులు తాము పనిచేస్తున్న కళాశాల నుంచి 100 కిలోమీటర్ల పరిధిలోని జూనియర్ కళాశాలలను మ్యాప్ చేయాలి. మెరిట్ గల విద్యార్థులను గుర్తించాలి. ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. బ్రోచర్లు తయారుచేయాలి. ప్రతి వారం నివేదికలు సమర్పించాలి.

ఇది కళాశాలలను బలోపేతం చేసే చర్యలో భాగంగా, ఒక సాధారణ అడ్మిషన్ ప్రక్రియలా పైకి కనిపిస్తున్నది. ఈ చర్య విద్యా వ్యవస్థలో స్పష్టమైన అవాంఛనీయ మార్పునకు సంకేతం. విమర్శనాత్మక దృష్టిని, స్వతంత్ర ఆలోచనాపరులను, సామాజిక సమస్యలకు పరిష్కారాలను అన్వేషించేవారిగా విద్యార్థులను తయారుచేయాల్సిన కళాశాల విద్య లక్ష్యం మార్కెట్ అవసరాల కోసమే అనే ధోరణి బలపడుతున్నది. ఈ మార్పును 'ఎండోజెనస్ ప్రైవేటైజేషన్' అని చెప్పవచ్చు. అంటే ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రైవేట్ విధానాలను అనుసరించడం.

ప్రభుత్వ విద్యావ్యవస్థ సమానత్వం, సామాజిక బాధ్యత అనే విలువల మీద ఆధారపడి ఉంటుంది. కళాశాలలు అందరికీ సమాన, నాణ్యమైన విద్యను అందించడానికి ఏర్పాటయ్యాయి. కానీ ఒకదానితో ఒకటి పోటీ పడటానికి కాదు. కానీ ఉన్నతాధికారుల ఆదేశాలు ఈ భావనను పూర్తిగా మార్చుతున్నాయి. మెరిట్ విద్యార్థులను ఆకర్షించాలని చెప్పడం ద్వారా కళాశాలలను మార్కెట్‌లో పోటీదారులుగా మార్చుతున్నారు. 100 కిలోమీటర్ల పరిధి ఇప్పుడు విద్యాపరిధి కాదు.. అది ఒక మార్కెట్ ప్రాంతం. ఒకే ప్రాంతంలో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉన్నప్పుడు, అందరూ ఒకేవిధంగా మెరుగైన విద్యార్థులను ఆకర్షించడానికి పోటీ పడితే, మిగతా విద్యార్థులు ఎక్కడికి వెళ్తారు?

ఈ పోటీ ప్రభావం క్రమంగా పాఠ్యాంశాలపై పడుతుంది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు లాజిస్టిక్స్, రిటైల్ మేనేజ్‌మెంట్, డాటా సైన్స్ వంటి వాటికి ప్రాధాన్యం పెరుగుతున్నది. ఇవి అవసరమే అయినా, మార్కెట్ అవసరాలే ప్రధాన ప్రమాణంగా మారితే, హ్యూమానిటీస్, బేసిక్ సైన్సెస్ వంటివి పక్కకు తొలగిపోతాయి. ఈ విషయాలను నిర్లక్ష్యం చేస్తే కొత్త నైపుణ్యాలతో ప్రయోజనం ఉండదు. అదేవిధంగా బోధన తీరు కూడా మారుతుంది. ల్యాబ్ డిమోనిస్ట్రేషన్లు, క్యాంపస్ ప్రదర్శనలు, ప్రచార కార్యక్రమాలు ముఖ్యమవుతాయి. బోధన కంటే ప్రదర్శనకు ప్రాధాన్యత పెరుగుతుంది. ఇప్పటికే ఈ రకమైన పనితీరుతో కళాశాలలు ప్రదర్శనా వేదికలుగా మారాయి.

ఇప్పుడు అధ్యాపకులు జూనియర్ కళాశాలలకు వెళ్లాలి. ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. బ్రోచర్లు తయారుచేయాలి. విద్యార్థులను ఆకర్షించాలి. దీనికోసం వాస్తవాతీత ప్రమాణాలు కూడా చేయాల్సి వస్తున్నది. ఉపాధ్యాయుల పని బోధించడం, మార్గనిర్దేశం చేయడం, జ్ఞానం సృష్టించడం. కానీ మార్కెటింగ్ చేయడం కాదు. ఈ ప్రక్రియలో వారానికోసారి నివేదికలు, సమీక్షలు తప్పనిసరి చేశారు. ఇది ఆడిట్ కల్చర్ పెరుగుదలకు ఉదాహరణ. ఇందులో పనిని సంఖ్యల్లో కొలుస్తారు. అధ్యాపకులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. సృజనాత్మకత తగ్గి, కేవలం ఆదేశాల అమలు మాత్రమే మిగులుతాయి. కళాశాలలకు స్వయంప్రతిపత్తి ఇచ్చినట్టు చెప్పినా, వాస్తవానికి నియంత్రణ పెరుగుతుంది.

ప్రభుత్వం ఆదేశించిన తాజా మార్పులను సరిదిద్దడానికి కృషి చేయాల్సిన సంఘాలు పోస్టర్లు విడుదల చేస్తున్నాయి. వీటిని గొప్ప కార్యక్రమాలుగా ప్రచారం చేస్తున్నాయి. ఇది అవగాహన లోపం కావచ్చు లేదా అధికారులతో చేతులు కలిపిన వైఖరి కావచ్చు. అధ్యాపక సంఘాల బాధ్యత ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడడం. విద్యా వాతావరణాన్ని రక్షించడం. కానీ అవే సంఘాలు సరికొత్త మార్పులకు మద్దతిస్తే, అది ప్రజావిద్యకు ప్రమాదకరం. కళాశాలలు పరస్పరం పోటీ పడతాయి. దీనివల్ల అసమానతలు పెరుగుతాయి. విద్య మార్కెట్ ఆధారంగా మారుతుంది. అధ్యాపకుల స్వాతంత్ర్యం తగ్గుతుంది. ఇది కేవలం విద్య సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్య సమస్య. ప్రజావిద్య లక్ష్యం విమర్శనాత్మక ఆలోచన కలిగిన పౌరులను తయారుచేయడం. అది మార్కెట్‌గా మారితే, ఈ లక్ష్యం దెబ్బతింటుంది.

ఈ పరిస్థితికి పరిష్కారం పోటీ పెంచడం కాదు. ప్రజావిద్య అసలు విలువలను మళ్లీ స్థాపించాలి. అన్ని ప్రభుత్వ కళాశాలలు పరస్పరం సహకరించాలి. విద్యార్థుల సమాన పంపిణీ ఉండాలి. అధ్యాపకుల గౌరవం కాపాడాలి. అధ్యాపక సంఘాలు తమ బాధ్యతను గుర్తించాలి. అధికారాల అనుబంధాలుగా కాకుండా, విద్యావిలువల రక్షకులుగా పనిచేయాలి. లేకపోతే, ఈ ఎండోజెనస్ ప్రైవేటైజేషన్ నిశ్శబ్దంగా కొనసాగుతూ, ప్రజావిద్య లక్ష్యాన్ని పూర్తిగా మార్చేస్తుంది.

(రచయిత: అధ్యాపకుడు)

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే చరిత్ర క్షమించదు



వొద్యారపు రవికుమార్


రాష్ట్రంలో మన భారత రాజ్యాంగ పీఠిక అభాసు పాలవుతున్నది. పౌరుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వేదన కలిగిస్తున్నది. బాధ్యతాయుత ప్రభుత్వం చేయాల్సిన పని ఇలా కానే కాదు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన కాళరాత్రులను ప్రజల జీవితాల్లోకి ప్రవహింప చేస్తున్నది. చట్టం ముందు అందర్నీ సమానంగా చూస్తామని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ప్రమాణం చేసిన నాయకులు వాటిని గాలికొదిలేస్తున్నరు. ఎవ్వరూ చెప్పినా.. ఎంత చెప్పినా.. ప్రజల గగ్గోలు పెడుతున్నా... గోడు గోడమని గోస పడుతున్నా కనీసం కనికరించడం లేదు. ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చేస్తారో తెలియదు. ఎప్పుడు ఎక్కడ హైడ్రాపేరుతో బుల్డోజర్లు వస్తాయో తెలియని భయానక వాతావరణం నేడు రాష్ట్రంలో కన్పిస్తూ ఉన్నది.

ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రజల ముందు ఉంచింది. ఏడో గ్యారెంటీగా భావప్రకటనా స్వేచ్ఛను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రజల ఆస్తులు కూలుస్తామని ఎనిమిదో గ్యారెంటీని చెప్పకుండా దాచుకున్నది. ఇప్పుడు తమ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నదనే అనుమానం ప్రజల్లో కలిగేలా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ వ్యవహార శైలి గురించి మరింత నిర్దుష్టంగా చెప్పాలంటే భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీ అయిన ఆర్టికల్ 19, 21తో పాటు చట్టబద్ధమైన ఆస్తి హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. తమ జీవన భద్రతకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. 1973లో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. అదే కేశవానంద భారతీ కేసుగా చరిత్రకెక్కింది. పౌరుల హక్కుల కంటే పార్లమెంట్, అసెంబ్లీ చేసిన చట్టాలు మహోన్నతమైనవి ఏమీ కాదని చెప్పింది. హైడ్రాపై అసెంబ్లీ ఆమోదముద్ర వేయించుకున్నంత మాత్రాన ప్రజల ఆస్తులను, వారి గౌరవ ప్రదమైన జీవితాలను ధ్వంసం చేసే హక్కు చట్టసభలకు ఉంటుందా? ప్రజల జీవితాలకు రక్షణ లేకుండా చేయాలని చట్టాలు చెప్తున్నాయా.? ప్రభుత్వం వహరిస్తున్న తీరు ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధం కాదా?

1960-80 మధ్య కాలంలో భారత రాజ్యాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న సందర్భం. ఎస్ఆర్ బొమ్మై కేసు, కేశవానంద భారతి కేసుతోపాటు చాలా కేసుల్లో న్యాయస్థానాలు చొరవ తీసుకోవడం వల్ల భారత ప్రజాస్వామ్య సజీవతకు బీజం పడింది. అంతేకాదు పౌరులు గౌరవప్రదంగా, నిర్భయంగా జీవించే ధైర్యాన్ని కూడా న్యాయస్థానాలు కల్పించాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కోర్టులు మొట్టికాయలు వేసినా తన తీరు మార్చుకోవడం లేదు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇది ఇటీవల పరాకాష్ఠకు చేరింది. ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న వెలుగుమట్లలో పేదలకు చెందిన వందలాది నివాసాలను ధ్వంసం చేసింది. ప్రజల పట్ల ప్రేమ లేకపోవడమే ఇందుకు కారణమా? లేకపోతే చట్టాల పట్ల గౌరవం లేకపోడమే కారణమా? తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నారా?

కాంగ్రెస్ పార్టీ తమది ప్రజాస్వామ్యయుత నేపథ్యం అని చెప్పుకుంటుంది. కానీ చర్యలు మాత్రం దానికి భిన్నంగా ఉంటాయి. భవిష్యత్తు అభివృద్ధి కోసమని గడిచిన ఏడు దశాబ్దాలుగా ఇక్కడి పేదలకు జీవనాధారమైన భూములు కోల్పోయారు. ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక్కడి వారు మాత్రం మౌలిక సదుపాయాల కోసమని, నైట్ మార్కెట్ కోసమని నివాసాలను, భూములను కోల్పోతున్నారు. మన రాజ్యాంగం ఇచ్చిన హామీ ప్రకారం ఎవరైనా ఎక్కడైనా జీవించొచ్చు, వ్యాపారాలు చేసుకోవచ్చు. నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఇతరుల కోసం తరాలకు తరాలు ఆస్తులు కోల్పోవడాన్ని రాజ్యాంగం సమర్థిస్తుందా? ఇక్కడి పేదలను నిలువునా ముంచుతామని అంటే నిర్దేశిత చట్ట నియామాలు మౌనంగా ఉంటాయా? ఎలాంటి అభివృద్ధి అయినా సరే విధ్వంసం, విస్తాపనకు ప్రత్యామ్నాయాలు లేనే లేవా? ఈ తీరులో పాలకులు ఎందుకు ఆలోచించడం లేదు?



మూసీ సుందీకరణ కోసం సుమారు యాభై కిలోమీటర్ల మేర లక్షలాది నివాసాలను ధ్వంసం చేస్తామని అంటే ఎట్లా ఊరుకోవాలి? చిన్నచిన్న పనులు చేసుకొని పొట్ట పోసుకుంటున్న బడుగు జీవుల గూళ్లను చెదరగొడ్తామంటే ఎట్లా? మధ్య తరగతి వారి జీవితపు కలం సొంత ఇల్లు. బ్యాంకు లోన్లు తీసుకొని ఏండ్లకు ఏండ్లు కిస్తీలు కట్టుకుంటున్న వారి ఆశలను అడియాశలు చేస్తామంటే ఎట్లా? ప్రైవేటు రంగంలో జీవన భద్రతకు గ్యారెంటీ లేదు. అప్పుల మధ్యనే జీవితం సాగుతూ ఉంటుంది. అలాంటి వారికి రేపటి నుంచే మీ ఇండ్లు ఉండవు పోండి! అంటే వారు ఎక్కడ తలదాచుకోవాలి? జీవితం అల్లకల్లోలం అవుతున్నట్టే కదా? తాజాగా సంగారెడ్డిలో హైడ్రా కూల్చివేతల గురించి మీడియాలో వీడియోలు చూస్తే భయాందోళనలు కలుగుతున్నాయి. కూల్చే యంత్రానికి హృదయం లేదు. కానీ పైనుంచి ఆదేశాలిచ్చే వారికి, వాటిని అమలు చేసే వారికి హృదయం ఉంటుంది కదా? అది పనిచేయడం లేదు ఎందుకు? లేకపోతే అధికారానికి కండ్లు ఉండవు, సంపదకు ఆత్మ ఉండదనే నానుడిని నిజం చేస్తున్నారా? ఎవరెట్లా అనుకున్నా తాము అనుకున్న విధంగా ముందుకెళ్తామనే ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారా? కాంగ్రెస్ పాలనలో కూల్చడం తప్పా నిర్మించడం ఎక్కడైనా ఉన్నదా? కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమున్నదని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. అంతా తమ ఇష్టం అనే భావనతో పాలకులు ఉంటే గనుక ముమ్మాటికీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్టే, పౌరుల జీవన భద్రతను గాలికి వదిలేసినట్టే.. భారత రాజ్యాంగ పీఠికకు తూట్లు పొడుస్తున్నట్టే. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలక పెద్దలు తప్పును సరిచేసుకోకుంటే చరిత్ర అస్సలు క్షమించదు.

(వ్యాసకర్త: న్యాయవాది)

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య సీజ్‌ఫైర్

10 రోజుల పాటు కాల్పుల విరమణ

ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

దీనితో కలిపి 10 యుద్ధాలు తానే ఆపానని వెల్లడి

› 6



జగిత్యాల సభతోనే బీఆర్‌ఎస్ జైత్రయాత్ర

సభను అడ్డుకునేందుకు రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్

మోసంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది: పల్లా రాజేశ్వర్ రెడ్డి

జగిత్యాలలో సభ ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్‌ఎస్ నేతలు

› 3

శుక్రవారం FRIDAY 17.4.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 312 ‖ వెల (Price) రూ.6.50

అమావాస్య

శుక్రవారం, సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-33. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం తిథి: అమావాస్య సాయంత్రం 5-22 వరకు. నక్షత్రం: రేవతి పగలు 12-02 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: ఉదయం 10-41 నుంచి పగలు 12-15 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-20 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-40 నుంచి పగలు 1-30 వరకు. అమృతకాలం: ఉదయం 9-49 నుంచి ఉదయం 11-17 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

తెలంగాణపై బీజేపీ తేజాబ్

దేశవిభజనతో పోల్చిన ఎంపీ.. పార్లమెంట్ సాక్షిగా రాష్ట్ర ఏర్పాటుపై విషం


- ఇండియా, పాకిస్థాన్‌లను విభజించినట్టు రాష్ట్రాన్ని విభజించారన్న తేజస్వీ సూర్య
- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి చోద్యం
- 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీల మౌనం
- పార్లమెంట్ ప్రాంగణంలోనే ఉన్నా తేజస్వీ వ్యాఖ్యలపై నోరెత్తని రేవంత్ అండ్ టీమ్
- బీజేపీ నేత అక్కసుపై భగ్గుమన్న తెలంగాణ
- పలుచోట్ల తేజస్వీ దిష్టిబొమ్మల దహనం

తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీలో తాకట్టు

దేశవిభజనతో పోల్చినా రాష్ట్ర ఎంపీల మౌనం

బీజేపీ, తేజస్వీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి: కేటీఆర్

ఇది రాష్ట్ర ప్రజలను అవమానించడమే: హరీశ్‌రావు



తెలంగాణపై బీజేపీ బుసకొడుతూనే ఉన్నది. ఈ నేల ఆత్మగౌరవంపై విషం చిమ్ముతూనే ఉన్నది. ఉద్యమకాలం నుంచీ తెలంగాణంటే బీజేపీకి అదే కంటగింపు! రాష్ట్రం ఏర్పడి పుష్కరం దాటుతున్నా ఆ అక్కసు ఆగలేదు, ఆ కడుపుమంట చల్లారలేదు. ప్రజా పోరాటంతో సిద్ధించిన రాష్ట్రాన్ని ఆ పార్టీ నేతలు నిత్యం అవమానిస్తూనే ఉన్నారు. తల్లిని చంపి, బిడ్డను బతికించారన్న ప్రధాని వాఖ్యల మొదలు నేటికీ మాటలు తూలుతూనే ఉన్నారు.

బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపలేదు.

అదే లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఎంపీ ఒక్కరైనా ఉండి ఉటే పరిస్థితి ఇలాగే ఉండేదా? రాష్ట్రానికి చెందిన 16మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల్లాగా ఇలాగే చోద్యం చూస్తూ ఉండేవారా? తల్లి తెలంగాణను అన్నందుకు నిప్పుకణికలై మండేవారు కాదా?

వరంగల్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ఆత్మగౌరవంపై బీజేపీ వేయి తలల విషనాగై బుసకొడుతూనే ఉన్నది. తెలంగాణ పూర్తిగా పురుడు పోసుకోకముందే ప్రధాని మోదీ విషం చిమ్మడం మొదలుపెట్టగా, ఆ పార్టీ నేతలు వరుసగా తెలంగాణ పుట్టుకను అవమానిస్తూనే ఉన్నారు. తాజాగా బీజేపీ ఎంపీ తేజస్వీసూర్య తెలంగాణ ఏర్పాటును ఏకంగా దేశ విభజనతో పోల్చారు. అత్యంత చెత్త విధానంతో బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరు చేశారంటూ అక్కసు వెల్లగక్కారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవంపై దాడికి తెగబడ్డారు. ఇంత జరుగుతున్నా, తెలంగాణ నుంచి ఎన్నికైన 16 మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు అదే సభలో ఉండి, పండ్లు ఇకిలించి నవ్వారే తప్ప 'ఇదేమిటి?' అని ఒక్కరు కూడా మాటవరుసకైనా అనలేకపోయారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ఎంపీల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, సహచర మంత్రులు, ఎంపీలు అదే పార్లమెంట్ ప్రాంగణంలో ఉన్నా ఒక్కరైనా నోరు మెదపలేకపోయారు. అయితే.. అదే ఎంపీ తేజస్వీ సూర్య తమిళనాడు ప్రభుత్వం భాషావేర్పాటువాదం › 2వ పేజీలో

ఎంత తేడా!

తెలంగాణపై విషం చిమ్మడానికి ముందు అదే బీజేపీ ఎంపీ తేజస్వీసూర్య తమిళనాడుపైనా నోరుపారేసుకున్నారు. 'తమిళనాడు రాజకీయ పక్షాలు భాషావేర్పాటువాదాన్ని ప్రదర్శిస్తున్నాయి' అని అన్నారు. అంతే! సభలో ఉన్న తమిళ ఎంపీలు భగ్గున మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా లేచి నిరసన తెలిపారు. ప్యానల్ చైర్మన్‌గా ఉన్న ఏకే ప్రేమ్ చంద్రన్ సైతం తేజస్వీ వ్యాఖ్యలను సవరించుకోవాలని సూచించారు. మరి తెలంగాణను అంటే ఇక్కడి బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలకు నోరెందుకు రాలేదు?

బీసీలతో కాంగ్రెస్ రాజకీయ క్రీడ!



- ముస్లిం ఓటుబ్యాంకు కోసం కాంగ్రెస్ పన్నాగం
- కులగణనను ముందుపెట్టి రేవంత్ బంతాట
- బీసీలను కులాలవారీగా లెక్కగట్టిన ప్రభుత్వం
- ముస్లిం కులవ్యవస్థను ఉద్దేశపూర్వక విస్మరణ
- ప్రామాణికత లేకుండా ముస్లిం-ఓబీసీ క్యాటగిరీ
- తమను తగ్గించి చూపారని రగులుతున్న బీసీలు

హైదరాబాద్, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ): ముస్లిం ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు కాంగ్రెస్ పొలిటికల్ గేమ్ ఆడుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై రూపొందించిన కులగణన నివేదికలో బీసీలు 56.33 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. ఇందులో ముస్లింలు 10.45 శాతం ఉన్నారని, బీసీల్లో అత్యధికులు వారేనని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అయితే వ్యూహాత్మకంగానే బీసీల్లో అతిపెద్ద సామాజిక వర్గంగా ముస్లింలను ప్రకటించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 42 శాతం రిజర్వేషన్ల నాటకం బెడిసికొట్టి బీసీల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముస్లిం ఓటర్లను తమ వైపునకు ఆకర్షించే వ్యూహంతోనే బీసీ కులగణన నివేదిక రూపొందించినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. బీసీలకు 42 శాతం ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ › 4వ పేజీలో

నోరువిప్పని బడుగు నేతలు

- సర్కార్ లెక్కలపై సంఘాల నేతల మౌనం

జనాభాలో సింహభాగం బీసీలే!

- రాష్ట్రంలో బీసీలు 46.25%, ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, మైనార్టీలు 12.56%, ఇతర ఓసీలు 13.31 శాతం

భూమిపై ఆ వర్గాలదే ఆధిపత్యం

- రెడ్డి, యాదవ, లంబాడా వద్దే ఎక్కువ భూమి

కులాంతర వివాహాల్లో 'అగ్ర'వర్ణాలు

- ఎక్కువగా మొగ్గు చూపుతున్నది బ్రాహ్మణులే

ఎస్సీ, ఎస్టీ జనాభాలో 67శాతం వెనుకబాటే



ఉచిత బస్సే నిజమైన సంక్షేమమట!

› 4

- రైతుభరోసా కన్నా అదే అత్యంత ఉత్తమం!
- ఆ స్కీమ్‌తోనే ప్రజలకు ఎక్కువ ప్రయోజనం
- ఉచిత విద్యుత్తూ దానిముందు దిగదుడుపే
- కుటుంబ సర్వే నివేదికలో రేవంత్ సర్కార్

తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోలుస్తరా?

మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ




హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : 60 ఏండ్ల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది విద్యార్థుల బలిదానాల సాక్షిగా, రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అవివేకానికి పరాకాష్ట అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు రాష్ట్ర విభజనతో సంబంధం లేని చర్చలో పదేపదే తెలంగాణ అంశం తీయడం వెనుక మోదీ ఎజెండా ఏమై ఉంటుంది? తన దోస్త్ చంద్రబాబు కోసం తెలంగాణ మనోభావాలను కించపరుస్తారా? అని ప్రశ్నించారు. లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్వరం లేకపోవడం వల్లే ఇతర రాష్ట్రాల నాయకులు తెలంగాణ రాష్ట్రంపై విషం కక్కుతున్నారని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రం నుంచి 16 మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఉన్నప్పటికీ, తేజస్వీ సూర్య మాట్లాడుతుంటే కనీసం అడ్డుకోలేక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తేజస్వీ సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తేజస్వీ వ్యాఖ్యలు అసంబద్ధం: ఎంపీ వద్దిరాజు




తెలంగాణ ఏర్పాటు తీరును బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చడంపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలు అసంబద్ధమైనవిగా పేర్కొని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు అహింసామార్గంలో ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం యావత్ ప్రపంచానికి తెలిసిందేనని గుర్తుచేశారు. ఈ వాస్తవాన్ని మర్చిపోయి ఎంపీ తేజస్వీ దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆయన తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ధ్వజమెత్తారు.

రాజ్యాంగ విరుద్ధం: వేముల ప్రశాంత్‌రెడ్డి




తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం, అవివేకపూరితమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధంగా, పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఒక రాష్ట్రం ఏర్పడటాన్ని దేశ విభజనతో ముడిపెట్టి శత్రుదేశమైన పాకిస్థాన్‌తో పోల్చడం క్షమించరాని నేరమని ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేలాదిమంది అమరుల త్యాగాలను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వీ వ్యాఖ్యలు ఉన్నాయని వేముల మండిపడ్డారు. 'బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసిన ఎంపీపై వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలి' అని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడమంటే పార్లమెంట్‌ను, 140 కోట్ల దేశ ప్రజలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. ఇది క్షమించరాని నేరమని పేర్కొన్నారు.

తెలంగాణకు అవమానమే: ఎర్రబెల్లి దయాకర్‌రావు



పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చడం రాష్ట్ర ప్రజలందరినీ అవమానించడం, అగౌరవపరచడమేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఇలా మాట్లాడిన ఎంపీ సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అనేక మంది త్యాగం, పోరాటంతో తెలంగాణను సాధించుకున్నామని, ఎవరి దయతోనో తెలంగాణ ఏర్పడలేదని తెలిపారు. ఎంపీ సూర్య మాటలను ఖండించకుండా కూర్చున్న తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల తీరు సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఇతర ఆరుగురు ఎంపీలు సూర్య వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పాకిస్థాన్‌తో పోలుస్తరా?: నామా నాగేశ్వరరావు



తెలంగాణ ఏర్పాటును బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం సిగ్గుచేటని మాజీ ఎంపీ నామ నాగేశ్వర్‌రావు ఖండించారు. ఆయన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానమని గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ద్వేషపూరిత వైఖరి దేశ ఐక్యతకు విఘాతాన్ని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను అవమానిస్తుంటే ప్రతిఘటించాల్సిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనం వహించడం దురదృష్టకరమన్నారు.

తెలంగాణపై బీజేపీ తేజాబ్

మొదటిపేజీ తరువాయి...

ప్రదర్శిస్తున్నదంటూ ఒక్క మాట అనగానే, తమిళనాడు ఎంపీలంతా లేచి నిరసన తెలిపారు. అలాంటిది తెలంగాణ రాష్ట్ర పుట్టుకనే అవమానిస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు గుడ్లప్పగించి చూశారే తప్ప కనీసం అడ్డుచెప్పిన పాపాన పోలేదు. దీనిని బట్టి రాష్ట్రం ఏర్పడి 13 ఏండ్లు కావస్తున్నా బీజేపీ, కాంగ్రెస్‌కు తెలంగాణపై అక్కసు తగ్గలేదని మరోసారి తేలిపోయింది.

ఆవిర్భావానికి ముందునుంచే బీజేపీ విషం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బీజేపీ మొదటి నుంచీ జీర్ణించుకోలేకపోతున్నది. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవంపై ముప్పేట దాడి చేస్తున్నది. 2014లో ప్రధాని మోదీ నుంచి, గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వీసూర్య దాకా సమస్త బీజేపీ పటాలమంతా తెలంగాణపై కాలకూటవిషాన్ని కక్కుతున్నది. సందర్భం లేకపోయినా, రాజకీయ సభ అయినా, దేశ అత్యున్నత ప్రజాస్వామ్య ప్రతిరూప వేదిక లోక్‌సభ అయినా తెలంగాణ రాష్ట్రాన్ని అవమానిస్తూనే ఉన్నది. స్వరాష్ట్ర ఏర్పాటుకోసం దశాబ్దాలపాటు అలుపెరుగకుండా చేసిన ఉద్యమాన్ని పలుచన చేసి, వందలాది మంది బిడ్డల ఆత్మబలిదానాలను అవహేళన చేస్తూనే ఉన్నది. దేశంలో తక్కిన రాష్ట్రాలు ఏర్పడినప్పుడు పడని ఈర్ష్యాద్వేషాలను తెలంగాణపైనే వెదజల్లుతున్నది. అసలు రాష్ట్రం ఏర్పడకపోతే బాగుండుననే మనసులోని మాటను ఎప్పటికప్పుడు బయటపెడుతూనే ఉన్నది.

దాయాది రాష్ట్రాలుగా మారుస్తారా?

బీజేపీ, కాంగ్రెస్ రెండు జాతీయ పార్టీల వైఖరి చూస్తుంటే తెలంగాణ రాష్ట్రాన్ని తమ బద్ధశత్రువుగా గుర్తిస్తున్నాయా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం తేజస్వీసూర్య వ్యాఖ్యలను, సభలో ఉండి అడ్డుకోని బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల వైఖరి అదే అభిప్రాయంతో ఉన్నట్టు అనుమానిస్తున్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు ఆవిర్భవించాయి. వాటిపై లేని అక్కసును తెలంగాణపై ప్రత్యక్షంగా అధికర పక్షం, పరోక్షంగా విపక్షం జతకూడి ప్రదర్శించడమే ఇందుకు నిదర్శనంగా చెప్తున్నారు. రాష్ట్ర విభజనను భారత్, పాకిస్థాన్ విభజన కంటే దారుణంగా ఉందని బీజేపీ ఎంపీ పేర్కొనడం వెనుక తెలంగాణ, ఏపీ ప్రజలు శాశ్వత శత్రువులుగా కొట్లాడుకోవాలని బీజేపీ భావిస్తున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పండ్లు ఇకిలించి బల్లలు చరుస్తరా?

రాష్ట్ర ఏర్పాటునే బీజేపీ తప్పుబడుతుంటే 16మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పండ్లు ఇకిలించి బల్లలు చరుస్తారా? అని తెలంగాణ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. బీజేపీ ఎంపీ తేజస్వీ లోక్‌సభలో ప్రసంగిస్తున్న సమయంలో ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా ఎంపీలందరూ సభలో ఉన్నా ఏ ఒక్కరూ నోరు తెరువకపోవడం దారుణమని తెలంగాణవాదులు భగ్గుమంటున్నారు. ఇంటోడుపోయి దొంగల్ల కలిసినట్టే ఎంపీల వ్యవహారం ఉన్నదని ఆగ్రహిస్తున్నారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆ వ్యాఖ్యలకు కొనసాగింపుగా పార్లమెంట్ వేదికగా అడ్డగోలు అబద్ధాలను వల్లెవేశారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో ఏడు మండలాలు ఏపీకి ధారాదత్తం అయ్యింది రాష్ట్ర విభజన బిల్లులోనే అని అసత్య ప్రచారం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇలా సందర్భం వచ్చిన ప్రతిసారీ తెలంగాణపై విషం కక్కుతూనే ఉన్నదని తెలంగాణవాదులు కన్నెర్రజేస్తున్నారు.



లోక్‌సభలో తేజస్వీ సూర్య



ఓయూలో తేజస్వీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్వీ నేతలు

> **బీజేపీ విషం:** 'భారత్, పాకిస్థాన్‌ను ఎంత దుర్మార్గంగా విభజించారో, అంతకన్నా ఘోరంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన జరిగింది'
> **– పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీసూర్య**
>
> **మన ఎంపీల మౌనం:** కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 16మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు అక్కడే ఉన్నారు. అందులో ఏ ఒక్కరు కూడా అదేమిటని ప్రశ్నించిన పాపానపోలేదు.
>
> **తమిళ ఎంపీల పోరాటం:** తెలంగాణపై విషం చిమ్మేకన్నా పది నిమిషాల ముందు తేజస్వీసూర్య 'తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీ భాషా దురభిమానం ప్రదర్శిస్తున్నది' అని పేర్కొన్నారు. అంతే.. సభలో ఉన్న తమిళనాడు సభ్యులు పార్టీలకతీతంగా లేచి నిరసన తెలిపారు. ప్యానల్ చైర్మన్‌గా ఉన్న ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ సైతం తేజస్వీ వ్యాఖ్యలను సవరించుకోవాలని సూచించారు.

బాబుతో దోస్తీ కట్టి తెలంగాణపై దండయాత్ర

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును మొదటినుంచి వ్యతిరేకించిన వ్యక్తి టీడీపీ అధినేత చంద్రబాబు. ఆయనతో జతకట్టి సందర్భం వచ్చిన ప్రతిసారీ రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ బలిపెడుతున్నది. తన మిత్రుడికి శత్రువు తనకూ శత్రువే అన్నట్టు తెలంగాణపై వివక్ష ప్రదర్శిస్తున్నది. అదే పార్లమెంట్ వేదికగా గత నెల 10న టీడీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బ్లాక్‌డేగా అభివర్ణించారు. కానీ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల్లో ఏ ఒక్కరు కూడా ప్రశ్నించలేదు. 'తెలంగాణ నా బ్రెయిన్ చైల్డ్' అంటూ కొత్తరాగం అందుకున్న రెండు కండ్ల సిద్ధాంతకర్త చంద్రబాబు కూడా తమ పార్టీ ఎంపీని మందలించిన పాపానపోలేదు. దీనిని బట్టే చంద్రబాబు కండ్లల్లో ఆనందాన్ని నింపేందుకు అవకాశం వస్తే తెలంగాణ గడ్డపై దండయాత్ర చేసేందుకు వెనుకాడమనే రీతిలో బీజేపీ వ్యవహరిస్తున్నదని విశ్లేషకులు మండిపడుతున్నారు. అసలు రాష్ట్ర విభజనతో సంబంధం లేని చర్చల్లో పదేపదే తెలంగాణ ఏర్పాటు అంశం తేవడం వెనుక మోదీ, బాబు రహస్య ఎజెండా ఉన్నదనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా తెలంగాణ గడ్డ నుంచి గెలిచిన 16 మంది ఎంపీలు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటం ఆ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

పిడికిలెత్తిన తమిళులు.. మన ఎంపీల పరాధీనత

ఆత్మగౌరవానికి అసలు సిసలు సాక్ష్యం తమిళనాడు ప్రజాప్రతినిధులని మరోసారి నిరూపించారు ఆ రాష్ట్ర ఎంపీలు. గురువారం లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, వీటికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులపై చర్చ సందర్భంగా ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకున్నది. బీజేపీ ఎంపీ తేజస్వీ తెలంగాణపై విషం కక్కే ముందు 'తమిళనాడులో డీఎంకే భాషా వేర్పాటువాదం ప్రదర్శిస్తున్నది' అని పేర్కొన్నారు. అంతే సభలో ఉన్న తమిళనాడుకు చెందిన సభ్యులు పార్టీలకతీతంగా లేచి నిరసన తెలిపారు. ఆ సమయంలో ప్యానల్ చైర్మన్‌గా ఉన్న (స్పీకర్ స్థానంలో ఉన్న) ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ సైతం ఎంపీ తేజస్వీ వ్యాఖ్యలను సవరించుకోవాలని సూచించారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రాన్ని, దేశభక్తిని తమిళనాడు ప్రజాప్రతినిధులు ఏ స్థాయిలో గౌరవిస్తున్నారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. కానీ అదే వేదికగా అదే ఎంపీ తెలంగాణ రాష్ట్ర విభజనను భారత్, పాకిస్థాన్‌తో పోల్చినా ఈ గడ్డ నుంచి గెలిచిన మంత్రులు, ఎంపీలు అభ్యంతరం కూడా చెప్పకపోవటం మన వాళ్ల పరాధీనతకు పరాకాష్టగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని మోదీ నుంచి ఆ పార్టీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు.

మోదీ విషపు వ్యాఖ్యలు

- **2014 ఫిబ్రవరి 28: (కర్ణాటకలోని గుల్బర్గాలో..)** 'తల్లిని చంపి బిడ్డను బతికించినట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను విభజించారు. సీమాంధ్ర ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ అనాథగా మార్చివేసింది'
- **2014 ఏప్రిల్ 30: (తిరుపతి సభలో)** 'తల్లి నుంచి బిడ్డను వేరు చేశారు'
- **2018 ఫిబ్రవరి 7: (పార్లమెంట్‌లో)** 'ఎన్నికల్లో లబ్ధికోసం పార్లమెంట్ తలుపులు మూసి ఏపీని విభజించారు. రాజకీయ స్వార్థంతో హడావుడి విభజన నిర్ణయం తీసుకొన్నారు'
- **2018 జూలై 21: (పార్లమెంట్‌లో)** 'కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ తలుపులు మూసి ఒక రాష్ట్రాన్ని విభజించింది. తల్లిని చంపి బిడ్డను బతికించింది వాస్తవం కాదా?'
- **2022 ఫిబ్రవరి 8: (పార్లమెంట్‌లో)** 'ఆంధ్రప్రదేశ్‌ను అవమానకరమైన రీతిలో విభజించారు. దర్వాజాలు బంద్ చేసి, ఎలాంటి చర్చలు లేకుండానే అప్రజాస్వామికంగా నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రా ప్రాంత నాయకులు మాట్లాడకుండా మైకులు బంద్ చేశారు. పెప్పర్ స్ప్రే దాడులు చేయించారు. అహంకారంతో కూడిన అధికారమత్తులో చేశారు. ఈ క్రమంలో జరిగిన పరిణామాలకు కాంగ్రెస్సే కారణం.
- **2023 సెప్టెంబర్ 18: (పాత పార్లమెంట్ భవన స్మృతులను గుర్తుచేసుకుంటూ)** 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం భారీ పోరాటాలు జరిగాయి. రక్తం ఏరులై పారింది. కానీ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అటు తెలంగాణ ప్రజలు ఉత్సవాలు చేసుకోలేదు. ఇటు ఆంధ్రా ప్రజలు సంతోషంగా లేరు. నాడు రాష్ట్ర విభజన సరిగా జరగలేదు. ప్రజలు కోరుకున్న విధంగా, ఉత్సాహభరిత వాతావరణంలో విభజన జరిగి ఉంటే.. తెలంగాణ ఇప్పుడు మరింత ఉజ్వలంగా ఉండేది'
- **అమిత్‌షా : 2019 ఆగస్టు 6: (పార్లమెంట్‌లో)** 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజనను కాంగ్రెస్ ఆమోదించిన రోజు ప్రజాస్వామ్యానికి చీకటి'
- **తేజస్వీ సూర్య; 2026 ఏప్రిల్ 16:** 'ఎంత దుర్మార్గంగా, అత్యంత చెత్తవిధానంలో భారత్, పాకిస్థాన్‌ను విభజించారో, అంత కన్నా ఘోరంగా ఆంధ్రప్రదేశ్ విభజన జరిగింది'

తెలంగాణకు అవమానం.. కాంగ్రెస్, బీజేపీ ఎంపీల మౌనం

- **నిండు సభలో తెలంగాణ ఏర్పాటును అవమానించిన బీజేపీ ఎంపీ తేజస్వీ**
- **భారత్-పాక్ విభజనతో పోల్చిన వైనం**
- **సభలోనే ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు**
- **నోరు మెదపని 16 మంది రాష్ట్ర ఎంపీలు**
- **పార్లమెంట్ ఆవరణలోనే ఉన్నా స్పందించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
- **కాంగ్రెస్, బీజేపీ ఎంపీలపై ప్రజల ఆగ్రహం**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): తల్లిలాంటి తెలంగాణను పార్లమెంట్ సాక్షిగా నిండు సభలో బీజేపీ ఎంపీ అవమానిస్తే, తెలంగాణకు చెందిన 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కిక్కురుమనలేదు. కనీసం ఖండించేందుకు నోరెత్తలేదు. తెలంగాణను అవమానిస్తే మాకెందుకులే..? అనే ధోరణిలో ఇతర రాష్ట్రాల ఎంపీల మాదిరిగానే తెలంగాణ ఎంపీలు సైతం బెల్లంకొట్టిన రాయిలా మౌనంగా ఉండిపోయారు. కనీసం లేచి నిలబడి అభ్యంతరమో, నిరసననో తెలిపేందుకు కూడా ప్రయత్నించలేదు. తెలంగాణను అవమానించినప్పటికీ స్పందించని ఎంపీల తీరుపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం కావాలి, తెలంగాణ ప్రజల ఓట్లు కావాలి కానీ, తెలంగాణను ఎవరేమన్నా తమకు అవసరంలేదనే విధంగా ఎంపీలు వ్యవహరించారనే ఆగ్రహం వ్యక్తమవుతున్నది. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై చర్చ సందర్భంగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణపై జుగుప్సాకరమైన, తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా అవమానించేలా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్, పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ రోత వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో గర్జించాలి. తేజస్వీ వ్యాఖ్యలపై ఆందోళన చేయాలి. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలి. కానీ, ఈ పనిని ఒక్కరంటే ఒక్క తెలంగాణ ఎంపీ కూడా చేయకపోవడం శోచనీయం. తేజస్వీ సూర్య ఈ రోత వ్యాఖ్యలు చేస్తున్న సందర్భంలో ఆయనకు అటువైపు, ఇటువైపు తెలంగాణకు చెందిన 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు మొత్తం 16 మంది కూర్చున్నారు. కానీ, వీరిలో ఒక్కరంటే ఒక్కరు కూడా నోరు మెదపలేదు. కనీసం లేచి నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. తెలంగాణ తమ రాష్ట్రం కాదనుకున్నారో లేక తెలంగాణను తిడితే తమకొచ్చిన నష్టమేమిటని అనుకున్నారో తెలియదు కానీ, కనీసం స్పందించే ధైర్యం చేయలేదు.

పార్లమెంట్ ఆవరణలోనే ఉన్న సీఎం రేవంత్

దీనికితోడు ఆ సందర్భంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఆవరణలోనే ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు కూతవేటు దూరంలోనే ఉన్నారు. ఎప్పుడైతే ఎంపీ తేజస్వీ తెలంగాణ ఏర్పాటును అవమానించేలా వ్యాఖ్యలు చేశారో.. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని తమ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేయాలి. తేజస్వీ వ్యాఖ్యలను ఖండించాలని, నిరసన వ్యక్తం చేయాలని తమ పార్టీ ఎంపీలకు సూచించాలి. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి సైతం తెలంగాణకు జరిగిన అవమానాన్ని తేలిగ్గా తీసుకున్నట్టున్నారు. అందుకే ఆయన కూడా స్పందించలేదు.

'తెలంగాణ'పై బీజేపీ విషం



- **పార్లమెంట్ సాక్షిగా ఆ పార్టీ ఎంపీ తేజస్వీ తీవ్ర వ్యాఖ్యలు**
- **అవమానిస్తున్నా ఎంపీలు నోరుమెదకపోవడం బాధాకరం**
- **ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు**
- **తేజస్వీ, బీజేపీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పాటుపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. తెలంగాణపై పార్లమెంట్ సాక్షిగా మరోసారి విషం చిమ్మిందని గురువారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదికైన లోక్‌సభలో బీజేపీ నేతలు తెలంగాణ ఆవిర్భావంపై ద్వేషాన్ని వెళ్లగక్కడం దుర్మార్గమని, తేజస్వి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవం లేదనే విషయం రుజువైందని మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్తాన్ విభజనతో పోల్చడం బీజేపీ మూర్ఖత్వానికి పరాకాష్ట అని విరుచుకుపడ్డారు. బీజేపీ నేతలు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తిన కేటీఆర్, అడుగడుగునా అమరుల త్యాగాలను అవమానిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

నాడు ప్రధాని మోదీ.. నేడు తేజస్వీ

ప్రధాని మోదీ మొదలు తాజాగా ఆ పార్టీ ఎంపీ తేజస్వీ సూర్య దాకా తెలంగాణపై అక్కసు వెళ్లగక్కుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణపై అదే పనిగా విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తుపెట్టుకుంటుందని స్పష్టం చేశారు. ఎవరి దయాదాక్షిణ్యాలతోనో, ఎవరి భిక్షతోనో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకాలేదని, దశాబ్దాల సుదీర్ఘ పోరాటం.. వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా తెలంగాణ విముక్తి పొందిందని ఆయన గుర్తుచేశారు. అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం నాలుగుకోట్ల మంది ఏకమై చేసిన ప్రజాస్వామ్య పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర ఘటనలతో పోల్చడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు.

బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తీరు సిగ్గుచేటు

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణపై విషం చిమ్ముతుంటే సభలో ఉన్న ఇక్కడి 16మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు సైతం తేజస్వీ వ్యాఖ్యలను ఖండించకపోవడం బాధాకరమని మండిపడ్డారు. తమ కండ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేని వీళ్లు.. నాలుగుకోట్ల ప్రజలకు ఏం ముఖం చూపుతారని నిలదీశారు.

> తెలంగాణ ఆవిర్భావంపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య విషం కక్కడం అత్యంత దుర్మార్గం. నాడు ప్రధాని మోదీ, ఇప్పుడు ఇతర బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరుల త్యాగాలను అవమానిస్తూనే ఉన్నారు. తేజస్వీ వ్యాఖ్యలతో బీజేపీ కుసంస్కారం బయటపడింది. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. తేజస్వీ, బీజేపీ బేషరతుగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.
> **- కేటీఆర్**

వికృత మనస్తత్వానికి పరాకాష్ట: దేశపతి



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ ఆవిర్భావంతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు ఆయన వికృత మనస్తత్వానికి, తెలంగాణపై ఉన్న ద్వేషానికి పరాకాష్ట అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణను ఒక శత్రుదేశంతో పోల్చడమంటే, నాలుగు కోట్ల తెలంగాణ బిడ్డల గుండెలపై తన్నడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అంటేనే నీళ్ల కోసం, నిధుల కోసం, నియామకాల కోసం సాగిన ఒక పవిత్రమైన ప్రజాస్వామ్య ఉద్యమం అని, అస్తిత్వం కోసం ప్రజలు చేసిన పోరాటాన్ని పాకిస్థాన్‌తో పోల్చడానికి నీకు ఎంత ధైర్యం? అని సూర్యపై మండిపడ్డారు.

తేజస్వీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- **పార్లమెంట్ సాక్షిగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అవమానం**
- **క్షమాపణ చెప్పాల్సిందే**
- **బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు**



హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పాటును భారత్–పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆయన వ్యాఖ్యలను గురువారం ఎక్స్ వేదికగా ఖండించారు. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలను తేజస్వీ అవమానించారని దుయ్యబట్టారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితంగానే 'ప్రత్యేక' కల సాకారమైందని ఆయన గుర్తుచేశారు. అలాంటి మహోన్నత ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం ఘనమైన పోరాట చరిత్రను అవమానించడమేనని నిప్పులు చెరిగారు.

ఎదుగుదలను ఓర్వలేకే అహంకారం


తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్‌మాడల్‌గా నిలువడాన్ని బీజేపీ తట్టుకోలేకపోతున్నదని, తేజస్వీ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని హరీశ్‌రావు మండిపడ్డారు. బీజేపీ అధిష్ఠానం వెంటనే తేజస్వీ వ్యాఖ్యలను ఖండించి తమ పార్టీ వైఖరిని స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆవిర్భావం ఇండియా–పాకిస్తాన్ విభజన లాంటిదే అయితే ఆనాడు విభజన బిల్లుకు బీజేపీ ఎందుకు మద్దతిచ్చిందని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ సైతం అనేకసార్లు తెలంగాణపై విషం చిమ్మారని తూర్పారబట్టారు. నాడు మోదీ, నేడు తేజస్వీ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలను తెలంగాణ నుంచి గెలిచిన ఎనిమిది మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఖండించకుండా గుడ్లప్పగించి చూడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం: దాసోజు



తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని, ఆయనపై బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నో ఏండ్ల పోరాటం, ఎందరో త్యాగఫలితంగా ఏర్పడిన రాష్ట్రాన్ని శత్రుదేశమైన పాకిస్థాన్‌తో పోల్చడం క్షమించరాని నేరమని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం తెలంగాణ చరిత్రను వక్రీకరించడం బీజేపీకి అలవాటుగా మారింది ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 16 మంది ఎంపీలు ఈ విషయంపై మౌనంగా ఉండడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

లోకం పోకడ



తేజస్వీ వ్యాఖ్యలు సబబే

మాటల్లో తప్పేం లేదు: రామచందర్‌రావు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ విభజన తీరుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాత్రం ఆ వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేజస్వీ వ్యాఖ్యలను భూతద్దంలో పెట్టి బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దబాయించారు. భారత్–పాకిస్థాన్ విభజన సందర్భంగా ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేశారని, అదేవిధంగా తెలంగాణలో సైతం ప్రాణత్యాగాల తర్వాత రాష్ట్ర ఏర్పాటు జరిగిందనే సందర్భంలో తేజస్వీ సూర్య ఆ వ్యాఖ్యలు చేశారని డ్యామేజ్ కంట్రోల్‌కు రామచందర్‌రావు యత్నించారు. తేజస్వీ సూర్య మాట్లాడిన నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు.

తేజస్వీ సూర్య సభ్యత్వాన్ని రద్దుచేయాలి : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఏర్పాటుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వెంటనే తన మాటలు వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. 'తెలంగాణపై అవహేళనగా మాట్లాడిన తేజస్వీ సూర్య పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. తేజస్వీ మాటలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలి' అని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఏర్పాటుపై లోక్‌సభ, రాజ్యసభలో పాస్ చేసిన బిల్లులను అవమానపరుస్తుంటే 8 మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు చీమూ, నెత్తురులేకుండా వినడం సిగ్గుచేటన్నారు. తెలంగాణపై తేజస్వీ మాట్లాడిన మాటలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అమరవీరులను అవమానపరచడమే కాకుండా, ఉద్యమస్ఫూర్తికి విఘాతం కలిగించేలా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఎంపీ తేజస్వీ సూర్యపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఈ విషయాన్ని పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

అమరుల త్యాగాన్ని అవమానించడమే : క్రాంతికిరణ్



బీజేపీ ఎంపీ తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణ అమరులను అవమానించేలా ఉన్నాయని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా గతంలో తల్లీబిడ్డను వేరు చేశారని రాష్ట్ర విభజనపై మాట్లాడిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తుపెట్టుకున్నారని తెలిపారు. బీజేపీ ఎంపీలు తెలంగాణపై ద్వేషం పెంచుకున్నట్టు ఇలాంటి సందర్భాల ద్వారా అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు బీజేపీ అసలు రంగు తెలుసుకోవాలని సూచించారు.

అహంకారపూరిత వ్యాఖ్యలు: గ్యాదరి



పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలను అవమానించేలా మాట్లాడటం అహంకారపూరితమని టీజీఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు ధ్వజమెత్తారు. ఆయన వ్యాఖ్యలతో బీజేపీ తెలంగాణ వ్యతిరేకి అనే విషయం మరోసారి రుజువైందని మండిపడ్డారు. గతంలో ప్రధాని మోదీ తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను అపహాస్యం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం అదేబాటలో తేజస్వీ విషం కక్కారని దుయ్యబట్టారు. బీజేపీ వెంటనే తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆ పార్టీని తెలంగాణ ప్రజలు బొందపెట్టడం ఖాయమని హెచ్చరించారు.

ఆ వ్యాఖ్యల వెనుక చంద్రబాబు హస్తం

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యల వెనుక ఏపీ సీఎం చంద్రబాబు హస్తం ఉన్నదని బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజుయాదవ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్, పాకిస్థాన్‌తో పోల్చడం దేశ ద్రోహం లాంటిదని బీఆర్ఎస్ నేత పల్లె రవి కుమార్‌గౌడ్ ఘాటుగా స్పందించారు. బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత కిశోర్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, గజ్జెల నాగేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్, ఓయూ నేత శ్రీకాంత్ ముదిరాజ్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

కాంగ్రెస్, బీజేపీ అక్రమాలను అడ్డుకుందాం

- ప్రతి బూత్‌లో మన ఓటును కాపాడుకోవాలి
- కాంగ్రెస్, బీజేపీలు దొంగ ఓట్లు నమోదు చేసే ప్రమాదమున్నది.. జాగ్రత్తగా ఉండాలి
- రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణలో త్వరలో జరిగే ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిసారించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ అధికారాన్ని అడ్డు పెట్టుకొని అక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉన్నదని, అప్రమత్తంగా ఉండి అడ్డుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ప్రతిపక్ష పార్టీల ఓట్లను బీజేపీ తొలగించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని గుర్తుచేశారు. మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు చేర్పించి కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా లబ్ధిపొందిన విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు 'సర్' ప్రక్రియను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉన్నందున, గులాబీ శ్రేణులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు తమ ఓట్లను కాపాడుకోవడంతోపాటు దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రంలో జరుగబోయే 'సర్' ప్రక్రియపై పార్టీ శ్రేణులతో గురువారం కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితాతో తప్పుల సవరణ, కొత్తగా ఓటర్ల నమోదుకు సర్ ఉద్దేశించిందని, కాబట్టి ప్రతి బూత్‌వారీగా దొంగ ఓటర్లను తొలగించేందుకు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.

బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించాలి

18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతనూ ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని కేటీఆర్ సూచించారు. ఏజెంట్ల ఎంపిక, వారి వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు అందించి వారి నియామకం వెంటనే పూర్తయ్యేలా చూసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం నియమించిన బూత్ లెవల్ ఆఫీసర్లతో పార్టీ ఏజెంట్లు సమన్వయం చేసుకోవడం, కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు, జాబితాలోని తప్పుల సవరణ వంటి ముఖ్యమైన పనులు చేయాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు 'సర్' కీలకం

'సర్' విషయంలో పార్టీ తరఫున శిక్షణ ఇస్తామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ ఎప్పుడైనా ప్రారంభమయ్యే అవకాశం ఉన్నదని, ఓటర్ల జాబితా తయారీ, సవరణ వంటి అంశాలపై ఇప్పటి నుంచే పార్టీ కసరత్తు చేయాలని సూచించారు. 'సర్' ప్రాధాన్యం, నిర్వహించే విధానం, ఏజెంట్ల విధులు, బాధ్యతలు వంటి అంశాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పుడు నిర్వహించబోయే 'సర్' అత్యంత కీలకం కానున్నదని చెప్పారు. ప్రతి ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూత్ స్థాయి నుంచి సరిగ్గా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

15 రోజుల్లో 'వాహన్' వ్యవస్థను సరిచేస్తాం

'నమస్తే' కథనానికి ఆర్టీఏ స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): వాహన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తిన మాట వాస్తవమేనని, ఆ సమస్యను పరిష్కరించే పనిలో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) నిమగ్నమైనదని రవాణాశాఖ తెలిపింది. 15 రోజుల్లో పోర్టల్ పూర్తిగా అందుబాటులోకి వస్తుందని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వాహన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలపై 'నమస్తే తెలంగాణ'లో 'వాహన్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలు' కథనం ప్రచురితమైంది. దీంతో లోపాలను సవరిస్తున్నామని, దశలవారీగా ఆ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని రవాణాశాఖ తెలిపింది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగానే సాగుతున్నదని పేర్కొంది.

జగిత్యాల సభతోనే జైత్రయాత్ర

- సభను అడ్డుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్
- ఎందుకూ పనికిరాదని మాట్లాడిన కాళేశ్వరం వద్ద సభ పెడుతాడట
- కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది
- రెండున్నరేండ్లలో ప్రాజెక్టుల వద్ద తట్టెడు మట్టి ఎత్తిపోయలే
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- జగిత్యాల సభ ఏర్పాట్ల పరిశీలన



జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా. చిత్రంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, సుంకె

జగిత్యాల, ఏప్రిల్ 16: దేశమంతా బాగుండాలని ఆ నాడు జగిత్యాల జైత్రయాత్ర సభ పెట్టారని, ఇప్పుడు ప్రజల్లో మార్పు రావాలి, రేవంత్ ప్రభుత్వం పోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభ పెడుతున్నారని జనగామ ఎమ్మెల్యే, సభ ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల సభతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ జైత్రయాత్రకు పునాది పడుతుందని చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో సభ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం పల్లా పరిశీలించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని కేసీఆర్ పదేండ్ల పాలనలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని, కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నిండా ముంచిందని మండిపడ్డారు. జగిత్యాల సభను అడ్డుకోవడానికి ప్రజలను డైవర్షన్ చేసేందుకు రాజకీయ కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. ఇన్నాళ్లు పనికిరాని కాళేశ్వరం అని మాట్లాడిన రేవంత్, సభ సక్సెస్ కాకుండా అదే రోజు మేడిగడ్డ బరాజ్ వద్ద సభ పెట్టేందుకు చూస్తున్నారని దుయ్యబట్టారు. రెండున్నరేండ్లుగా ప్రాజెక్టుల వద్ద ఒక్క తట్టెడు మట్టి ఎత్తని, మూడు బడ్జెట్‌లలో నీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కేటాయించని రేవంత్ సర్కార్ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సభకు ప్రజలు రాకుండా ఉండేందుకు జగిత్యాల-నిజామాబాద్ ప్రధాన రహదారిపై బ్రిడ్జిని తవ్వుతున్నారని విమర్శించారు. రెండున్నరేండ్ల క్రితమే టెండర్ పూర్తయిందని, ఇన్నాళ్లు గుర్తుకురాని పనులు ఇప్పుడెందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. జగిత్యాల సభకు బస్సులు ఇవ్వద్దని రామగుండం, పెద్దపల్లి, ధర్మపురి ప్రాంతంలో అధికారులను కరీంనగర్ జిల్లా మంత్రులు బెదిరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగిత్యాల ప్రాంతానికి ఒక చరిత్ర ఉందని, ప్రతిపక్షాలు చేసే ప్రతి పనీ వారి పతనానికి నాంది అవుతుందని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమానికి జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ నియోజకవర్గ ప్రజలు వెన్నుదన్నుగా ఉండి సభను జయప్రదం చేశారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలివస్తారన్నారు. జీవన్‌రెడ్డి పార్టీలోకి వస్తున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ధర్మపురి నియోజకవర్గ సభ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, లోక బాపురెడ్డి, దావ సురేశ్, ఆయిల్నేని వెంకటేశ్వర్‌రావు, అవారి శివకేసరి బాబు, దుర్వయ్య, శీలం ప్రవీణ్ పాల్గొన్నారు.

రేవంత్‌లో తెలంగాణ ఆత్మ లేదు

- జగిత్యాల సభను సక్సెస్ చేద్దాం: బాల్క సుమన్



వేములవాడ, ఏప్రిల్ 16: సీఎం రేవంత్‌కు తెలంగాణపై ఎలాంటి ఆత్మ లేదని, చంద్రబాబు పాలన ముద్ర మాత్రమే ఉందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభ సన్నాహక సమావేశం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరుగగా, సభ ఇన్‌చార్జిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 20న జగిత్యాల జిల్లా సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. వేములవాడకు కోట్లాది నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి ఉందని గుర్తుచేశారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే లు రాష్ట్ర ప్రజలను ఎక్కడికక్కడ గద్దల్లా పీక్కు తింటున్నారని ఆరోపించారు. రెండున్నరేండ్లలో రేవంత్ రెడ్డి రూ.3లక్షల కోట్ల అప్పులు చేసి ఏమి అభివృద్ధి చేశాడో ప్రజలు నిలదీయాలని సూచించారు. తెలంగాణ విభజనను ఇండి యా.. పాకిస్తాన్ మాదిరిగా జరిగిందని పార్లమెంటు సాక్షిగా కర్ణాటక ఎంపీ మాట్లాడిన తీరు బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ, 8మంది కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉన్నా ఖండించకపోవడం వారికి తెలంగాణ మీద ఏ మేరకు ప్రేమ ఉందో తెలుస్తున్నదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

పాలనలో రేవంత్ సర్కార్ విఫలం

- జగిత్యాల సభ ధర్మపురి ఇన్‌చార్జి తక్కళ్లపల్లి



ధర్మారం, ఏప్రిల్ 16: అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ పాలనలో ఘోరంగా విఫలమైందని జగిత్యాల సభ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆరోపించారు. జగిత్యాల సభ సన్నాహక సమావేశాన్ని గురువారం రాత్రి పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పార్టీ శ్రేణులతో నిర్వహించి, మాట్లాడారు. ధర్మారం మండలం నుంచి 2,500 మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చి కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

సభను విజయవంతం చేయాలి: గంగుల



కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 16 : జగిత్యాలలో ఈ నెల 20న నిర్వహించే జగిత్యాల సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రానున్న సభకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సభకు వచ్చే ప్రజల కోసం ప్రత్యేకంగా రవాణా, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా తరలాలి: పుట్ట మధూకర్



మంథని, ఏప్రిల్ 16 : జగిత్యాలలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు మంథని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లి జిల్లా మంథనిలో నియోజకవర్గ స్థాయి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల నుంచే పతనం మొదలవుతుందని అన్నారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాకతో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని తెలిపారు.

జగిత్యాల నుంచే కాంగ్రెస్ పతనం: పెద్ది



గంగాధర, ఏప్రిల్ 16 : ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి, రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన కాంగ్రెస్ పార్టీ పతనం జగిత్యాల నుంచే ప్రారంభమవుతుందని జగిత్యాల సభ చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న సభ సందర్భంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలో గురువారం చొప్పదండి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి చేరిక సందర్భంగా నిర్వహిస్తున్న జైత్రయాత్ర సభ జన సముద్రాన్ని తలపించాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా కంటక పార్టీగా మారిందని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మరో పోరుకు కేసీఆర్ జగిత్యాల నుంచే శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. 'కేసీఆర్ రావాలి.. రేవంత్‌రెడ్డి పోవాలి' అనే నినాదంతో జగిత్యాల జైత్రయాత్ర మొదలవుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ జగిత్యాల సభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల, గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు.

భానుడి తీవ్రరూపం

మరో 5 రోజులు ఎండల తీవ్రత.. 33 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
19 నుంచి 22 వరకు వానలు .. హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భానుడు తీవ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండల మండిపోవడంతో జనం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. పెరిగిన ఎండలకుతోడు వేడిగాలులు తోడుకావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. నాలుగురోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల మార్క్‌ను దాటేస్తున్నదని తెలిపింది. దీంతో 33 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు వెల్లడించింది. వచ్చే ఐదు రోజులపాటు ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. గురువారం నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 43.5 డిగ్రీలు నమోదు కాగా, కామారెడ్డి, మంచిర్యాల, నల్లగొండ జిల్లాల్లో 43.4 డిగ్రీలు, జగిత్యాలలో 43.3, కరీంనగర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నది. హైదరాబాద్‌లో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు తెలిపింది. ఇదిలా ఉండగా, ఈనెల 19 నుంచి 22 వరకు తెలంగాణ ఉత్తర, తూర్పు, పశ్చిమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది.

దక్షిణాది ఆధిపత్యం తగ్గించే కుట్ర

- ఆ రాష్ట్రాల ప్రమేయం లేకుండానే ఎన్నికల్లో గెలువవచ్చని కుట్రలు
- మహిళా రిజర్వేషన్లలోనూ ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ ఉమెన్ పోరు దీక్ష
- పాల్గొన్న సిరికొండ, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు



ఢిల్లీలో నిర్వహించిన బీసీ ఉమెన్ పోరు దీక్షలో ఎంపీ వద్దిరాజు, మండలి ప్రతిపక్షనేత సిరికొండ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు, తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): డీలిమిటేషన్ ముసుగులో దక్షిణాది రాష్ట్రాల ఆధిపత్యం తగ్గించి, ఉత్తర భారతానికి అధిక ప్రాధాన్యత కల్పించే కుట్ర జరుగుతున్నదని శాసనమండలిలో బీఆర్ఎస్‌పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మండిపడ్డారు. ఇక్కడి రాష్ట్రాల ప్రమేయం లేకుండా ఎన్నికల్లో గెలువచ్చనే ఉద్దేశంతోనే దక్షిణాదికి మోసం చేసే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గురువారం తలపెట్టిన 'బీసీ ఉమెన్ పోరు దీక్ష'లో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం పార్లమెంట్‌లో 25శాతం ప్రాతినిధ్యం ఉన్నదని, 2011 జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాలను పునర్విభజిస్తే ఇక్కడ 19శాతం ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదమున్నదని సిరికొండ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతమున్న 25శాతం మాదిరిగా డీలిమిటేషన్ చేస్తే ఎలాంటి సమస్య ఉండదని తెలిపారు. మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, వీటిలో రిజర్వేషన్లలో ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలని, అప్పుడే రాష్ట్రంలో, దేశంలో సమానత్వం ఉంటుందని చెప్పారు.

దక్షిణాదికి అన్యాయం జరిగితే కొట్లాటే..

దక్షిణాది రాష్ట్రాల నుంచి అధిక ఆదాయం వస్తున్నా, బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం ప్రతిసారీ అన్యాయం జరుగుతున్నదని సిరికొండ దుయ్యబట్టారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేంద్రంపై కొట్లాడాల్సి వస్తుందని, ఇలాగే కొనసాగితే భారతదేశం ఏదో ఒక రోజు దక్షిణ, ఉత్తర భాగాలుగా విడిపోయి ఉద్యమం వచ్చే ప్రమాదం ఉన్నదని మధుసూదనాచారి హెచ్చరించారు. గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని చిన్నచూపు చూడటం వల్లే తెలంగాణ ఉద్యమం పుట్టుకొచ్చిందని గుర్తు చేశారు. దేశంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలంటే అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు.

ఓబీసీ మహిళలకు సబ్‌కోటా ఉండాలి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్‌కోట కేటాయించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలపై జరుగుతున్న కుట్రను శ్రీనివాసగౌడ్ ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాసులు, విక్రమ్‌గౌడ్, మణిరంజని తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలు అమలు చేయకపోతే కోర్టుకు రండి

- ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): జిల్లా కోర్టుల్లో పనిచేసే ఉద్యోగులకు పాత పింఛన్ పథకం అమలుపై గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోతే ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. 2004లో మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ పాలనాపరమైన జాప్యం కారణంగా కొందరు 2005లో ఉద్యోగాల్లో చేరారు. తాము పాత పింఛన్ పొందే అవకాశం కోల్పోయామంటూ ఉద్యోగులు హైకోర్టుకు వచ్చారు. ఉద్యోగంలో చేర్చుకోకపోవడం ప్రభుత్వ జాప్యమని, ఒకే నోటిఫికేషన్‌లో కొందరు ముందుగా చేరడం వల్ల పాత పెన్షన్, పాలనాపరమైన ఆలస్యం వల్ల తర్వాత చేరిన వారికి కొత్త పెన్షన్ విధానం అమలు చేయడం సరికాదని గతంలో హైకోర్టు చెప్పింది. కోర్టుకు వచ్చిన ఉద్యోగుల అభిప్రాయాలను సేకరించి వారి అభ్యర్థన మేరకు పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లను జస్టిస్ పి శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది.

కోర్టు ధిక్కరణ కేసులో ఐఏఎస్ సుల్తానియా హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం ప్రాజెక్టు నుంచి చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాలకు మిషన్ భగీరథ కింద తాగునీటి పథకాల నిర్మాణం, నిర్వహణ బకాయిల్లో 30 శాతం చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. వీటికి సంబంధించి ఎన్‌సీసీ లిమిటెడ్‌కు చెల్లించాల్సిన రూ.180.17 కోట్ల బకాయిల్లో 30 శాతాన్ని ఈ నెల 23లోగా చెల్లిస్తామని తెలిపింది. బకాయిలను చెల్లించాలన్న గత ఆదేశాలను అమలు చేయలేదంటూ ఎన్‌సీసీ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను జస్టిస్ టీ మాధవీదేవి గురువారం విచారించారు. గత ఉత్తర్వుల మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు.

మిల్లర్లు సొమ్ము మళ్లింపు కేసులో తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): మిల్లింగ్ సొమ్ము ప్రభుత్వానికి జమ చేయకుండా దారిమళ్లించారంటూ రైస్ మిల్లర్లపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టేయాలని కోరుతూ దాఖలైన సుమారు 300 పిటిషన్లపై హైకోర్టు గురువారం విచారణ పూర్తిచేసింది. తీర్పును తర్వాత వెలువరిస్తామని న్యాయమూర్తి జస్టిస్ జే శ్రీనివాసరావు ప్రకటించారు. తొలుత రైస్ మిల్లర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఆర్ఎన్ మహేంద్రనాథ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, 2022–23లో మిల్లింగ్ నిమిత్తం పంపిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయవద్దని ప్రభుత్వమే చెప్పిందని, దీనివల్ల ప్రభుత్వానికి నష్టమేమీ జరుగలేదని చెప్పారు. కాంట్రాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని తెలిపారు. సొమ్మును వసూలు చేసుకోవడానికే క్రిమినల్ కేసులు పెట్టి ఒత్తిడి తీసుకొస్తున్నదని చెప్పారు. పిటిషనర్లపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. రూల్స్ ప్రకారం ఒక్కో మిల్లుకు సీజన్‌కు 8 టన్నులను మాత్రమే మిల్లింగ్ కోసం తరలించాల్సి ఉండగా రెండు నుంచి 10 రెట్లు అధికంగా పౌరసరఫరాల కార్పొరేషన్ తరలిస్తున్నదని తెలిపారు. కార్పొరేషన్ చేసిన తప్పునకు మిల్లర్లపై కేసు నమోదైందని మధ్యవర్తిత్వ విధానం ఉండగా నేరుగా క్రిమినల్ కేసు నమోదు చేయడం చెల్లదని అన్నారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు ప్రతివాదన చేస్తూ, ప్రభుత్వానికి ధాన్యం నిల్వలకు సమానమైన రూ.3,960 కోట్ల బకాయిలు చెల్లింపులు చేయలేదని చెప్పారు. ఈ మొత్తాన్ని మిల్లర్లు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారని ఆరోపించారు. వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

లోక్‌అదాలత్ అవార్డు అమలు నిలిపివేత

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా కాప్రాలో వేల కోట్ల విలువ చేసే 90.08 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులు లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్నందున అవార్డు అమలు చేయాలంటూ కింది కోర్టు జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు నిలిపివేసింది. ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. 90 ఎకరాల భూమి విషయంలో లోక్‌అదాలత్ అవార్డు జారీ చట్ట వ్యతిరేకమని పేర్కొంది.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం
- తదుపరి విచారణ జూన్ 6కు వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నుంచి గెలుపొంది అధికార కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న తొమ్మిదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు నిరాకరించిన స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ప్రతివాదులైన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేస్తూ.. తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. నోటీసులు అందుకున్న వారిలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టీ ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్ ఉన్నారు. వీరంతా మే 6వ తేదీలోగా తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఆ తర్వాత మూడు వారాల్లోగా పిటిషనర్లు కౌంటర్లు దాఖలు చేయాలని సూచించింది. తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించలేదంటూ.. ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో స్పీకర్ ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, పల్లె రాజేశ్వర్‌రెడ్డి, చింత ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి పిటిషనర్లు దాఖలు చేశారు. ఇదే అంశంపై బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం పది పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

స్పీకర్ తీర్పు రద్దు చేయండి

బీఆర్ఎస్ పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ, బీఆర్ఎస్ నుంచి బీ ఫాం తీసుకొని ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు బాహాటంగా పార్టీ ఫిరాయించారని చెప్పారు. సీఎం, పీసీసీ చీఫ్‌ల సమక్షంలో వారంతా కాంగ్రెస్ కండువాలను కప్పుకొన్నారని తెలిపారు. వారు పార్టీ ఫిరాయించినట్టు అనేక ఆధారాలను ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలోని స్పీకర్‌కు అందజేసినప్పటికీ వాటిని పట్టించుకోలేదని చెప్పారు. ఫిరాయింపుదారుల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఏకంగా సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున పార్లమెంట్‌కు పోటీ చేశారని తెలిపారు. దీనిని శాసనసభ బయట జరిగిన వ్యవహారంగా స్పీకర్ తేల్చడం అన్యాయమని, రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెకు కాంగ్రెస్ తరఫున పార్లమెంట్ సీటు సంపాదించి, ఆమె పక్షాన బహిరంగంగా ఎన్నికల ప్రచారం చేశారని తెలిపారు. మిగిలిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపునకు పాల్పడినట్టు ఎన్నో ఆధారాలు, సుప్రీంకోర్టు తీర్పులను స్పీకర్ ముందు పెట్టినప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. స్పీకర్ వెలువరించిన తీర్పును రద్దు చేయాలని కోరారు. కాలయాపన చేస్తూ ఐదేండ్ల ఎమ్మెల్యేల పదవీ కాలం ముగిసే పరిస్థితులు ఏర్పడకుండా సత్వరమే స్పందించాలని కోరారు.

నమస్తే తెలంగాణ

రైతుభరోసా కన్నా.. ఉచిత బస్సు పథకమే మేలట!

- 'ఉచిత విద్యుత్తు' దిగదుడుపే
- దీనితోనే ప్రజలకు ఎక్కువ మేలు
- ఇదే 'నిజమైన సంక్షేమ పథకమట
- కుటుంబ సర్వేలో సర్కార్ వెల్లడి
- ప్రభుత్వ తీరుపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): రైతుభరోసా, ఉచిత విద్యుత్తు పథకాలు అసలైన సంక్షేమ పథకాలు కావట. ఉచిత బస్సు పథకం ముందు ఇవన్నీ దిగదుడుపేనట. ఆ పథకాలతో పోల్చితే ఉచిత బస్సు పథకమే నిజమైన, అసలైన సంక్షేమ పథకమట. ఈ విషయం చెప్పింది ఎవరో కాదు. స్వయంగా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారే ఈ వింతైన విషయాన్ని వెల్లడించింది. ఈ మేరకు బుధవారం రాత్రి హడావుడిగా విడుదల చేసిన కుటుంబ సర్వే నివేదికల్లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నివేదికలో ఏ పథకం వల్ల ఎక్కువ మంది లబ్ధి పొందారనే అంశాన్ని వివరించింది. దీంతో సర్కార్ తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏటా రూ.30 వేల కోట్ల వరకు ఖర్చుచేస్తూ వ్యవసాయ సంక్షేమ పథకాలైన రైతుభరోసా, ఉచిత విద్యుత్తు పథకాలను రైతులకు అందిస్తున్నట్టు పేర్కొన్నది. ఈ పథకాలను ఓసీలు 15 శాతం లబ్ధి పొందితే ఎస్సీలు కేవలం 12 శాతం మాత్రమే లబ్ధి పొందుతున్నట్టు వెల్లడించింది. ఉచిత బస్సు పథకాన్ని 20 శాతం మంది ఎస్సీలు వినియోగించుకొంటే.. ఓసీలు 10శాతమేనని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఈ వివరాలు వ్యవసాయ పథకాల కన్నా ఉచిత బస్సు పథకమే నిజమైన సంక్షేమ పథకమనే విషయాన్ని స్పష్టం చేస్తున్నదని ప్రభుత్వం పేర్కొన్నది. రైతులకు వెన్నుదన్నుగా నిలిచి దేశ వ్యవసాయ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపిన పథకాలపై ఇలాంటి సంకుచిత వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు రైతుభరోసా, ఉచిత విద్యుత్తు పథకాలతో ఉచిత బస్సు ప్రయాణానికి పోలిక ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ పథకాలను పోల్చడమే పెద్ద తప్పు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా రైతు పథకాలను తక్కువ చేసి చూపడం మరింత దారుణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.


సొంత భూమి కలిగిన వారిలో ఓసీలే తక్కువ

రాష్ట్రంలో సొంత భూమి కలిగిన కుటుంబాలు 35.6 శాతంగా ఉన్నట్టు సర్కార్ నివేదిక పేర్కొన్నది. కులాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా సొంత భూమి కలిగిన కుటుంబాల్లో ఎస్టీ సామాజిక వర్గం ముందుగా ఉండటం గమనార్హం. ఎస్టీలు 58.1శాతం సొంత భూమి కలిగి ఉన్నట్టు పేర్కొన్నది. ఈ తర్వాతి స్థానంలో బీసీల కుటుంబాలు 36.3 శాతం, ఎస్సీలు 35.2 శాతం, ఓసీలు 33.7 శాతం సొంత భూమి కలిగి ఉన్నట్టు వెల్లడించింది. ఇలా రాష్ట్రంలో సొంత భూమి కలిగిన కుటుంబాల్లో ఓసీలే తక్కువగా ఉండటం గమనార్హం.

తెలంగాణలో సింహభాగం బీసీలే!

రాష్ట్రంలో బీసీలు 46.25%, ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ముస్లిం మైనారిటీలు 12.56%, ఓసీలు 13.31%

ఎస్సీల్లో రంగారెడ్డి టాప్.. ములుగు లాస్ట్ • రాష్ట్ర రాజధానిలోనే ముస్లింలు అత్యధికం



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతుల (బీసీ) వాటా అత్యధికంగా ఉన్నది. బీసీలే తిరుగులేని శక్తిగా నిలిచారు. ముస్లిం మైనారిటీలు మినహా.. ఇతర బీసీల రాష్ట్ర సగటు 46.25 శాతంగా నమోదైంది. 3.54 కోట్ల జనాభాలో 1.64 కోట్లకు పైగా బీసీల సంఖ్య ఉన్నది. ప్రతి వంద మందిలో సుమారు 46 మంది బీసీ సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారు. జగిత్యాల జిల్లాలో 6,42,965 (63.09 శాతం)తో రాష్ట్రంలోనే అత్యధిక బీసీలు కలిగిన జిల్లాగా నిలిచింది. ఆ తర్వాత జోగుళాంబ గద్వాల (61.76%), రాజన్న సిరిసిల్ల (61.07%) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అతి తక్కువగా హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 18,30,304 (29.81%) మంది మాత్రమే బీసీలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసిన సీపెక్ సర్వే వివరాలు, గణాంకాలను పరిశీలిస్తే అత్యధిక జనాభాతో బీసీలే అత్యధికంగా ఉండగా, ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీలు, ఓసీలు, ముస్లిం మైనారిటీ వర్గాల జనాభా ఉన్నది.

ఎస్సీ జనాభాలో ఫస్ట్ రంగారెడ్డి.. లాస్ట్ ములుగు

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎస్సీ జనాభా 61,84,319 ఉన్నది. ఎస్సీ సగటు జనాభా శాతం 17.43 శాతంగా నమోదైంది. ఎస్సీల జనాభా రంగారెడ్డి జిల్లాలో అధికంగా ఉన్నారు. ఈ జిల్లాలో 3,36,426 మంది ఎస్సీలు ఉన్నారు. ఆ తర్వాత రెండోస్థానంలో ఖమ్మం (3,19,005), మూడో స్థానంలో నల్లగొండ (3,14,670) ఉన్నాయి. ఎస్సీల జనాభా తక్కువ ఉన్న జిల్లాల్లో ములుగులో 49,746 మంది మాత్రమే ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఆసిఫాబాద్‌లో 86, 207, భూపాలపల్లిలో 96,226 మంది ఉన్నారు. ఎస్సీల జనాభా శాతం అత్యధికంగా ఉన్న జిల్లాలుగా నాగర్‌కర్నూల్ (23.61), ఆ తర్వాత భూపాలపల్లి (23.35) నిలిచాయి. అతితక్కువ ఎస్సీ జనాభా శాతం ఉన్న జిల్లాలుగా నిజామాబాద్ (14.68), ఆదిలాబాద్ (14.90) ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రం మొత్తం గణాంకాలు

సామాజికవర్గం	మొత్తం జనాభా	శాతం (%)
బీసీ (ఇతర)	1,64,09,179	46.25%
ఎస్సీ	61,84,319	17.43%
ఎస్టీ	37,05,929	10.45%
ముస్లిం మైనారిటీలు	44,57,012	12.56%
ఇతర ఓసీలు	47,21,115	13.31%
మొత్తం	3,54,77,554	100%

బీసీ, ఎస్సీల తర్వాత గిరిజనులే అధికం

రాష్ట్రంలో బీసీ, ఎస్సీల తర్వాత గిరిజనుల సంఖ్య అధికంగా ఉన్నది. రాష్ట్రంలోని 3.54 కోట్ల జనాభాలో వీరు 37,05,929 మంది (10.45%) ఉన్నారు. గిరిజన జనాభాలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా 4,18,085 మందితో (40.37%) అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లా 3,22,361 మందితో (40.07%), ఆదిలాబాద్ జిల్లా 2,55,916 మంది (33.45%) వాటాతో గిరిజన ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాలుగా నిలిచాయి. అతి తక్కువగా కరీంనగర్ (1.31%), జోగుళాంబ గద్వాల (1.82%) జిల్లాల్లో ఎస్టీ జనాభా నమోదైంది.

నగరాల్లోనే ముస్లిం మైనారిటీలు అధికం

తెలంగాణలో ముస్లిం మైనారిటీల సంఖ్య రాష్ట్ర సగటు 12.56 శాతంగా నమోదైంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనే అత్యధికంగా 28.89% ముస్లిం జనాభా ఉన్నది. నిజామాబాద్ (21.73%), సంగారెడ్డి (16.24%) జిల్లాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అతి తక్కువగా జయశంకర్-భూపాలపల్లి (3.10%), ములుగు (3.24%) జిల్లాల్లో మైనారిటీలు ఉన్నట్టు తేలింది.

హైదరాబాద్‌లో ఓసీలే టాప్

రాష్ట్ర సగటు ఇతర కులాల (ఓసీ) జనాభా 15.79 శాతంగా నమోదైంది. హైదరాబాద్ (జీహెచ్ఎంసీ)లో అత్యధికంగా 35.99% మంది ఓసీలు ఉన్నారు. ఓసీ జనాభాలో మేడ్చల్-మల్కాజిగిరి (31.91%) రెండో స్థానంలో ఉన్నది. అతి తక్కువగా మహబూబాబాద్ (5.80%), మెదక్ (6.23%) జిల్లాల్లో ఓసీలు నివసిస్తున్నారు.

మున్నూరు కాపులను మాయం చేస్తరా?

- కులగణన పేరుతో తప్పు లెక్కలు
- మమ్మల్ని ముట్టుకుంటే రాజకీయ సమాధేనని హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదికలో మున్నూరు కాపు జనాభాను 4%లోపు చూపించారంటూ తెలంగాణ మున్నూరు కాపు సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ గణాంకాలు యావత్ బీసీ సమాజాన్ని తప్పుదోవ పట్టించి, తమ హక్కులను కాలరాసేవిగా ఉన్నాయని విమర్శించింది. సబ్బండ వృత్తి కులాల సమాజమైన తెలంగాణలో బీసీ కులాలను 46 శాతమే చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనలో అన్యాయానికి గురైన సహచర బీసీ కులాలకు సంఘీభావం ప్రకటించారు. అర్ధరాత్రి విడుదల చేసిన నివేదిక వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. మున్నూరు కాపుల ఉనికిని తగ్గించి చూపడాన్ని పద్ధతి ప్రకారం జరిగిన కుట్రగా అభివర్ణించారు. తక్షణమే దిద్దుబాటు చర్యలకు పూనుకోని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వం ఎదుట పెట్టిన నేతలు త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్, పెద్ది పెంటయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక నేతలు పాల్గొన్నారు.

కులగణన నివేదిక తప్పుల తడక

- బీసీ జనాభాను తక్కువచూపే కుట్ర
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం విడుదల చేసిన కులగణన లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీల జనాభాను తక్కువచేసి చూపుతున్నారని మండిపడ్డారు. 56 శాతంగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం త్వరలో చేపట్టే జనగణన సర్వేలో బీసీ కుటుంబాల కాలమ్ లేనందునే కులగణన వివరాలు బయటపెట్టారని పేర్కొన్నారు. బీసీలకు కేంద్రం, రాష్ట్రం తీరని అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు.

బీసీలతో కాంగ్రెస్ రాజకీయ క్రీడ!

మొదటిపేజీ తరువాయి...

హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను పెంచకపోగా, ఉన్న కోటాలోనే కొంత భాగాన్ని ముస్లిం సామాజిక వర్గానికి పంచి ఇచ్చే పరిస్థితులను సృష్టిస్తున్నదని బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణన ప్రకారం రాష్ట్రస్థాయి సంక్షేమ, అభివృద్ధి పథకాలతోపాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లలో ప్రధాన వాటా బీసీ ముస్లింలకే దక్కుతాయని చెప్తున్నారు. ఇది గౌడ, యాదవ, మున్నూరుకాపు, పద్మశాలీ తదితర వృత్తికులాల హక్కులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం సామాజికవర్గాన్ని బీసీలుగా నిర్ధారించడానికి ప్రభుత్వం ఎలాంటి ప్రమాణాలు పాటించిందో నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు.

ప్రామాణికత లేకుండా బీసీ జాబితాలోకి

వాస్తవానికి ముస్లింలు ఏకరీతి సమాజం కాదని నిపుణులు చెప్తున్నారు. హిందువుల్లో ఉన్నట్టే ముస్లిం సామాజికవర్గంలోనూ స్పష్టమైన కుల వ్యవస్థ ఉన్నదని పేర్కొన్నారు. ఆష్రఫ్ (ఆధిపత్య కులాలు), అజ్లఫ్ (వెనుకబడిన ముస్లింలు), అర్జల్ (దళిత ముస్లింలు) అనే మూడు వర్గాలుగా ఉన్నారని చెప్పున్నారు. వెనుకబడిన వర్గంలో మదారి, నల్బంద్, సుర్జాపురి, అన్సారీ, మాలిక్ తదితర ఉపకులాలు ఉన్నట్టు చెప్పారు. మొత్తంగా 25 ఉపకులాలు ఉన్నాయని సమాచారం. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లింలందరినీ ఒకే వర్గంగా చిత్రీకరించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరిని బీసీల కింద ఎలా చేర్చారనే దానికి ప్రభుత్వం వద్ద శాస్త్రీయ ఆధారం లేదని చెప్తున్నారు. ఈ నిర్ణయం బీసీలను దెబ్బతీయడంతోపాటు వారిలోని నిజంగా అవసరమైన, వెనుకబడిన కులాలకు లక్షిత ప్రయోజనాలు అందకుండా చేస్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఓబీసీ జాబితాలో ముస్లింల సంఖ్యను పెంచడం, ఆర్థిక ఉన్నతికి కీలకమైన ముందడుగుగా కాంగ్రెస్ చెప్పుకొంటున్నది. దీన్ని బెంగాల్, తమిళనాడులో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా అక్కడి ముస్లిం ఓటర్లను ఆకర్షించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్లాన్ అని అనుమానిస్తున్నారు.

స్వామి కార్యం.. స్వకార్యం పూర్తయ్యేలా!

సాధారణంగా ప్రతి పదేండ్లకూ 13.5 శాతం జనాభా పెరుగుతుందని అంచనా. అయితే.. సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చితే కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన కులగణన నివేదికలో హిందూ బీసీల సంఖ్య దాదాపు 21 లక్షల వరకు తగ్గింది. అంటే 5 శాతం పడిపోయింది. జనాభా పెరగాల్సిన చోట.. బీసీ జనాభా తగ్గడం వెనుక పాలకపక్షం వ్యూహం ఉన్నదనే ఆరోపణలు ఉన్నాయి. జనాభాను ఎంత పెంచి చూపిస్తే, దానికి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్లు వస్తాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించినట్టు చెప్తున్నారు. అందుకే బీసీ కులాల జనాభాను తగ్గించిందని, తక్కువ చూపితే తిరుగుబాటు వస్తుందనే ఆలోచనతో ముస్లిం బీసీల సంఖ్యను పెంచి బీసీ వర్గంలో చేర్చినట్టు చర్చ జరుగుతున్నది. తద్వారా స్వామి కార్యం.. స్వకార్యం నెరవేరినట్టు.. ఓవైపు బీసీల జనాభా 56.33 శాతానికి పెరుగగా, మరోవైపు ముస్లిం ఓటుబ్యాంకును తమ వైపు తిప్పుకొనే అవకాశం ఏర్పడిందని కాంగ్రెస్ భావిస్తున్నట్టు సమాచారం.

'లెక్కల'పై నోరువిప్పని బడుగునేతలు

- కులాలవారీగా ఆందోళన
- అందుకుభిన్నంగా సంఘాల నేతల మౌనం
- కాంగ్రెస్‌కు అనుకూలంగా పలువురు.. బీజేపీకి సానుకూలంగా మరికొందరు
- కుల సంఘాల నేతలపై మేధావుల రుసరుసలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సర్కార్ తాజాగా వెల్లడించిన కులాల గణాంకాలపై వివిధ బీసీ కులస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. లెక్కలు తప్పని, అసంబద్ధమని చర్చించుకుంటున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు, సర్కార్ డాటాకు ఏమాత్రం పొంతన లేదని చెప్తున్నారు. అయినప్పటికీ, ఈ గణాంకాలపై బీసీ సంఘాలు, ఆయా కుల సంఘాలు ఇప్పటివరకూ స్పందించకపోవడంపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024)కు సంబంధించి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని స్వతంత్ర నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను సర్కార్ విడుదల చేసింది. రాష్ట్రంలో బీసీలు 46.25%, ముస్లిం బీసీలు 10.08%, ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ఓసీలు 15.79%, నో క్యాస్ట్ 4% ఉన్నారని వెల్లడించింది. అయితే, ప్రభుత్వ గణాంకాలపై గతంలో హడావుడి చేసి, నానా హంగామా చేసిన బీసీ సంఘాల ప్రతినిధులు, కులసంఘాలు ఒక్కరూ ఇప్పుడు స్పందించకపోవడం ఆసక్తికరంగా మారింది. సర్కార్ లెక్కలపై ఆయా కులాలు, ఉపకులాలు ఆందోళన చెందుతున్నాయి.

ప్రభుత్వంతో అంటకాగుతూ..

వాస్తవంగా ఇంటింటి సర్వే, బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంపై ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాల్లో అనేక లోపాలున్నాయని మేధావులు, కులస్తులు చెప్తూవచ్చారు. సర్వే ప్రారంభం కాకముందే కొన్ని సంఘాల నేతలు ఏకంగా ప్రభుత్వ పెద్దలను కలిసి సన్మానాలు చేశారని, అసలు ప్రభుత్వం సర్వే చేపట్టడమే మహా గొప్పనే తరహాలో ప్రచారం చేశారని గుర్తుచేస్తున్నారు. సర్వే నివేదిక వచ్చిన అనంతరం ఏమైనా లోపాలు ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, అవసరమైతే న్యాయపరంగా కొట్లాడుతామని నాడు ప్రకటనలు చేసిన ఆయా సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు ప్రస్తుతం స్పందించడం లేదన్న భావన ఆయా కులాల్లో నెలకొన్నది. కేవలం ప్రభుత్వ పెద్దల మెప్పు



కోసమే ఇలా వ్యవహరిస్తున్నారని, సర్కార్ మెహర్బానీ కోసం బీసీ హక్కులను తాకట్టుపెడుతున్నారని ఆయా కులాల ప్రజలు మండిపడుతున్నారు. చట్టాలను ఆచరణలోకి తీసుకొనిరాకముందే పలు బీసీ సంఘాల ప్రతినిధులు హడావుడి చేస్తూ, సర్కార్‌కు జేజేలు కొట్టడం, ఢిల్లీకి తరలివెళ్లి కాంగ్రెస్‌కు మద్దతుగా ధర్నా నిర్వహించడం, కాంగ్రెస్ పెద్దలకు సన్మానాలు చేయడం అందుకు నిదర్శనమని ఉదహరిస్తున్నారు. రిజర్వేషన్లకు ప్రధాన అడ్డంకిగా నిలిచిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులతోనే కలిసి బంద్ నిర్వహించడం, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకున్నా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఓ బీసీ సంఘం నాయకుడు వ్యవహరించారని వివరిస్తున్నారు. మరో బీసీ నేత బీజేపీకి వంతపాడుతున్నారనే విమర్శలున్నాయి. తాజాగా ప్రభుత్వం తమ జనాభాను తగ్గించి చూపినా సంఘాల నేతలు స్పందించడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఓ బీసీ నాయకుడు ఏకంగా కాంగ్రెస్ లీడర్‌గా మారిపోయాడని విమర్శిస్తున్నారు. 'బీజేపీ నాయకులకు బీసీలకు జరుగుతున్న అన్యాయం కనిపించడం లేదా? బీసీల్లో షేక్‌లే ఎక్కువ ఉన్నారంటే బడుగు, బలహీన వర్గాలు ఏమైపోయాయి? ఎందుకు బీజేపీ మాట్లాడదు?' అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ లెక్కలకు శాస్త్రీయత లేదని, తప్పుడు లెక్కలు బలవంతంగా రుద్ది బీసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. దీనిపై కుల సంఘాల రాష్ట్ర నాయకత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలు అభివృద్ధికి ఆమడ దూరం

- బీసీలలో 71 శాతం మందిది ఇప్పటికీ అత్యంత వెనుకబాటే
- మొత్తం జనాభాలో 67 శాతం వెనుకబడిన వర్గాలేనని స్పష్టం
- అగ్రకులాలది అధిక అభివృద్ధి
- సీప్ సర్వే నివేదికలో బట్టబయలు

గ్రూప్	మొత్తం కులాలు	అత్యంత వెనుకబాటులో	జనాభాలో శాతం	తక్కువ వెనుకబాటులో	జనాభాలో శాతం
బీసీ	133	69	40	64	17
ఎస్సీ	59	41	17	18	0.5
ఎస్టీ	32	25	10	7	0.1
జనరల్	18	0	-	18	12
మొత్తం	242	135	67	107	29

తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రాజకీయ, కుల సర్వేలో గిరిజనులు, దళితవర్గాలు అధిక శాతం వెనుకబాటులోనే ఉన్నారని తేలింది. ఇది కుల ఆధారిత అసమానతలను ప్రతిబింబించింది. ఎస్టీల్లోని 32 కులాల్లో 25 పూర్తిగా 99శాతంతో వెనుకబాటులో ఉండగా, ఎస్సీల్లో కూడా 59 కులాల్లో 41కులాలు 97 శాతంతో జనాభా కలిగి పూర్తి వెనుకబాటులో ఉన్నట్టు సీప్ సర్వే వెల్లడించింది. బీసీల్లోని 69 కులాలలో 71శాతం మంది అత్యంత వెనుకబాటులో ఉన్నారని స్పష్టమైంది.

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): దేశంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల అమలును ప్రారంభించి 75 ఏండ్లు గడుస్తున్నా ఆ వర్గాలు ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచారని మరోసారి స్పష్టమైంది. ఆర్థిక, సామాజిక వెనుకబాటులో అత్యధిక స్కోర్‌తో ఇప్పటికీ ఈ రెండు వర్గాలకు చెందిన ఉపకులాలు అత్యంత వెనుకబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో 99 శాతం ఎస్టీలు, 97శాతం ఎస్సీలు, బీసీలలో 71శాతం జనాభా ఇప్పటికీ అత్యంత వెనుకబాటులో ఉన్నారని సీప్ సర్వే తేల్చిచెప్పింది. మొత్తం జనాభాలో వెనుకబాటులో ఉన్నది 67 శాతం మంది వెనుకబడిన వర్గాలేనని స్పష్టమైంది. సామాజిక, ఆర్థిక రంగాల్లో రాష్ట్రం నిర్దేశించుకున్న ఇండెక్స్ సగటు కంటే 15 పాయింట్ల మేర ఎస్సీ, ఎస్టీ ఉపకులాలు వెనుకబాటుకు గురయ్యారని సీప్ సర్వే పేర్కొంది. ఇక ఇదే సమయంలో అన్‌రిజర్వ్‌డ్ (జనరల్) క్యాటగిరీలో ఉన్న కులాలు అభివృద్ధిలో సగటును మించి మరీ అత్యంత అధిక శాతంతో అభివృద్ధి పథంలో సాగుతున్నాయని తేలింది.

42 ప్రమాణాల ఆధారంగా పాయింట్లు


సీప్ సర్వేలో ప్రజలు ఇచ్చిన సమాచారం ప్రాతిపదికగా రూపొందించిన నివేదికలో మొత్తం 242 కులాల సమాచారం ఆధారంగా ర్యాంకులు, స్కోర్లు కేటాయించారు. ఇందుకుగాను 42 ప్రమాణాలను అనుసరించారు. దీని ఆధారంగా ప్రతి కులానికి పాయింట్లు ఇచ్చిన ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల వెనుకబాటు ఏ దిశలో ఉందో స్పష్టంగా వెల్లడించింది. ఈ సర్వేలో ప్రధానంగా ఎక్కువ స్కోర్ వచ్చిన కులం ఎక్కువ వెనుకబాటులో ఉన్నట్టు ర్యాంకింగ్ ఇచ్చారు. ఇందులో ఎస్సీ వర్గాలు 96శాతం స్కోర్‌తో అత్యంత వెనుకబడిన వర్గంగా, ఎస్టీలు 95 స్కోర్‌తో రెండో స్థానంలో ఉండగా, బీసీలు 8 6శాతం స్కోర్‌తో రాష్ట్ర సగటుకు చేరుకున్నారు. ఇక జనరల్ క్యాటగిరీ కులాలు మాత్రమే 31 స్కోర్‌తో అద్భుతంగా అభివృద్ధి చెందిన వర్గంగా గుర్తింపు పొందాయి.

సగటు స్కోరు 81గా నిర్ధారణ

రాష్ట్రంలో వివిధ కులాల సామాజిక, ఆర్థిక వెనుకబడిన స్థితిని అంచనా వేసేందుకు కాంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్‌ను ప్రభుత్వం ప్రాతిపదికగా తీసుకుంది. ఈ సర్వేలో తెలంగాణ మొత్తం సగటు స్కోర్‌ను 81గా నిర్దేశించారు. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీలు నిర్దేశిత సగటు కంటే 15 పాయింట్లు ఎక్కువ వెనుకబాటులో ఉన్నారని నివేదిక పేర్కొంది. మొత్తం 242 కులాలలో 135 కులాలు రాష్ట్ర సగటు స్కోర్ 81 కంటే మరింత వెనుకబడి ఉన్నాయి ఈ 135 కులాలు 67శాతం జనాభాను కలిగి ఉన్నాయి. దీనినిబట్టి రాష్ట్రంలో 67శాతం మంది సగటుకంటే వెనుకబడి ఉన్నట్టు తెలుస్తున్నది. బీసీల్లోని 133 కులాల్లో ఎక్కువ వెనుకబడిన కులాలు 69 కాగా, వాటి వాటా 71శాతంగా ఉంది. మరో 64 కులాలు తక్కువ వెనుకబాటులో ఉన్నట్టు గుర్తించారు. ఎస్సీ వర్గాలకు చెందిన మొత్తం 59 కులాల్లో 41 కులాలు ఎక్కువ వెనుకబాటులో ఉన్నాయి. మరో 18 కులాలు 0.5 శాతం జనాభాతో తక్కువ వెనుకబాటు జాబితాలో ఉన్నాయి. ఇక ఎస్టీల్లో మొత్తం 32 కులాలు ఉండగా ఇందులో 25 కులాలు 99శాతంతో వెనుకబాటులో ఉన్నాయి. కేవలం 7 కులాలు మాత్రమే తక్కువ వెనుకబాటు జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జనరల్ క్యాటగిరీలో అంటే అన్ రిజర్వుడు జాబితాలోని మొత్తం 18 కులాల్లో ఒక్క కులం కూడా అత్యంత వెనుకబాటు జాబితాలో లేదని నిర్ధారణ అయింది. 12 శాతం జనాభా ఉన్న ఈ వర్గాలు రాష్ట్ర సగటు కంటే ఎంతో మెరుగైన స్థానంలో నిలిచి తమ సామాజిక, ఆర్థిక ప్రగతిని చాటుకున్నాయి.

భూములపై ఆ వర్గాలదే గుత్తాధిపత్యం

- కొన్నివర్గాలదే అత్యధిక వాటా!
- ఓసీల్లో కొందరికే సింహభాగం
- ఎస్సీ, ఎస్టీలకు తక్కువ వాటా
- సీప్ సర్వేలో వెల్లడైన వివరాలు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొన్నివర్గాల చేతుల్లోనే భూమి కేంద్రీకృతమైంది. అత్యధిక భూముల వాటాను ఆ వర్గాలే సొంతం చేసుకొన్నాయి. భూయాజమాన్య వాటాలు కులాలను బట్టి ఎక్కువ, తక్కువలు ఉన్నట్టు తేటతెల్లమైంది. బలమైన వర్గాలకే భూముల వాటా ఎక్కువగా ఉన్నదని తేలింది. బలమైన, సంప్రదాయంగా వ్యవసాయం, వ్యాపార రంగాల్లో ఎప్పటినుంచో ఉంటూ వస్తున్న ఓసీలు భారీగా భూములను కలిగి ఉన్నట్టు సీప్ (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల)-2024 సర్వేలో వెల్లడైంది. ఆయా కులాల జనాభాతోపాటు వారి భూముల వాటా వివరాలను ఈ సర్వేలో పొందుపర్చారు. ఈ నివేదిక ప్రకారం ఓసీ వర్గాల్లో ప్రధానంగా రెడ్డి సామాజిక వర్గం, బీసీల్లోని యాదవ, మరో ఓసీ వర్గానికి చెందిన వెలమ వంటి కులాలు తమ జనాభా వాటాతో పోలిస్తే అధిక భూయాజమాన్య వాటాను కలిగి ఉన్నాయి. ఎస్టీ కోయ, బీసీ-డీ వీరశైవ, బీసీ-బీ కురుమ వంటి కులాల్లో భూములు అత్యల్ప తక్కువ వాటాతో ఉన్నట్టు స్పష్టమైంది. బీసీ మున్నూరుకాపు వర్గం బీసీల్లో బలమైన భూముల వాటా కలిగి ఉన్నది. ఎస్సీ మాదిగ, బీసీ-డీ ఆరెకటిక, బీసీ-డీ దూదేకుల, బీసీ-ఏ పిచ్చకుంట్ల వంటి కులాలు భూములు, ఆస్తుల యాజమాన్య హక్కుల్లో చాలా వెనుకబాటుతనంతో ఉన్నాయి. ఓసీ ముస్లింలు కూడా రాష్ట్ర సగటు కంటే వెనుకబడి ఉన్నారు. 56 ప్రధాన కులాల మధ్య భూమి, ఆస్తుల యాజమాన్య వాటాల్లో స్పష్టమైన అసమానతలు కనిపించాయి. ఇది మరోసారి రాష్ట్రంలో కులాలవారీగా ఆర్థిక, ఆస్తుల పరమైన అసమానతలను ధ్రువీకరించింది.

స్వల్పంగా అధిక వాటా

బీసీ-డీ జాబితాలోని మాలి వర్గం 0.2 శాతం జనాభా ఉంటే.. వారి భూమి వాటా శాతం 0.4 శాతంగా స్వల్పంగా ఎక్కువగా ఉన్నది. ఎస్టీ కొలం వర్గాల జనాభా 0.2 శాతమైతే వారి భూమి వాటా 0.4 శాతంగా నమోదు కావడం గమనార్హం. బీసీ-డీ వంజర కులానికి చెందిన జనాభా 0.2 శాతం కాగా, వారి భూమి వాటా 0.3 శాతంగా ఉన్నది.

అత్యధిక భూముల వాటా కలిగిన వర్గాలివే..

కులాలు	వాటా (శాతం)
రెడ్డి	13.5
యాదవ	8.7
లంబాడీ	8.6
గౌడ	4.6

తమ జనాభా కంటే తక్కువ భూమి కలిగిన వర్గాలు

కులాలు	జనాభా	భూముల్లో వాటా(శాతం)
ఎస్సీ మాదిగ	10.3	6.5
ఎస్సీ మాల	4.1	3.3
షేక్ ముస్లింలు	7.9	2.0
పద్మశాలి	3.3	1.7
రజకులు	2.8	2.1
బీసీ వడ్డెర	1.8	0.9
బ్రాహ్మణ	0.9	0.5

కులాంతర వివాహాల్లో 'అగ్ర'వర్ణాలు

- నిజామాబాద్‌లో మహిళలు అధికం
- వెయ్యి మంది పురుషులకు 1,035 మంది మహిళలు
- మరో నాలుగు జిల్లాల్లోనూ వెయ్యికి పైగానే మహిళా నిష్పత్తి
- రంగారెడ్డిలో 928 మందే..
- సర్వేలో ఆసక్తికర విషయాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024)లో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. అగ్రవర్ణాల్లోని బ్రాహ్మణులు ఎక్కువగా కులాంతర వివాహాల వైపు మొగ్గుచూపుతున్నట్టు ఈ సర్వే ద్వారా వెల్లడైంది. ఓసీల్లో 12% మందికి కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. 9.9%తో బీసీ (సీ)కి చెందిన దళిత క్రిస్టియన్లు రెండో స్థానంలో ఉన్నారు. అగ్రవర్ణాల్లో వధువుల కొరతతోనే కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని వెల్లడైంది. భవిష్యత్తులో వివాహం చేసుకొనేందుకు ఆడపిల్లల కోసం బ్రాహ్మణులు ఎదుర్కోబోయే విపత్కర పరిస్థితిని ఈ గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. సమాజంలో వస్తున్న మార్పులకు ఈ సూచికలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్త్రీ, పురుష లింగనిష్పత్తిలో రాష్ట్రంలో నిజామాబాద్ అగ్రస్థానంలో ఉన్నట్టు ఇదే సర్వే ద్వారా వెల్లడైంది. ఈ జిల్లాలో 1,000 మంది పురుషులకు గాను 1,035 మంది మహిళలు ఉన్నారు. మెదక్, ములుగు జిల్లాల్లో అదే వెయ్యి మంది పురుషులకు 1,022 మంది చొప్పున మహిళలు ఉన్నారు. ఆ తర్వాత భద్రాద్రి-కొత్తగూడెంలో 1,019 మంది, కామారెడ్డి జిల్లాలో 1,016 మంది ఉన్నారు. అతి తక్కువగా రంగారెడ్డి జిల్లాలో వెయ్యి మంది పురుషులకు కేవలం 928 మంది మహిళలు ఉన్నారు. మేడ్చల్-మల్కాజిగిరిలో 941, మహబూబ్‌నగర్‌లో 980, వికారాబాద్‌లో 990 మంది మహిళలు ఉన్నారు. తెలంగాణ జనాభాలో 24.6% మంది 15 నుంచి 29 ఏండ్లలోపు యువకులు ఉన్నారు. మొత్తం జనాభాలో 65 ఏండ్ల వయసు పైబడిన వృద్ధులు 6.9% మంది ఉన్నారు.

9.4 శాతం కుటుంబాలకే ఇండ్లులేవట..

ప్రభుత్వం విడుదల చేసిన సీపెక్ సర్వే ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 3.9% కుటుంబాలకే ఇండ్లులేవని తేల్చారు. వీరిలో ఎస్టీలు 7.1%, ఎస్సీలు 5.8%, బీసీలు 3.5%, ఓసీలు 1.7% ఉన్నారు. మరో 5.5 శాతం మంది గుడిసెల్లో నివసిస్తున్నారు. మొత్తంగా 9.4 శాతం కుటుంబాలకు గృహవసతి లేదు. అంటే రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల కుటుంబాలు ఉండగా, వీరిలో సుమారు 10.5 లక్షల కుటుంబాలకు ఇండ్లులేవనే విషయం ఈ సర్వేద్వారా వెల్లడైంది. ఇండ్ల కోసమే సుమారు 25 లక్షల దరఖాస్తులు రావడం గమనార్హం.

కరెంట్‌లేని కుటుంబాలు 6.49 లక్షలు

రాష్ట్రవ్యాప్తంగా 6.49 లక్షల కుటుంబాలకు (5.8%) కరెంట్ సౌకర్యంలేదు. ఈ విషయం ప్రభుత్వం నిర్వహించిన సీపెక్ సర్వేలో వెల్లడైంది. అలాగే 86.6% కుటుంబాలకు మరుగుదొడ్ల సదుపాయం ఉన్నది. 92% కుటుంబాలు ఎల్‌పీజీని వినియోగిస్తున్నారు. మరో 0.7% బయోగ్యాస్‌ను వినియోగిస్తున్నారు. సుమారు 6లక్షల కుటుంబాలకు కట్టెల పొయ్యే దిక్కని ఈ సర్వే ద్వారా తెలిసింది.

30% మంది నిరక్షరాస్యులు

రాష్ట్రవ్యాప్తంగా 29.6% మంది నిరక్షరాస్యులు ఉన్నారు. మొత్తం జనాభా 3.70 కోట్లు ఉండగా, వీరిలో సుమారు 1.23 కోట్ల మంది అక్షర భాగ్యానికి నోచలేదు. రాష్ట్రంలోని అత్యధికంగా జోగుళాంబ-గద్వాల జిల్లాలో 44.5% మంది నిరక్షరాస్యులు ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో వనపర్తి 39.3%, నాగర్‌కర్నూల్ 39.2%, కామారెడ్డి 37, వికారాబాద్ 36% చొప్పున ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధికంగా నిరక్షరాస్యులు ఉన్నట్టు సీపెక్ సర్వే గణంకాల ద్వారా తెలుస్తున్నది. సంపూర్ణ అక్షరాస్యత దిశగా పాలకులు ఓవైపు ఊదరగొడుతుండగా వాస్తవాలు మాత్రం మరో విధంగా ఉండటం గమనార్హం.

అగ్రవర్ణాలకే అధిక ఆదాయం

రాష్ట్రంలోని 78.2% కుటుంబాల వార్షికాదాయం లక్షలోపే ఉన్నది. అగ్రవర్ణాల్లో 43.8% కుటుంబాలు లక్ష కంటే ఎక్కువ ఆదాయం కలిగి ఉన్నాయి. ఎస్టీల్లో 88.2%, ఎస్సీల్లో 86.2%, బీసీల్లో 71% కుటుంబాల చొప్పున లక్షలోపే ఆదాయం పొందుతున్నారు. అలాగే రూ.5 లక్షల కంటే అధికాదాయం పొందుతున్న వారిలో ఓసీలు 13.2%తో అగ్రపథాన ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1% మంది మాత్రమే ఉన్నారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారిలో 23.5% మంది ఓసీలే ఉన్నారు. మొత్తంగా అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు, బీసీలు 2.7 శాతం రెట్లు వెనుకబడి ఉన్నారు. ఈ గణంకాలు సమాజంలోని ఆర్థిక అంతరాలకు అద్దం పడుతున్నాయి.

ప్రైవేట్ విద్యాసంస్థల వైపు అగ్రవర్ణాలు

విద్యారంగంలోనూ సామాజిక అసమానతలు ఉన్నాయని సీపెక్ సర్వే స్పష్టం చేస్తున్నది. అగ్రవర్ణ పిల్లలు 34% మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటుండగా ఎస్టీల్లో 13%, ఎస్సీలు 15% మంది పిల్లలకే ప్రైవేట్ బడి భాగ్యం దక్కింది. ఇక ఉన్నత విద్యనభ్యసించిన వారిలో అగ్రవర్ణాల వారు 57% ఉండగా ఎస్సీ, ఎస్టీలు 31 శాతానికే పరిమితమయ్యారు.

రగులుతున్న బడుగు వర్గాలు!

జనాభా తగ్గించారని ఆగ్రహం ● కులాలవారీగా అంతర్మథనం

- సర్కార్ గణాంకాలపై గరంగరం
- 'నమస్తే తెలంగాణ కథనం' సంచలనం
- తాజా నివేదికపైనా తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ): బీసీలు రగిలిపోతున్నారు. కులాల వారీగా బలహీనవర్గాల జనాభాను కావాలనే తక్కువ చూపారంటూ గగ్గోలు పెడుతున్నారు. తక్కువ చూపడమే సర్కార్ లక్ష్యంగా పెట్టుకొన్నదంటూ నిప్పులు చెరుగుతున్నాయి. బీసీల్లో అత్యధికంగా ముస్లిం షేక్‌లే ఉన్నారంటూ 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన కథనం సంచలనం రేపింది. దీంతో సర్కార్ విడుదల చేసిన గణాంకాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గత నవంబర్‌లో రాష్ట్రంలోని ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల -2024) నిర్వహించింది. ఆ సర్వే గణాంకాల నివేదికను తాజాగా ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ఓసీలు, ముస్లింలలోని మొత్తం 242 కులాలు, ఉపకులాల వారీగా జనాభా లెక్కలు వెల్లడించింది. ఆయా కులాలు, ఉపకులాల వారీగా ఆర్థిక స్థితిగతులు, విద్యా, ఉపాధి, ఉద్యోగశాతం గణాంకాలనూ వివరించింది. ప్రస్తుతం ఆ గణాంకాలపై ఆయా కులాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. రాష్ట్రంలో బీసీలు 46.25%, ముస్లిం బీసీలు 10.08%, ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ఓసీలు 15.79%, నో క్యాస్ట్ 4% చొప్పున ఉన్నారని వెల్లడించింది. బీసీల మొత్తం జనాభాలో 27, 95,727 మంది బీసీ-ఈ క్యాటగిరీలోని షేక్‌లే (7.9శాతం) ఉన్నారని నిర్ధారించింది. ఆ తర్వాత ముదిరాజ్ జనాభా అత్యధికంగా ఉన్నదని తెలిపింది. ఆ గణాంకాలపైనే బీసీ కులాలు నిప్పులు చెరుగుతున్నాయి.



జనాభా తగ్గుదలపై ఆగ్రహం

రాష్ట్రంలో బీసీలైన పద్మశాలీల సంఖ్య ఎక్కువగానే ఉన్నది. ప్రభుత్వం పద్మశాలీల సంఖ్యను 3.3 శాతంగానే చూపింది. పద్మశాలీల ఉపకులమైన నీలకంఠం ఒకటి. దాని జనాభా ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అత్యధికంగా, ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యల్పంగా ఉంటుంది. సిద్దిపేట, దుబ్బాక, సిరిసిల్ల, సదాశివపేట, శంకరంపేటలోనే ఈ కమ్యూనిటీకి సంబంధించిన సత్రాలు, నీలకంఠేశ్వర ఆలయాలు, సహకార సంఘాలు, కల్యాణవేదిక ఉన్నాయి. ఒక్క సిద్దిపేటలోనే వీరి జనాభా 3 నుంచి 4 వేల మంది జనాభా ఉంటుంది. కానీ ప్రభుత్వం మాత్రం రాష్ట్రవ్యాప్తంగా కలిపి 7,700 జనాభా మాత్రమే ఉన్నట్టుగా చూపింది. దీనిపై నీలకంఠ కులస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. .

గౌడలను తగ్గించారా?

బీసీల్లో గౌడ, ఈడిగ, శ్రీశయన, శెట్టిబలిజ ఉపకులాలైన గౌడశెట్టి, ఏనుగుటి పటం కులాల్లోని మొత్తం జనాభా దాదాపు 26 లక్షలకు పైగా ఉన్నారని ఆ కులసంఘాలే వెల్లడిస్తున్నాయి. అలాంటిది ప్రభుత్వం గౌడ కులస్తుల జనాభా 16,30,187 (4.6శాతం) ఉన్నట్టు చూపిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మా జనాభా 7 లక్షలు తగ్గిస్తరా?

తమ కులాల జనాభాను 7 లక్షల వరకు సర్కార్ తగ్గించి చూపిందని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయులు భగ్గుమంటున్నారు. కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిలాశిల్పి, స్వర్ణకార, పంచదాయ వృత్తిదారులందరినీ కలిపి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయులుగా గత ప్రభుత్వాలు, కమిషన్లు గుర్తించాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటన్నింటినీ విస్మరించి, అందుకు విరుద్ధంగా కులగణనలో విభజించి వివరాలు సేకరించింది. మొత్తంగా రాష్ట్రంలో 20 లక్షలకు పైగా తమ కులాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం 13లక్షలకు మించకుండా సర్కార్ లెక్కలు ఉన్నాయని చెప్తున్నారు.

సర్కార్ గణాంకాలను తప్పుబడుతున్న బీసీలు

సర్కార్ కులగణన గణాంకాలను బీసీ వర్గాలు తప్పుబడుతున్నాయి. రాష్ట్రంలోని బీసీల్లో అత్యధిక జనాభా తమదేనని, కానీ, తమ కులస్తులు 26,39,027 (7.4శాతం) ఉన్నట్టు సంఖ్యను తగ్గించి చెప్పారని ముదిరాజ్ (బీసీ-డీ) అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. యాదవ, మున్నూరుకాపు, పద్మశాలి, రజక, కురుమ/కురుబ, వడ్డెర, అగ్నికుల క్షత్రియ తదితర కులాలన్నీ తమ జనాభాను తగ్గించి సర్కార్ చూపిందని ఆగ్రహంతో ఉన్నారు. సర్కార్ లెక్కలపై ఎస్సీలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా 20శాతానికి మించి ఉంటుందని, కానీ ప్రభుత్వం తాజాగా 17.43 శాతమే ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

లెక్కలపై సర్వత్రా అంతర్మథనం

కాంగ్రెస్ సర్కార్ విడుదల చేసిన గణాంకాలపై అన్నికులాలు, వర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి తెలంగాణ తొలి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వేలో అన్ని కులాల వారీ లెక్కలు సేకరించారు. ఆ లెక్కల్లో 30 లక్షల మంది కులం నమోదు చేయని కారణంగా, మరికొన్ని కారణాలతో అప్పటి ప్రభుత్వం ఆ లెక్కలను ప్రకటించలేదు. కానీ 2014 నుంచి 2025 వరకు ఈ పదేండ్ల కాలంలో బీసీలు 21 లక్షల మంది కనపడకుండా పోయారు. అంతేకాదు బీసీల్లో అసలు జనాభా పుట్టనే లేదన్నట్టుగా ప్రస్తుత ప్రభుత్వం చేసిన లెక్కలు చెప్తున్నాయని విమర్శిస్తున్నారు.

మాదిగలను విస్మరిస్తే సర్కార్‌కు మనుగడ లేదు

- 70లక్షల జనాభా ఉన్నా ఎస్సీలను పట్టించుకోరా : మోత్కుపల్లి



ఖైరతాబాద్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో 70 లక్షల జనాభా ఉన్న మాదిగలను సీఎం రేవంత్ రెడ్డి విస్మరిస్తున్నారని మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపకులు మోత్కుపల్లి నర్సింహులు ధ్వజమెత్తారు. నక్క జిత్తులోల్లు, నల్లికుట్లోల్లు తన వెనుక గోతులు తవ్వుతున్నారని ఇటీవల ఓ సభలో సీఎం చెప్పారని, దీనిబట్టి త్వరలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఉన్నదని చెప్పారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కులగణన ప్రకారం రాష్ట్రంలో మాదిగలే మెజార్టీగా ఉన్నారు. కానీ లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీ, కౌన్సిల్, కార్పొరేషన్లలో స్థానం మాత్రం లేదు. ఎందుకు ఈ వివక్ష చూపిస్తున్నారు. మల్లు రవిని ఎలా ఎంపిక చేశారు. వెంకటస్వామి కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి టికెట్లు ఇచ్చారు. వివేక్ సహా ముగ్గురు కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చారు. 80 శాతం ఉన్న మాదిగలను వదిలిపెట్టి 10 శాతం కూడా లేని మాలలకు టికెట్లు ఎలా ఇస్తారు. రేవంత్ రెడ్డి వివక్షాపూరితమైన పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.

బీసీలను అణగదొక్కే నివేదిక



తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులాల సర్వేలో బీసీ కులాల వివరాలు అసమగ్రంగా ఉన్నాయి. మొత్తం 3.54 కోట్ల రాష్ట్ర జనాభాలో 133 బీసీ కులాల జనాభాను 46.25 శాతంగా మాత్రమే చూపిస్తున్నారు. కానీ, ముస్లిం మైనారిటీ బీసీలు 10శాతం కలిపి బీసీల జనాభాను 56 శాతంగా చూపించడం నివేదిక డొల్లతనాన్ని బయటపెడుతున్నది. ఒక్క బీసీలే 52శాతం జనాభా ఉన్నారని 2015లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే బయటపెడితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారంగా 46 శాతం ఎలా ఉంటారు. రాష్ట్రంలో 133 బీసీ కులాలు ఉంటే 69 కులాలు మాత్రమే అత్యంత వెనుకబడిన కులాలు అని చెప్పడం కూడా ఎంతవరకు సమంజసం.

-డాక్టర్ తిరునహరి శేషు, బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్

పద్మశాలీలను బలిచేశారు



కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన కులగణనలో పద్మశాలీలకు తీవ్ర అన్యాయం జరిగింది. గత ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 2015లో 18 లక్షల జనాభాను చూపించారు. సర్కార్ తాజాగా ప్రకటించిన కులగణన సర్వేలో పద్మశాలీలను కేవలం 11,79,031గా చూపించింది. 11 ఏండ్లలో జనాభా పెరగాలి కానీ తగ్గుతుందా? ఇది పూర్తిగా బీసీల్లో పద్మశాలీలను అణగదొక్కే ప్రయత్నంగానే భావిస్తున్నాం. ఉద్దేశపూర్వకంగానే జనాభాను తక్కువగా చూపిస్తున్నారు. వాస్తవానికి 30 లక్షల నుంచి 35 లక్షల జనాభా ఉన్నది. 18 లక్షల ఉన్న జనాభా 11 లక్షలకు ఏట్లా వస్తది? అందులో 19 ఉప కులాలు ఉండగా ఉపకులాలు ఊసేలేదు. వారికి నచ్చినట్టు మార్పులు చేసుకొని డిక్లేర్ చేసుకున్నారు. ఎక్కువ జనాభా చూపిస్తే ఎక్కువ సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. వాళ్ల అధికారం కోసం, సీట్ల కోసం పద్మశాలీలను బలిపెట్టారు.

- వల్లకాటి రాజ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు

బీసీ జనాభాను తగ్గించి చూపించారు



రాష్టంలో బీసీలను అణగదొక్కే కుట్ర జరుగుతున్నది. ఇందులో భాగంగానే షేక్‌లు (ముస్లింలు) బీసీల్లో అత్యధికంగా ఉన్నారని ప్రభుత్వం చూపుతున్నది. బీసీలను తక్కువ చేసి చూపించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగకుండా చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రగా బీసీ సమాజనం భావిస్తున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపుతున్నది. ప్రభుత్వం చూపుతున్న బీసీ గణాంకాలు తప్పుల తడకగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు బీసీలపై చిత్తశుద్ధి లేదు.

- తన్నీరు రాంప్రభు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కుటుంబ సర్వే మొత్తం ఫేక్



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే మొత్తం ఫేక్. 1961 జూన్ 16న మున్నూరు కాపుల జనాభా 35 లక్షలు ఉండగా 65 ఏండ్ల తర్వాత చేపట్టిన కుటుంబ సర్వేలో 13.70 లక్షలకు పడిపోవడం ఆశ్చర్యంగా ఉంది. 65 ఏండ్లలో 22 లక్షల జనాభా తగ్గడమనేది విచిత్రం ఉన్నది. అనేక కులాల జాబితాలు కూడా తప్పుల తడకగా ఉన్నాయి. రాష్ట్రంలో ముదిరాజ్‌లు ప్రథమ స్థానంలో ఉన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఓసీలో రెడ్లే ఎక్కువగా ఉన్నారని చూపించడం హాస్యాస్పదం. బీసీలంతా ధనవంతులుగా చిత్రీకరించడం సరికాదు. బీసీల్లో అత్యధికులు షేక్‌లు ఉన్నారంటూ ప్రభుత్వం వింత నివేదికను వెల్లడించింది.

- డీ ధనుంజయనాయుడు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తప్పుల తడకగా కులగణన



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీసీ కులగణన అంతా తప్పుల తడకగా ఉన్నది. జనాభాలో 60శాతానికి పైగా ఉన్న బీసీలను 46శాతంగా చూపించి వారి హక్కులను కాలరాసేవిధంగా చేపట్టిన సర్వేగా భావిస్తున్నాం. బీసీలను ఇప్పటికీ అన్ని రాజకీయపార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి. బీసీలు ఎప్పటికీ వారి బోయిలుగానే ఉండాలని రాజ్యాధికారం దక్కవద్దనే ఉద్దేశంతోనే ఈ కులగణన జరిగింది. మేమెంతో మాకు అంత వాటా దక్కాలి. కాంగ్రెస్ పార్టీ మరోసారి పారదర్శకంగా కులగణన చేపట్టాలి. **- పగిడి జీడయ్య యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్**

కులగణనలో ముస్లింలకు అన్యాయం

- ఉప కులాల లెక్కల్లో గందరగోళం
- కావాలనే విస్మరించారని ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సర్కార్ తాజాగా విడుదల చేసిన కులగణన సర్వే లెక్కల్లో గందరగోళం నెలకొన్నది. ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు తీరని అన్యాయం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీసీ ముస్లింల్లోని 14 వర్గాలకు చెందిన 64 ఉప కులాల జనాభా 35,76,588 (10.88%) మంది ఉన్నట్టు చూపించగా, ఓసీ ముస్లింల జనాభాను 8,80,424 (2.48%) మందిగా పేర్కొన్నారు. ఇది పూర్తిగా తప్పని మైనారిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఓసీ ముస్లింల్లో సయ్యద్, ముషైక్, మొఘల్, పఠాన్, ఇరానీ తదితర 16 ఉప కులాలు ఉన్నాయని చెప్తున్నారు. సబ్‌క్యాస్ట్‌ల వారీగా లెక్కించకుండా 2.48%గా చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఎండీ, అబ్దుల్లా ప్రస్తావించలేదు?

కులగణన సర్వేలో బీసీ-ఈ క్యాటగిరీలో ఎండీ, అబ్దుల్లా ముస్లింలను ప్రత్యేకంగా చూపకపోవడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 2007లో బీసీ-ఈ క్యాటగిరీ ముస్లింలకు అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం 4% రిజర్వేషన్లు కల్పించిందని చెప్తున్నారు. అయితే, రిజర్వేషన్‌కు సంబంధించిన ఉత్తర్వుల్లో ఎండీ అనే ఇంటి పేరు లేకపోవడంతో బీసీ-ఈ సర్టిఫికెట్లు జారీచేయలేదని గుర్తుచేస్తున్నారు.

సర్వేలో తీవ్ర గందరగోళం : యాకూబ్‌పాషా

సర్కార్ విడుదల చేసిన కులగణన సర్వేలో గందరగోళం నెలకొన్నదని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ఆరోపించారు. ముస్లింల జనాభాను తగ్గించి చూపారని, కొన్ని ఉప కులాలను సర్వే చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని అన్నారు.

పార్లమెంట్ సాక్షిగా రేవంత్ నవ్వులపాలు

III >తరువాయి...

అవుతుందని చురకలు అంటించారు. 'డీలిమిటేషన్‌కు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఆసక్తికరమైన హైబ్రిడ్ మాడల్‌ను ప్రతిపాదించారు. నియోజకవర్గాల పునర్విభజన చేసేటప్పుడు రాష్ట్ర జనాభాను, ఆ రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ)తో లింక్ చేయాలని రేవంత్ సూచిస్తున్నారు. ఇలాంటి సలహాలను రేవంత్‌కు ఎవరు ఇస్తున్నారో నాకు తెలియడం లేదు గానీ, ఈ వాదనలను చూసి తెలంగాణ ప్రజలే నవ్వుకొంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ ప్రతిపాదన నవ్వుకోవడానికి ఎంతో చక్కగా ఉపయోగపడితే, ఆచరణకు మాత్రం ఎంతమాత్రం పనికిరాదు. దీన్ని నేను వివరించే ప్రయత్నం చేస్తా. తెలంగాణలోని ఓ సామాన్యుడి ఓటు బీహార్ ఓటరు కంటే విలువైనదన్నట్టు రేవంత్ మాట్లాడుతున్నారు. ఒకవేళ రేవంత్ ఉద్దేశం ఇదే అయితే, 'ప్రతి పౌరుడికీ ఓటు.. ప్రతి ఓటుకూ సమానమైన విలువ' అనే రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని రేవంత్ తప్పుబడుతున్నట్టే లెక్క. ధనవంతులకు ఎక్కువ ఓట్లు, పేదోడి ఓటుకు విలువే లేదన్నట్టు రేవంత్ వ్యవహారం ఉన్నది. ఒకవేళ, రేవంత్ ప్రతిపాదనను మనం ముందుకు తీసుకెళ్తే, ముఖేశ్ అంబానీకి లక్ష ఓట్లు వచ్చిపడతాయి. మనలాంటి సామాన్యులకు ఒకే ఓటు మిగులుతుంది. ఇలాంటి లాజిక్‌లేని ప్రతిపాదనలను తీసుకొస్తారా? డీలిమిటేషన్‌ను రాష్ట్ర జీఎస్డీపీతో ముడిపెడుతూ రేవంత్ తీసుకొచ్చిన ఈ ప్రతిపాదన ప్రపంచంలోనే అత్యంత తెలివి తక్కువ ప్రతిపాదన. ఇది రాజ్యాంగ విరుద్ధమైనది. 'ప్రతీ పౌరుడికీ ఓటు' అనే రాజ్యాంగ సూత్రానికి ఇది విఘాతం కలిగిస్తున్నది. అని బీజేపీ ఎంపీ నిప్పులు చెరిగారు.

ఎప్పుడు పడితే అప్పుడు మారుస్తారా?

బీజేపీ ఎంపీ ఇంకా మాట్లాడుతూ.. 'స్పీకర్ సార్.. ఇక్కడ మరో కోణం ఉంది. ఏదైనా దేశ జీడీపీ అయినా, రాష్ట్ర జీఎస్డీపీ అయినా పది, పదిహేనేండ్లపాటు స్థిరంగా ఏమీ ఉండదు. ప్రతి ఆరు నెలలకూ జీడీపీ పెరుగొచ్చు లేదా తగ్గొచ్చు. ఒక ఏడాది జీడీపీ ఎక్కువగా ఉంటే, మరో ఏడాది తగ్గొచ్చు. ఇప్పుడు రేవంత్ చెప్పినట్టు డీలిమిటేషన్‌ను జీఎస్డీపీతో లింక్ చేస్తే.. తరచూ సీట్ల సంఖ్యను మార్చాల్సి వస్తుంది. ఈ ఏడాది తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా కురిశాయని అనుకొందాం. అప్పుడు జీఎస్డీపీ బాగుంటే తెలంగాణకు అదనంగా సీట్లు ఇవ్వాలా? వచ్చే ఏడాది తమిళనాడులో అసలు వర్షాలే పడలేదు. కాబట్టి, తమిళనాడుకు రెండు సీట్లను కోత పెట్టాలా? ఇలాంటి అశాస్త్రీయమైన ప్రతిపాదనలను కాంగ్రెస్ తీసుకొస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డీలిమిటేషన్‌కు జీఎస్డీపీని లింక్ చేయాలన్న రేవంత్ ప్రతిపాదన ఎంతో హాస్యాస్పదమైనది' అంటూ ఎద్దేవా చేశారు.

కొడుకు మృతి..కుప్పకూలిన తల్లి

గద్వాల జిల్లా తూంకుంటలో విషాదం

అయిజ, ఏప్రిల్ 16 : వడదెబ్బకు తనయుడు మృతిచెందగా.. పుత్రశోకంతో తల్లడిల్లిన తల్లి గుండెపోటుతో కుప్పకూలిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. అయిజ మండలం తూంకుంటకు చెందిన కుర్వ మల్లికార్జున్ (42) కుటుంబసభ్యులతో కలిసి గురువారం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై పొలంలోనే కుప్పకూలాడు. వెంటనే అయిజకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని సొంతూరుకు తీసుకురాగా కండ్లెదుటే కన్నకొడుకు మృతిచెందడంతో శోకసంద్రంలో మునిగిన అతడి తల్లి రంగమ్మ(63) రోదిస్తూ గుండెపోటుతో మృతిచెందింది. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఇద్దరి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ధైర్యంచెప్పారు.



మల్లికార్జున్ (ఫైల్)



రంగమ్మ (ఫైల్)

కూతురి లోపం.. తల్లి ఆత్మహత్య

- ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకోగా మంటల్లో చిక్కుకొని చిన్నారి మృతి

ధర్పల్లి, ఏప్రిల్ 16: కూతురు గ్రహణ మొర్రితో జన్మించిందనే మానసిక వేదనతో తల్లి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా మంటలు చిన్నారికి కూడా అంటుకొని ఇద్దరూ మృతిచెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం గోవింద్‌పల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై వినయ్ కథనం మేరకు.. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌కు చెందిన కీర్తన (25)కు, గోవింద్‌పల్లికి చెందిన ప్రదీప్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఏడాది క్రితం రెండో కాన్పులో సాన్వి (సంవత్సరం) గ్రహణమొర్రితో జన్మించింది. దీంతో మానసిక వేదనకు గురైన కీర్తన.. బుధవారం తన చిన్న కూతురిని తీసుకొని గదిలోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. మంటలు పక్కనే బెడ్ పైకి వ్యాపించడంతో, అక్కడే ఉన్న సాన్వి సైతం మంటల్లో చిక్కుకున్నది. స్థానికులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తల్లి, కూతురు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



కుమార్తె సాన్వితో కీర్తన (ఫైల్)

బాలుడికి యాసిడ్ తాగించిన పిన్ని

చిన్నారిపై మామ ఎక్కువ ప్రేమ చూపించడంతో అక్కసు

మేడిపల్లి, ఏప్రిల్ 16: ఇంట్లో తన కొడుకును చిన్న చూపు చూస్తున్నారన్న కారణంతో తోటి కోడలి కొడుకుపై దారుణానికి ఒడికట్టింది మహిళ. నాలుగేండ్ల బాలుడికి ఆమె యాసిడ్ తాగించింది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోడుప్పల్‌లోని శ్రీనివాసకాలనీలో నివసిస్తున్న సతీశ్‌కుమార్, అంజమ్మ దంపతులకు కుమారులు నాగరాజు, జగదీశ్ ఉన్నారు. వీరిద్దరికి పెండ్లి అయ్యి పిల్లలు కూడా ఉన్నారు. అందరూ ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. అయితే పెద్దకుమారుడి కొడుకుపైనే తాత ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారని, తన కుమారుడిని పట్టించుకోవడం లేదని చిన్న కోడలు మంజుల కక్ష పెంచుకున్నది. ఇటీవల తాత తన చెయ్యిపై పెద్దకుమారుడి కొడుకు పేరు పచ్చబొట్టు వేయించుకున్నారు. దీంతో మరింత కక్షతో రగిలిపోయిన ఆమె ఆ బాలుడిని అంతమొందించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కొద్దిరోజుల కిందట చిన్నారి నోరు, ముక్కు మూసి చేతులు గట్టిగా పట్టుకున్నది. గమనించిన బాలుడి తల్లి ప్రశ్నించడంతో ఆడుకుంటున్నామని చెప్పి తప్పించుకుంది. మరోసారి బాలుడిని ఇంటిపైకి తీసుకెళ్లి రెయిలింగ్‌పై కూర్చోబెట్టింది. ఇది చూసిన తాత ఆమెను మందలించాడు. తాజాగా ఈ నెల 9న మంజుల బాలుడిని కిచెన్‌లోకి తీసుకెళ్లి జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తానని నమ్మించి యాసిడ్ తాగించింది. బాలుడి పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు వెంటనే దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ గణాంకాలు గందరగోళం!

- ఓసీలు కులవివక్షకు గురవుతున్నారట
- ఎస్టీల వద్దనే అధిక భూమి ఉన్నదట
- ఎస్సీ, ఎస్టీ, ఓసీల్లోనూ బాల్య వివాహాలు
- రేవంత్‌రెడ్డి సర్కార్ సర్వే వింత నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం కులాలవారీగా వెల్లడించిన గణాంకాలపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది. ఆ వివరాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆలయ ప్రవేశాలకు ఓసీలే అధికంగా వివక్షకు గురవుతున్నారని నివేదించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇది గణాంకాల్లోని డొల్లతనాన్ని బయటపెడుతున్నదని కుల సంఘాలు మండిపడుతున్నాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, ముస్లింమైనార్టీలు, ఓసీలు కలిపి మొత్తంగా 242 కులాలు, ఉపకులాల వారీగా వాటి జనాభాను, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ, ఉపాధి తదితర స్థితిగతుల గణాంకాలను ప్రభుత్వం వెల్లడించింది. అందులో చాలా ఆసక్తికరమైన విషయాలు, అసంబద్ధమైన విషయాలు ఉండటమే ఇప్పుడు చర్చనీయాంశమైంది. క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా నివేదిక ఉన్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. కులాంతర వివాహాలు ఇతర అన్ని వర్గాల కంటే ఓసీల్లోనే ఎక్కువున్నాయని నివేదిక వెల్లడించింది. మరోవైపు 95 శాతం కులంలోనే వివాహాలు కుదుర్చుకుంటున్నాయని తెలిపింది. తెలంగాణలో సగటు స్త్రీ-పురుష నిష్పత్తి 0.98గా ఉందని, స్త్రీ-పురుష నిష్పత్తిలో అసమతుల్యత లింగ ఆధారిత వివక్షను తేటతెల్లం చేస్తున్నది. అందులోనూ ఓసీ కులాల్లో స్త్రీ పురుష నిష్పత్తి రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఉండటం గమనార్హం. బాల్యవివాహాలు సైతం బీసీల తర్వాత ఓసీ కులాల్లోనే ఎక్కువగా ఉండగా, అత్యల్పంగా ఎస్టీల్లో ఉండటం విస్మయం గొలుపుతున్నది. స్కూల్ డ్రాపౌట్స్‌లో రాష్ట్ర సగటు 2.2శాతం కాగా, ఎస్టీ, బీసీల్లో ఎక్కువగా ఉండగా, ఎస్సీ, ఓసీల్లో సమానంగా ఉండటం విశేషం. వీధివ్యాపారాల ద్వారా స్వయం ఉపాధి పొందే వారి రాష్ట్ర సగటు 4.7శాతం కాగా, అందులో బీసీలే అత్యధికం. ఆ తరువాత ఓసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఉన్నారు. కులవృత్తిలో కొనసాగుతున్నవారి రాష్ట్ర సగటు 6.8శాతం కాగా బీసీలు 10.4శాతం మంది ఉన్నారు. ఆ తరువాత ఎస్సీలు, ఓసీలే ఉన్నారు. తెలంగాణలోని వివిధ సామాజికవర్గాల మధ్య ఉన్న తీవ్రమైన ఆర్థిక, వృత్తిపరమైన అసమానతలను నివేదిక వెల్లడించింది. ప్రైవేట్ రంగంలోనూ ఇతర వర్గాల కంటే ఐదు రెట్లు ఓసీలు అధికంగా ఉండటం గమనార్హం. ఇది ఓసీలకున్న విద్యావకాశాలు, పట్టణ నెట్‌వర్క్‌లను సూచిస్తున్నదని సర్కార్ తెలిపింది. ఉన్నత కులాలు ఆర్థికంగా స్థిరమైన, గౌరవప్రదమైన వృత్తుల్లో ఉండగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఇంకా తక్కువ ఆదాయం వచ్చే అస్థిరమైన పనుల్లోనే కొనసాగుతున్నారని స్పష్టంచేసింది. భూ యాజమాన్యం సామాజికవర్గాల మధ్యనున్న ఆసక్తికరమైన వ్యత్యాసాలను వెల్లడిస్తున్నది. సాధారణంగా ఆర్థికంగా వెనుకబడినవర్గాలకు ఆస్తులు తక్కువగా ఉంటాయని భావిస్తాం. కానీ, ఇక్కడ ఎస్టీలు అత్యధిక భూ యాజమాన్యాన్ని కలిగి ఉన్నారని నివేదిక తెలిపింది. అయితే వారు సంప్రదాయకంగా అటవీ, వ్యవసాయ భూములపై ఆధారపడి ఉండటాన్ని అది స్పష్టం చేస్తున్నది. ఆ భూమి నాణ్యత, దాని ద్వారా వచ్చే ఆదాయమెంతనే దాన్ని కూడా విశ్లేషించాల్సిన అవసరముందని, నిర్మాణాత్మక అసమానతలు, భూమి ఉండటం ఒక ఎత్తయితే ఆ భూమి విస్తీర్ణం, విలువలోని వ్యత్యాసాలు వేరే అని నివేదిక తెలిపింది.

జనాభా పరంగా కులాల ప్రభావం..

వర్గం	మొత్తం కులాలు	10లక్షలకు పైగా జనాభా	5-10 లక్షల జనాభా	లక్ష-5 లక్షలు	50వేలు-లక్ష	50వేల కంటే తక్కువ
బీసీలు	133	6	4	15	10	98
ఎస్సీలు	59	2	0	2	2	53
ఓసీలు	18	1	2	4	3	8
ఎస్టీలు	32	1	0	3	1	27
మొత్తం	242	10	6	24	16	186
జనాభా వాటా	96.1%	58.7%	11.5%	16.4%	3.0%	6.5%

42 పారామీటర్స్ వారీగా కులాల స్థితిగతులు శాతాల్లో..

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
సామాజిక వివక్ష ప్రార్థనా స్థలాల్లో వివక్ష	5.0	5.3	4.0	5.4
కులాంతర వివాహాలు	4.7	4.9	3.2	5.8
లింగం స్త్రీ-పురుష నిష్పత్తి	98.4	101	96.3	97.6
బాల్యవివాహాలు	4.6	4.0	3.9	4.4
10కంటే తక్కువ చదివిన మహిళల వాటా	67.1	66.5	72.3	55.0

విద్య

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
నిరక్షరాస్య పిల్లలు	3.6	3.3	3.7	3.7
డ్రాపౌట్స్ రేటు	2.3	2.1	2.4	2.1
ప్రాథమిక విద్య వరకు	38.7	38.6	40.5	34.6
ఇంటర్మీడియట్ విద్య వరకు	54.0	57.0	53.0	44.0
డిప్లొమా, అంతకంటే ఎక్కువ	20.3	18.9	15.9	31.7
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు	45.4	49.1	43.6	32.4
ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లలు	17.3	9.7	7.8	29.9
ఆంగ్ల మాధ్యమంలో చదివిన యువత	48.1	40.7	36.6	66.3

ఆదాయం

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
వార్షిక ఆదాయం లక్షకంటే తక్కువ	80.5	86.2	88.2	56.2
వార్షిక ఆదాయం 1లక్ష- 5లక్షలు	16.7	11.7	9.7	30.6
వార్షిక ఆదాయం 5లక్షలపైన	2.9	2.1	2.1	13.2
ఆదాయపు పన్ను చెల్లింపుదారులు	7.9	6.0	5.0	23.5

వృత్తి

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
రోజువారీ కూలీలు	32.2	45.7	40.6	10.9
బాలకార్మికులు	0.8	1.2	1.8	0.2
రోజువారీ కూలీ వ్యాపారులు	5.7	3.5	2.8	3.9
ఉపాధి హామీ కార్మికులు	1.0	1.7	1.2	0.3
వ్యవసాయ కార్మికులు	18.3	31.7	32.2	5.5
కులవృత్తిని కొనసాగిస్తున్నవారు	10.4	3.0	1.1	2.0
వృత్తిపర ప్రభుత్వ ఉద్యోగాలు	2.3	2.4	2.4	3.5
వృత్తిపర ప్రైవేట్‌రంగ ఉద్యోగాలు	6.3	5.6	2.8	14.8
మధ్యతరహా, పెద్ద వ్యాపారస్తులు	0.02	0.01	0.00	0.06

భూ యాజమాన్యం

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
సొంత భూమి	36.3	35.2	58.1	33.7
సాగునీటి సౌకర్యమున్న భూమి	45.9	43.4	32.9	44.1
కుటుంబానికి సగటు సాగునీటి భూమి(ఎకరాల్లో)	0.30	0.20	0.25	0.42
5ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న కుటుంబాలు	85.0	90.5	80.1	69.1
5-20 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు	12.2	7.0	17.9	26.4
20ఎకరాల కంటే ఎక్కువున్న కుటుంబాలు	2.9	1.0	2.0	4.4

జీవన పరిస్థితులు

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
గ్రామీణ జనాభా వాటా	58.2	70.6	88.4	39.7
రిఫ్రిజిరేటర్ ఉన్న గృహాలు	23.6	15.7	17.7	35.9
వ్యక్తిగత ఉపయోగానికి కారు ఉన్న గృహాలు	2.4	1.5	1.6	9.2
2గదుల కంటే తక్కువున్న గృహాలు	63.9	73.7	75.6	47.4
3గదుల కంటే ఎక్కువున్న గృహాలు	28.5	18.9	17.6	42.8
టాయిలెట్ లేని గృహాలు	10.8	18.8	32.5	4.5
విద్యుత్తు లేని ఇండ్లు	4.7	8.3	11.0	2.7
నల్లా లేని ఇండ్లు	20.0	19.7	29.2	12.8

ఆర్థిక పరిస్థితి

	బీసీలు	ఎస్సీలు	ఎస్టీలు	ఓసీలు
వివాహం లేదా వైద్య ఖర్చుల కోసం రుణాలు	7.3	10.9	6.9	3.0
వడ్డీవ్యాపారి నుండి రుణాలు తీసుకునేవారు	8.7	8.8	9.7	5.1

రవాణా శాఖలో భారీ స్కామ్‌కు స్కెచ్!

- ఫిట్‌నెస్ కేంద్రాల ఏర్పాటు ముసుగులో భారీ అవినీతి
- బీఆర్ఎస్ నేత వై సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో రూ.600 కోట్ల స్కామ్‌కు తెరలేపిందని బీఆర్ఎస్ నేత, రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన పలు ఆ ధారాలతో ఓ వీడియో విడుదల చేశా రు. వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు 37 కేంద్రాల కోసం నిరుడు ఫిబ్రవరిలో మొదటిసారి టెండర్లు పిలిచార ని తెలిపారు. ఒక్కో కేంద్రం ఏర్పాటు కు రూ.8 కోట్ల వ్యయంగా పేర్కొన్నార ని చెప్పారు. వాటికి మంజూరీ కూడా ఇచ్చి, కొద్దిరోజులకే రద్దు చేశారని పే ర్కొన్నారు. మళ్లీ అదే ఏడాది జూలైలో మరోసారి టెండర్లు పిలిచి తర్వాత మళ్లీ రద్దుచేశారని చెప్పారు. తాజాగా ఈ నెల 2న మళ్లీ టెండర్లు పిలిచారని, కానీ భారీ మార్చారని తెలిపారు. రెండుసార్లు కూడా 37 కేంద్రాలకు ఒకేసారి బిడ్డింగ్‌లు ఆహ్వానించారని, తాజాగా రెండు క్లస్టర్లుగా విభజించారని తెలిపారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు అయ్యే వ్యయాన్ని రూ.8 కోట్ల నుంచి రూ.11.50 కోట్లకు పెంచారని తెలిపారు. దీంతో 37 కేంద్రాల ఖర్చు రూ.425 కోట్లకు పెరిగిందని వివరించారు. మొత్తం రూ.490 కోట్లు అవుతుందని, దీనికి రూ.425 కోట్ల వ్యయం కూడా కలిపితే 900 కోట్లు అవుతుందని వివరించారు.

స్కామ్‌కు ఇదే రుజువు

ఈ నెల 17న టెండర్ గడువు ముగియనుండగా.. అనూహ్యంగా గురువారం నిబంధనల్లో మార్పులు చేశారని సతీశ్‌రెడ్డి తెలిపారు. 8 కేంద్రాలున్న క్లస్టర్‌కు టెండర్ వేసేవారి నెట్‌వర్త్‌ను రూ.50 కోట్ల నుంచి రూ.10 కోట్లకు తగ్గించేశారని, అలాగని.. టెండర్ గడువు మాత్రం పెంచలేదని తెలిపారు. నిరుడు ఎనిమిది కేంద్రాలతో కూడిన క్లస్టర్‌కు టెండర్ వేసే వారు రూ.50 కోట్ల నికర విలువ ఉండాలని నిబంధన విధించారని తెలిపారు. కానీ ఏడు కేంద్రాలతో ఏర్పడిన క్లస్టర్‌కు టెండర్ వేసే వారి నెట్‌వర్త్ రూ.9 కోట్లు ఉండే సరిపోతుందని నిబంధన విధించారని పేర్కొన్నారు. వ్యవహారం వెనుక ఓ మంత్రి అన్న కొడుకు ఉన్నాడని తెలుస్తున్నదని సతీశ్‌రెడ్డి ఆరోపించారు.



ఆకాశ విమానాన్ని ఢీకొన్న స్పైస్ జెట్

- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు సిద్ధమవుతున్న ఆకాశ ఎయిర్ విమానాన్ని, అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం తాకుతూ వెళ్లింది. ఈ ఘటనలో స్పైస్‌జెట్ విమానం కుడి వైపు వింగ్లెట్ దెబ్బతినగా, ఆకాశ ఎయిర్ విమానం ఎడుమవైపు భాగం స్వల్పంగా దెబ్బతిన్నది. వెంటనే స్పందించిన విమానాశ్రయ అధికారులు, ఆకాశ ఎయిర్ విమానంలోని ప్రయాణికులు, ఇతర సిబ్బందిని కిందికి దింపారు. ప్రయాణికులను హైదరాబాద్‌కు పంపేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు 'ఆకాశ ఎయిర్' అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ప్రమాదంలో అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై డీజీసీఏ తీవ్రంగా స్పందించింది. ఎక్కడ లోపం జరిగిందనే అంశంపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టామని డీజీసీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాద కారణంగా రెండు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు.

పేదింటి అమ్మాయి పెండ్లికి 8 గ్రాముల బంగారం

- మహిళలకు నెలకు రూ. 2,500
- అన్నదాతలకు రుణ మాఫీ
- టీవీకే మ్యానిఫెస్టో విడుదల

చెన్నై: త్వరలో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీవీకే అధినేత విజయ్ తమ పార్టీ మ్యానిఫెస్టోను గురువారం విడుదల చేశారు. పేదింటి అమ్మాయి పెండ్లికి 8 గ్రాముల బంగారం, నాణ్యమైన పట్టుచీర అందజేస్తామని హామీ ఇచ్చారు. 60 ఏండ్లలోపు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. 5 ఎకరాల్లోపు రైతులకు పంట రుణాలు మాఫీ, క్వింటా ధాన్యంపై రూ.3,500 కనీస మద్దతు ధర చెల్లింపు, స్వయం సహాయక సంఘాలకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, యువతకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి హామీలు మ్యానిఫెస్టోలో ప్రకటించారు.

లష్కరే సహ వ్యవస్థాపకుడిపై కాల్పులు

లాహోర్: లష్కరే తాయిబా సహ వ్యవస్థాపకుడు అమీర్ హమ్జాపై లాహోర్‌లో గురువారం కాల్పులు జరిగాయి. తీవ్రంగా గాయపడిన అమీర్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. లాహోర్‌లోని ఒక న్యూస్ చానల్ కార్యాలయం వెలుపల ఆయనపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య సీజ్‌ఫైర్

- 10 రోజుల పాటు కాల్పుల విరమణ
- ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- దీనితో కలిపి ఇప్పటిదాకా తాను 10 యుద్ధాలు ఆపానని వెల్లడి



వాషింగ్టన్, ఏప్రిల్ 16: ఇజ్రాయెల్, లెబనాన్ దేశాలు 10 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం వెల్లడించారు. గత కొన్ని వారాలుగా రెండు దేశాల సరిహద్దుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న క్రమంలో ఇది అరుదైన దౌత్య పురోగతిగా ఆయన అభివర్ణించారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో, ఇటు లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఆన్‌తో అద్భుతమైన సంభాషణలు జరిగినట్టు ట్రంప్ తెలిపారు. 'కాల్పుల విరమణ 5 పీఎం ఈఎస్‌టీ (3.30 ఏఎం, ఐఎస్‌టీ)కి ప్రారంభమవుతుంది' అని ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా 9 యుద్ధాలను పరిష్కరించడం నాకు దక్కిన గౌరవం. ఇది 10వది. దీనిని కూడా విజయవంతం చేద్దాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్, లెబనాన్‌కు చెందిన ప్రతినిధులు ఈ వారం మొదట్లో వాషింగ్టన్‌లో సమావేశమయ్యారని, ఇలా ఇద్దరూ సమావేశం కావడం 34 ఏండ్లలో ఇదే తొలిసారని ఆయన చెప్పారు. ఈ చర్చల్లో యూఎస్ విదేశాంగ మంత్రి రూబియో కూడా పాల్గొన్నారని ట్రంప్ వెల్లడించారు.

తెలివైన నిర్ణయం తీసుకోండి.. లేకపోతే..

శాంతి ఒప్పందానికి ఒప్పుకోకపోతే అనంతర పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్‌ను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మరోసారి హెచ్చరించారు. 'ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది.' అని పేర్కొన్నారు. 'ఇరాన్ కనుక తెలివితక్కువ నిర్ణయం తీసుకుంటే దాని మౌలిక సదుపాయాలు, విద్యుత్తు, ఇంధన రంగాలపై దిగ్బంధనం, బాంబుల వర్షం కురుస్తుంది' అని హెగ్సెత్ తెలిపారు. 'మీకు చెప్పేదేమిటంటే.. మేము మిమ్మల్ని గమనిస్తున్నాం. మీరు ఏ మిలిటరీ ఆస్తులను తరలిస్తున్నారో మాకు తెలుసు' అని అన్నారు. తాము మునుపటి కన్నా పూర్తి శక్తి మంతంగా, సన్నద్ధతతో వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ కనుక శాంతి ఒప్పందానికి సుముఖత చూపకపోతే తాము అనుకున్నంత కాలం హార్ముజ్ జలసంధిని దిగ్బంధించగలమని ఆయన హెచ్చరించారు.

ఇరాన్, రష్యా చమురు ఎగుమతులపై మళ్లీ ఆంక్షలు

ఇరాన్‌ను ఆర్థికంగా మరింత ఇబ్బంది పెట్టడానికి అమెరికా మరో షాకింగ్ నిర్ణయం తీసుకుంది. చమురు రవాణాకు ఇచ్చిన మినహాయింపులకు ఫుల్‌స్టాప్ పెట్టి ఇరాన్, రష్యా చమురు ఎగుమతులపై మళ్లీ ఆంక్షలు విధించాలని నిర్ణయించింది. రష్యా, ఇరాన్ చమురు కొనుగోలుకు అమెరికా మార్చిలో ఇచ్చిన మినహాయింపులను పొడిగించరాదని నిర్ణయించింది. ఇటీవల పశ్చిమాసియాలో ఏర్పడిన యుద్ధ సంక్షోభంతో చమురు ధరలను నియంత్రించడానికి, చమురుకు కొరత ఏర్పడకుండా ఉండటానికి గతంలో రష్యా, ఇరాన్ దేశాలపై విధించిన ఆంక్షలను అమెరికా సడలించి, ఈ దేశాల నుంచి చమురు కొనుగోలు చేసుకోవడానికి భారత్ సహా పలు దేశాలకు అనుమతి ఇచ్చింది.

తాజాగా, యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మీడియాతో మాట్లాడుతూ ఇరాన్‌కు చెందిన చమురు నౌకల నుంచి కొనుగోలుకు గడువు ఈ వారంతో ముగుస్తుందని చెప్పారు. అలాగే రష్యా చమురుకు తాత్కాలికంగా మంజూరు చేసిన ఆంక్షల ఎత్తివేత గడువు కూడా ఈ వారంతో ముగిసిపోతుందని తెలిపారు. ఇరాన్, రష్యాల చమురు సరఫరాపై అమెరికా తాత్కాలికంగా ఎత్తివేసిన ఆంక్షల వల్ల భారత్ బాగా లబ్ధి పొందింది. కాగా, ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత భారత్‌కు చెందిన శుద్ధి కర్మాగారాలు సుమారు 30 మిలియన్ బ్యారెళ్ల చమురు కోసం రష్యాకు ఆర్డర్ పెట్టాయి. అలాగే ఇరాన్ నుంచి కూడా ఏడేండ్ల తర్వాత భారత్ చమురును దిగుమతి చేసుకుంది. కనీసం రెండు సూపర్ ట్యాంకర్లు అక్కడి నుంచి భారత్ ఓడరేవులకు సరుకును చేరవేశాయి. సుమారు 4 మిలియన్ బ్యారెళ్ల చమురును ఇరాన్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంది.

ఆ 100 బిలియన్ డాలర్లు ఎక్కడ?

విదేశాల్లో స్తంభింపజేసిన 100 బిలియన్ డాలర్ల (రూ.9.3లక్షల కోట్లు) ఆస్తుల్ని విడుదల చేయాలని సుదీర్ఘ కాలంగా ఇరాన్ చేస్తున్న డిమాండ్.. అమెరికాతో రెండో దశ చర్చల్లో ప్రధాన అంశంగా మారింది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొన్ని దశాబ్దాలుగా అమల్లో ఉన్నందున.. చమురు ఎగుమతుల ద్వారా ఆ దేశానికి వస్తున్న ఆదాయానికి గండిపడుతున్నది. ఆంక్షల కారణంగా చైనాలో 20 బిలియన్ డాలర్లు, ఇండియాలో 7 బిలియన్ డాలర్లు, ఇరాక్‌లో 6 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులు స్తంభింపజేశారని 'అల్ జజీరా' వార్తా కథనం పేర్కొన్నది. విదేశీ బ్యాంకుల్లో పేరుకుపోయిన 100 బిలియన్ డాలర్ల ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ గత కొంతకాలంగా కోరుతున్నది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు 1979 నుంచి అమలవుతున్నాయి. దీని వల్ల విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విలువ ఎంతన్నది అధికారికంగా తెలియదు. సుమారుగా 100 బిలియన్ డాలర్లు ఉంటుందని ఓ అంచనా. ఇది ఆ దేశ జీడీపీలో నాలుగో వంతు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

వారు ఓటు వేయొచ్చు!

- అప్పీలేట్ ట్రిబ్యునళ్లు అనుమతించి ఉంటే ఓటింగ్‌లో పాల్గొనవచ్చు
- ఓటర్ల జాబితా నుంచి తొలగించిన బెంగాల్ ఓటర్లపై సుప్రీం కోర్టు తీర్పు

న్యూఢిల్లీ: బెంగాల్‌లో ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపునకు గురైన పౌరులకు సుప్రీం కోర్టు ఉపశమనం కల్పించింది. తొలగించిన ఓటర్లు త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవచ్చునని, అయితే వారు చేసిన విజ్ఞప్తులపై అధికారులు సకాలంలో నిర్ణయం తీసుకుని ఉండాలని పేర్కొన్నది. ఆర్టికల్ 142 ప్రకారం అర్హత గల ఓటర్లను ఓటింగ్‌లో పాల్గొనే హక్కు నుంచి తొలగించరాదని తెలిపింది. దీనిపై మూడు రోజుల పాటు జరిపిన విచారణ అనంతరం ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఎవరి పేర్లనయితే ఓటరు జాబితాలో నుంచి తొలగించారో వారు కనుక దానిపై దరఖాస్తు చేసుకుని ఉంటే, వారిని అప్పీలేట్ ట్రిబ్యునళ్లు అనుమతించి ఉంటే ఎన్నికల్లో వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని ధర్మాసనం స్పష్టం చేసింది. అదే సమయంలో సుప్రీం కోర్టు ఒక స్పష్టమైన గీతను గీసింది. అప్పీలేట్ ట్రిబ్యునళ్ల ముందు వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లు కేవలం పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులు కారని సుప్రీం కోర్టు పేర్కొన్నది.

ముస్లిం పర్సనల్ లాపై కేంద్రానికి నోటీసులు

ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్, 1937లోని కొన్ని నిర్దిష్ట ప్రొవిజన్లపై స్పందన తెలుపాలని కేంద్రానికి సుప్రీం కోర్ట్ గురువారం నోటీసులు జారీ చేసింది. చట్టంలోని కొన్ని నిబంధనలు మహిళలపై వివక్ష చూపుతున్నాయని దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం ఈ విధంగా స్పందించింది. షరియత్‌లోని వారసత్వ నియమాలు ఆస్తుల పంపకంలో మహిళల పట్ల స్పష్టంగా వివక్ష చూపుతున్నాయన్నాయని పిటిషనర్లు వాదించారు.

'ఓటింగ్ తప్పనిసరి' చేయాలన్న పిటిషన్ తిరస్కరణ

ఎన్నికల్లో ఓటు వేయడం తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. ఇలాంటి విషయాలు విధాన పరమైన నిర్ణయాల పరిధిలోకి వస్తాయని చెప్పింది. ఓటేయని వారిపై చర్యలు తీసుకోవాలన్న పిటిషనర్ సూచనపై ధర్మాసనం స్పందిస్తూ ఆ పని కోర్టు చేయలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా ఓటేయని వారికి లభించే ప్రభుత్వ ప్రయోజనాలపై ఆంక్షలు విధించాలని తాము ప్రభుత్వాన్ని బలవంతం చేయలేమన్నారు.

యూరప్‌లో అడుగంటుతున్న జెట్ ఫ్యూయల్

- వైమానిక రంగానికి యుద్ధం సెగ
- విమానాల రద్దు ప్రారంభం అవుతుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెచ్చరిక



లండన్, ఏప్రిల్ 16: పశ్చిమాసియా యుద్ధం సెగ ఇప్పుడు వైమానిక రంగాన్ని కూడా తాకింది. యూరప్‌లో ఆరు వారాలకు సరిపడా జెట్ ఇంధనం మాత్రమే మిగిలి ఉందని, ఇరాన్-యూఎస్ యుద్ధ సంక్షోభం ఇలాగే కొనసాగితే విమానాల రద్దు త్వరలోనే ప్రారంభం అవుతుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెడ్ ఫాతిహ్ బిరోల్ గురువారం హెచ్చరించారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి వద్ద రవాణా నిలిచిపోయిందని, దీంతో ఆయిల్, గ్యాస్, ఇతర ముఖ్యమైన సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని, ఇది గతంలో ఎన్నడూ ఎదుర్కోని అతి పెద్ద ఇంధన సంక్షోభం అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణంపై చెడు ప్రభావం చూపుతుందని అన్నారు. గ్యాస్, పెట్రోల్, విద్యుత్తు చార్జీలు అధికం కావడం ద్వారా అది ప్రజలపై పెను భారాన్ని మోపుతుందని అన్నారు. ప్రస్తుత ఎనర్జీ సంక్షోభం కారణంగా భారత్, పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, జపాన్ దేశాలు అత్యధికంగా ప్రభావితం అయినట్టు గుర్తించామని తెలిపారు. ఈ సంక్షోభం కారణంగా, ఎక్కువగా నష్టపోయేది ఎవరి గొంతుక వినిపిస్తుందో వారు కాదని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలేనని ఆయన పేర్కొన్నారు. హార్ముజ్ జలసంధి వద్ద వాణిజ్య నౌకలకు ఇరాన్ టోల్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆయన తప్పుబడుతూ ఇదే విధానాన్ని ఆసియాలోని మలక్కా జలసంధితో పాటు పలు ప్రాంతాల్లో అమలు చేస్తారని విమర్శించారు.



జనగామ జిల్లా పాలకుర్తి మార్కెట్‌యార్డులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి



నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

సర్కార్‌పై మక్కరైతు మండిపాటు

- కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆందోళన
- నాగర్‌కర్నూల్‌లో రోడ్డెక్కిన రైతులు
- 23 వరకు మక్కలు తేవొద్దన్న నోటీస్‌పై ఫైర్
- నిర్మల్ జిల్లా కనకాపూర్ వద్ద ధర్నా
- జనగామ జిల్లా పాలకుర్తి కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి
- కొనుగోళ్ల తీరుపై మండిపాటు

నాగర్‌కర్నూల్ రూరల్ / పాలకుర్తి/లక్ష్మణచాంద, ఏప్రిల్ 16: మక్కల కొనుగోలు చేపట్టకపోవడంపై రైతులు సర్కార్‌పై మండిపడ్డారు. పంట చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం పలుచోట్ల రోడ్డెక్కారు. మక్కజొన్న తీసుకొచ్చి ఐదు రోజులవుతున్నా కొనుగోలు చేపట్టడం లేదంటూ రైతులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ గేటు సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. కొందరి మక్కలు కొనుగోలు చేసినా.. లారీలకు ఎత్తడం లేదని, దళారులతో అధికారులు కుమ్మక్కై ఇలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గన్నీ బ్యాగులు లేవంటూ.. లారీలు అందుబాటులో లేవంటూ కుంటి సాకులు చెబుతూ కాంటా వేయడం లేదని వాపోయారు. వర్షం పడితే తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఇదే అదునుగా భావించిన దళారులు తక్కువ ధరకు కొనేందుకు తమ ఒత్తిడి తెస్తున్నారని రైతులు ఆవేదన చెందారు. సుమారు గంటసేపు ధర్నా చేపట్టడంలో కిలోమీటర్ పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల హామీతో ఆందోళన విరమించారు. ఈ నెల 23వ తేదీ వరకు మార్కెట్‌కు ధాన్యం తీసుకురావొద్దని, ఇక్కడ సరిపడా స్థలం లేదంటూ అధికారులు గేటుకు నోటీసు అంటించారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్ వద్ద మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ఐదు గ్రామాలకు చెందిన వందమందికిపైగా రైతులు గంటపాటు బైఠాయించారు. ఏఈవో, తహసీల్దార్ చేరుకొని, ఊరూరా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పాలకుర్తి కేంద్రాన్ని సందర్శించిన ఎర్రబెల్లి

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ యార్డును మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సందర్శించారు. రైతులు కన్నీరు పెడుతూ ఎర్రబెల్లికి తమ గోస చెప్పుకొన్నారు. చలించిన ఎర్రబెల్లి వెంటనే మార్క్‌ఫెడ్ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. రైతులకు బస్తాలు, లారీలను అందుబాటులో ఉంచాలని సదరు అధికారిని కోరారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ.. వారం రోజుల్లో మక్కలు కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తానని హెచ్చరించారు. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడ్డారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలుకానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాడని విమర్శించారు. రైతులకు రైతుబంధు మూడు సార్లు ఎగ్గొట్టాడని, ధాన్యానికి మద్దతు ధర లేదని మండిపడ్డారు.

గీతాముఖర్జీ పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ల బిల్లు

జాతీయ మహిళా సమాఖ్య వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంటేరియన్ గీతాముఖర్జీ పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు అని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నేతలు ఉస్తేలా సృజన, నేదునూరి జ్యోతి, మండ సదాలక్ష్మి తెలిపారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు సవరణలను వ్యతిరేకిస్తూ గురువారం హైదరాబాదులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 జనాభాను ఆధారంగా తీసుకోవాలని, మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీ మహిళా కోట ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఉండాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్ల బిల్లును జత కట్టడం సరికాదన్నారు. పురుషుల ప్రాతినిధ్యానికి నష్టం జరుగకుండా 50శాతం సీట్లు పెంచి 33శాతం మహిళా రిజర్వేషన్ కల్పించడం ఆక్షేపణీయమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సీట్లలోనే 33శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ ఫమీద, జే లక్ష్మి, హైమావతి, గిరిజ కృష్ణమూర్తి, విజయలక్ష్మి, యాదమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత బెదిరింపులతో కొనుగోళ్లు బంద్!

- సదరునేతపై మండిపడ్డ రైతులు
- ధాన్యం కొనాలని ఆందోళన
- నిజామాబాద్ జిల్లా కమలాపూర్ గ్రామంలో అన్నదాతల ధర్నా



నిజామాబాద్ జిల్లా కమలాపూర్ రోడ్డుపై బైఠాయించిన రైతులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16: ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కమలాపూర్‌లో రైతులు గురువారం ధర్నాకు దిగారు. అధికార పార్టీకి చెందిన నాయకుడి ఒత్తిడి మేరకే కాంటా పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ రోడ్డుపై బైఠాయించారు. పంట కోసి 20 రోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రారంభించలేదని, వెంటనే కాంటా చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉండే కాంగ్రెస్ నేతను పలుమార్లు కోరామని చెప్పారు. తమ ఆవేదనను చెబితే, కోపోద్రిక్తుడైన సదరు నాయకుడు ఒక్క ధాన్యం లారీ కూడా గ్రామం నుంచి వెళ్లకుండా చూస్తానని బెదిరించినట్టు వారు వాపోయారు. ఫలితంగా అధికారులు కాంటాలు పెట్టడం లేదని తెలిపారు. రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఇన్‌చార్జి మేనేజర్‌ను నిలదీస్తే.. అధికార పార్టీకి చెందిన నాయకుడి ఒత్తిడి వల్లే కాంటా పెట్టలేకపోతున్నామని చెప్పాడని రైతులు పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల తీరును నిరసిస్తూ 500 మందికి పైగా అన్నదాతలు గంటకు పైగా రోడ్డుపై బైఠాయించారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రాజ్యసభ సభ్యులుగా సింఘ్వీ, వేం ప్రమాణం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి గురువారం పార్లమెంట్ భవనంలో రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి వాణి వినిపిస్తానని చెప్పారు. నరేందర్‌రెడ్డికి మంత్రులు సీతక్క, శ్రీహరి అభినందనలు తెలిపారు.

సెంట్రల్ హాల్ పనులు ప్రారంభించండి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : శాసనమండలి, శాసనసభ మధ్యలో మిగిలిపోయిన సెంట్రల్ హాల్ పనులను ప్రారంభించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో ఆర్అండ్‌బీ, ఆగాఖాన్ సంస్థ, తెలంగాణ లెజిస్లేచర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ హాల్‌ను డిజైన్ చేసి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

18న మ్యూజియాలకు ఉచిత ప్రవేశం

హైదరాబాద్, ఏప్రిల్ 16, (నమస్తే తెలంగాణ): ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా తెలంగాణ హెరిటేజ్ శాఖ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియాలు, చారిత్రక కట్టడాలకు ఈ నెల 18న ఉచిత ప్రవేశాలను కల్పిస్తున్నట్టు సాంస్కృతికశాఖ తెలిపింది. పబ్లిక్‌గార్డెన్‌లోని స్టేట్ మ్యూజియంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించింది.

కనోయింగ్ కోచ్ పోస్టుకు దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో కనోయింగ్ కోచ్ పోస్టుకు ఔట్‌సోర్సింగ్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీడీఏ హైదరాబాద్ ప్రాజెక్టు అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోయిన్‌పల్లి స్పోర్ట్స్ అకాడమీలో కోచ్ నియామకానికి ఎన్ఎస్ఎన్ఐఎస్‌లో ఏడాది డిప్లొమా కోర్సు చేసిన అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్కార్ బెదిరింపులు!

- కార్మికులను వెంటనే విధుల్లోకి రప్పించేలా జెన్కోపై ఒత్తిడి
- డీమ్డ్ టర్మినేషన్‌కు ఉత్తర్వులు?
- విద్యుత్తు కార్మికుల మెడపై కత్తి?
- సమ్మె విరమించిన ఆర్టిజన్లు



భద్రాద్రి జిల్లా కేటీపీఎస్ వద్ద గురువారం ఉదయం 10 గంటల సమయంలో సమ్మె శిబిరంలో కూర్చున్న కార్మికులు

పాల్వంచ, ఏప్రిల్ 16: తెలంగాణ ప్రభుత్వం కార్మికులపైనా బెదిరింపులకు దిగింది. 'విధుల్లో చేరకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం (డీమ్డ్ టర్మినేషన్)' అంటూ జెన్కో యాజమాన్యం ద్వారా అనధికారిక ఉత్తర్వులతో ఒత్తిడి చేసింది. దీంతో దిక్కుతోచని స్థితిలో కార్మికులు సమ్మె విరమించారు. ఏపీఎస్‌సీబీ రూల్స్, ఎన్నికల హామీ ప్రకారం తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్తురంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగిన విషయం విదితమే. టీవీఏఈ జాక్ పిలుపు మేరకు పాల్వంచ కేటీపీఎస్ ప్రాంగణంలో ఈ నెల 8న ప్రారంభమైన సమ్మె గురువారం 9వ రోజుకు చేరుకున్నది. సమ్మె ఉధృతంగా కొనసాగడంతో ప్రభుత్వ ఒత్తిడి మేరకు టీజీ జెన్కో యాజమాన్యం కఠిన చర్యలకు పూనుకున్నది. జెన్కోలో సమ్మె చేస్తున్న కార్మికులందరూ విధుల్లో చేరకపోతే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ అనధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేటీపీఎస్ ప్రాంగణంలో 5, 6 దశల్లో 1,362, కేటీపీఎస్ ఏడో దశ, ఓఅండ్ఎం, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో పనిచేస్తున్న 729 మంది ఆర్టిజన్లు భయాందోళనకు గురయ్యారు. అప్పటి వరకూ సమ్మె శిబిరంలో ఉన్న 200 మంది కార్మికులు విధుల్లో చేరారు.

కార్మికులందరూ విధుల్లో చేరారు: సీఈ

కేటీపీఎస్ 5, 6 దశల్లో పనిచేసే ఆర్టిజన్లందరూ సమ్మె విరమించి విధుల్లో చేరారని సీఈ ప్రభాకర్‌రావు తెలిపారు. కార్మికులందరూ క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని సూచించారు. 7వ దశలోని 720 మంది ఆర్టిజన్లను కూడా విధుల్లో చేర్చుకుంటున్నామని ఏడో దశ సీఈ సూర్యనారాయణ వెల్లడించారు.

పెట్టుబడి పేరుతో 6.5 కోట్లు వసూలు!

- ఎట్టకేలకు నిందితుడి అరెస్ట్
- 'మంగ్లీ' పేరుతో మైక్రో ఫైనాన్స్ నిర్వహించినట్టు అనుమానం

హైదరాబాద్, సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): తమ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసగించిన ఓ ఘరానా మోసగాడిని అరెస్టు చేసినట్టు ఈవోడబ్ల్యూ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం విలేకరులకు వెల్లడించారు. నగరానికి చెందిన రమావత్ మధు శుభక్షేత్ర సంస్థ పేరుతో పెద్ద మొత్తంలో పెట్టుబడులను సేకరించాడని పేర్కొన్నారు. తమ సంస్థలో రూ.5లక్షలు పెట్టుబడి పెడితే.. 102 గజాల స్థలంతో పాటు, ప్రతినెలా రూ.25 వేలు చొప్పున 40 నెలలపాటు చెల్లిస్తానని నమ్మబలకడంతో, దీనికి ఆకర్శితులైన పలువురు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టినట్టు వివరించారు. కానీ మధు ఇచ్చిన హామీ మేరకు స్థలాలు, నెలవారి రాబడి ఇవ్వకపోవడంతో మోసపోయినట్టు గ్రహించిన పటాన్‌చెరుకు చెందిన 33మంది బాధితులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

సాదాబైనామాలకు మోక్షమెప్పుడో?

- జీవో 76 అమల్లో జాప్యం
- హైకోర్టు ఓకే చెప్పినా ముందుకు కదలని ప్రభుత్వం
- 9 లక్షల మందిలో ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ) : భూభారతి పేరుతో కొత్తచట్టం తీసుకొచ్చిన ప్రభుత్వం రైతుల సమస్యలు తీర్చడంలో తాత్సారం చేస్తున్నది. ప్రభుత్వ చర్యలతో సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ముందుకు సాగడంలేదు. మంత్రి పొంగులేటి పట్టుదలకు పోవడంతో అధికారులు అనాలోచిత నిబంధనలను రూపొందించారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో ఈ ప్రక్రియ ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్టు మారింది. ఈ కారణంగా 2020 నుంచి 8.90లక్షల మంది సాదాబైనామా దరఖాస్తుదారుల సమస్యలు తీరకపోగా ప్రభుత్వం కొత్త ఇబ్బందులను సృష్టిస్తున్నట్టు తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. రోజుకో నిబంధనతో 10లక్షల ఎకరాల క్రయవిక్రయ ఒప్పందాలపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. 2020లో ఆర్వోఆర్ చట్టం-1971 రద్దు కావడంతో నిలిచిపోయిన క్రమబద్ధీకరణ ప్రక్రియ నిరుడు ఆగస్టులో హైకోర్టు ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణకు అనుమతులు జారీ అయ్యాయి. అందుకు వీలుగా రైతులకు నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగానే భూభారతి చట్టం సెక్షన్-6 ప్రకారం సాదాబైనామా క్రమబద్ధీకరణ అధికారం ఆర్డీవోకు అప్పగించడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. కొత్త విధానం ప్రకారం తహసీల్దార్ విచారణ జరిపి ఫైల్‌ను ఆర్డీవోకు పంపాల్సి ఉంటుంది. అయితే తాజాగా అమ్మినవారు, కొన్నవారు ఇద్దరూ అఫిడవిట్ సమర్పించాలనే నిబంధన తేవడంతో ఈ ప్రక్రియ మరింత జాప్యమైంది. ఈ విధానంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇటీవలే అఫిడవిట్ అంశంపై సర్కార్ వెనకడుగు వేసింది. వెంటనే దరఖాస్తులను సీసీఎల్ఏ కార్యాలయం జిల్లా కలెక్టర్లకు దరఖాస్తులను బదిలీ చేసింది. కాగా అందులో కొన్ని 2023లో కలెక్టర్ల లాగిన్‌లో రిజెక్ట్ కావడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. అఫిడవిట్ నిబంధన కారణంగా కేవలం 7వేల దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు సమాచారం. 2014లో సాదాబైనామాలతో అమ్మిన భూ యజమానులు ఇప్పుడు అఫిడవిట్ ఇచ్చేందుకు ముందుకురాకపోవడంతో జిల్లాల్లో కలెక్టర్లు ఆయా దరఖాస్తులను తిరస్కరించారు. అఫిడవిట్ అవసరం లేదని ప్రభుత్వం నిబంధనలు సడలించినప్పటికీ ఇప్పటికే తిరస్కరణకు గురైన దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొన్నది. దీనిపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి స్పష్టత నివ్వలేదు.

బీఆర్ఎస్ హయాంలో సజావుగా ప్రక్రియ

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ అధికారం తహసీల్దార్లకే ఉండేది. వారే సాదాబైనామాల దరఖాస్తులను పూర్తిచేసి రైతుకు ఊరట కల్పించే వీలుండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దీనిని సవరించి, అధికారాలను బదలాయించి ఆర్డీవోలకు కట్టబెట్టింది. ఈ నేపథ్యంలోనే రిజెక్ట్ కాగా మిగిలిన దరఖాస్తులు వారి వద్దే ఉండిపోయాయి. కేవలం కొనుగోలుదారుల నుంచి అఫిడవిట్ తీసుకొనేలా జీవో76 విడుదల చేసినా రైతాంగానికి చిక్కులు ఎదురవుతున్నాయి. వీటిని సవరించాలని, మళ్లీ తహసీల్దార్లకే అధికారం కట్టబెట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేయకుండా ఉచితంగా సాదాబైనామాలు క్రమబద్ధీకరణ చేసిన తీరును రైతులు గుర్తుచేస్తున్నారు. అదే విధానంతో ముందుకు వెళితే రైతుకు మేలు జరిగేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రెండున్నరేండ్లుగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్రమబద్ధీకరణకు నోచుకోకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయని, ధరలు పెరుగడంతో సివిల్ వివాదాలు ఎదురవుతున్నాయని పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. రైతు భరోసా, రైతు భీమా పథకాలకు లబ్ధిపొందకుండా ప్రభుత్వ జాప్యం అడ్డంకిగా మారిందని ఆరోపిస్తున్నారు.

చిత్రం

నీ గడుసుతనం అందరికీ తెలిసిందే..



అగ్ర కథానాయిక సమంత నటిస్తూ, స్వీయ నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకురాలు. మే 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం 'తస్సాదియ్యా' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ గీతానికి రెహమాన్ సాహిత్యాన్నందించారు. చిన్మయి శ్రీపాద, పుణ్య సెల్వ ఆలపించారు. ఈ పాటలో సమంత ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్‌తో హుషారుగా కనిపించింది. 'రెండు జళ్ల ఓ మొలకా పెళ్లి కూతురువైపోయావే.. అయినా ఇంకేం మారలేదే అట్టాగే ఉన్నావు.. నువ్వు నీ గడసుతనం అందరికీ తెలిసిందిలే..' అంటూ పెళ్లి నేపథ్యంలో ఆహ్లాదభరితంగా సాగిందీ పాట. కుటుంబమంతా ఆస్వాదించే ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు. దిగ్నాథ్, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, నిర్మాతలు: సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు, దర్శకత్వం: నందినీ రెడ్డి.

ఎన్టీఆర్, త్రివిక్రమ్ షణ్ముఖుడు?



షణ్ముఖ పురాణంలోని కీలకఘట్టం ఆధారంగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఓ పౌరాణిక స్క్రిప్ట్‌ని సిద్ధం చేసుకున్నారు. పానిండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందించాలనేది ఆయన ఉద్దేశ్యం. ఆ కథను ముందు అల్లు అర్జున్‌కి వినిపించారు. ఆ తర్వాత కొన్ని నాటకీయ పరిణామాల మధ్య ఈ స్క్రిప్ట్ ఎన్టీఆర్ దగ్గరకొచ్చింది. మళ్లీ ఇది బన్నీ దగ్గరకెళ్లిందంటూ వార్తలొచ్చాయి. అయితే.. తాజాగా సమాచారం ప్రకారం ఈ సినిమాకు ఎన్టీఆరే కథానాయకుడని తెలుస్తున్నది. ఈ భారీ పానిండియా పౌరాణిక చిత్రాన్ని నిర్మాత సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తారు. ఈ విషయాన్ని మీడియా సాక్షిగా గతంలోనే చెప్పారాయన. ఇందులో కుమారస్వామిగా తారక్ కనిపిస్తాడని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. ఇటీవలే నిర్మాత సూర్యదేవర నాగవంశీ 'షణ్ముఖుడు' అనే టైటిల్‌ని రిజిస్టర్ చేయించారు. ఇది తారక్ సినిమా కోసమే అని ఫిల్మ్ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. తారక్ పుట్టిన రోజైన మే 20న ఈ సినిమాకు సంబంధించిన తొలి అప్‌డేట్‌ని మేకర్స్ విడుదల చేయనున్నట్టు సమాచారం.

పాటల సందడిలో లెనిన్



అక్కినేని అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో బలమైన సామాజికాంశాలను చర్చిస్తూ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. మురళీకృష్ణ అబ్బూరు దర్శకుడు. జూన్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో గురువారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుడుతూ 'ఎట్టా ఎట్టా..' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటను భాస్కరభట్ల రచించారు. సింగర్ శ్రీకృష్ణతో కలిసి తమన్ ఈ గీతాన్ని ఆలపించారు. మాస్ మెలోడీగా సాగిన ఈ పాటలో నాయకానాయికలు అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, దర్శకత్వం: మురళీ కిశోర్ అబ్బూరు.

11 ఏండ్ల తర్వాత..



అగ్ర కథానాయిక త్రిష సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పడం చాలా అరుదు. తన మాతృభాష తమిళంలో సైతం ఓ ఐదు చిత్రాలకు మాత్రమే సొంతంగా డబ్బింగ్ చెప్పింది. ఇక తెలుగులో ఈ భామ పూర్తిగా డబ్బింగ్ ఆర్టిస్టులపైనే ఆధారపడుతుంది. తాజా సమాచారం ప్రకారం దాదాపు 11 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత త్రిష తమిళంలో సొంత గొంతును వినిపించబోతున్నది. సూర్య 'కరుప్పు' సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె తన పాత్రకు స్వయంగా డబ్బింగ్ చెప్పుకోబోతున్నదట. పాత్రలో సహజత్వం కనిపించాలంటే ఓన్ డబ్బింగ్ అవసరమని దర్శకుడు ఆర్‌జే బాలాజీ సూచన మేరకు త్రిష ఈ నిర్ణయం తీసుకుందని తెలిసింది. త్రిష వాయిస్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని, ఇకపై కూడా ఈ సొగసరి డబ్బింగ్ విషయంలో సొంత గొంతు వినిపించేందుకు సిద్ధంగా ఉందని తమిళ ఫిల్మ్‌నగర్ టాక్. 'కరుప్పు' చిత్రం మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

పసిడి వన్నె పూలతీగలా..



వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'రావు బహదూర్'. వెంకటేశ్ మహా దర్శకుడు. చింతా గోపాలకృష్ణరెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మాతలు. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ సినిమాలోని తొలి పాటను విడుదల చేశారు. 'పసిడివన్నె పూలతీగలా.. అల్లుకుంది నన్నిలా.. తరానికే తరుణీమణీ.. తరించెనే నయనాలనీ..' అంటూ సాగే ఈ పాటను రెహ్మాన్ రాయగా, స్మరణ్ సాయి స్వరపరిచారు. విజయ్ యేసుదాస్ ఆలపించారు. కథానాయిక అందాన్ని వర్ణిస్తూ మెలోడీ ప్రధానంగా ఈ పాట సాగింది. దర్శకుడు వెంకటేశ్ మహా మాట్లాడుతూ 'నిర్మాతల సహకారం వల్లే ఈ సినిమాను సులభంగా పూర్తి చేయగలిగాను. నటీనటులంతా అద్భుతంగా నటించారు. ఈ సినిమాకు పనిచేసిన టెక్నికల్ టీమ్‌కి పేరుపేరున ధన్యవాదాలు. 'కేరాఫ్ కంచర్లపాలెం' సినిమాకు మించిన అనుభూతిని మీకివ్వాలని ఈ సినిమా తీశాను' అన్నారు. నిర్మాతలు ఇంత ఆనందంగా ఉన్నారంటే, దర్శకుడు మహా ఎంత అద్భుతంగా సినిమా తీశాడో అర్థం చేసుకోవచ్చని, బాహుబలి, అవతార్ సినిమాల స్థాయిలో మమ్మల్ని అలరించే సినిమా 'రావు బహదూర్' అని హీరో సత్యదేవ్ నమ్మకంగా చెప్పారు.

'పోచమ్మ' తల్లి దయతో..




అంబటి అర్జున్, రమేశ్ ఇందిర, ప్రియ శతమర్షన్, స్నేహల్ కామత్, శృతి నాయుడు, శ్రీపూజారెడ్డి కీలక పాత్రధారులుగా తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'పోచమ్మ'. రమేశ్ ఇందిర దర్శకత్వంలో శ్రుతినాయుడు నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 17(నేడు) నుంచి తెలుగు, తమిళ భాషల్లో ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సిరీస్ ప్రీమియర్ నిర్వహించి, తదనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ప్రధాన పాత్రలు పోషించిన నటుడు అంబటి అర్జున్, నటి స్నేహాల్ కామత్, నటి శ్రీపూజ ఈ సిరీస్‌లో భాగం అయినందుకు ఆనందం వెలిబుచ్చారు. పోచమ్మతల్లి దయవల్లే ఈ సిరీస్ ఇంత బాగా వచ్చిందని, కథే ఈ సిరీస్‌కి ప్రధాన బలమని, అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా ఈ సిరీస్ ఉంటుందని ఆహా ఓటీటీ కంటెంట్ హెడ్ కవిత అన్నారు.

కులం గురించి చర్చించాం!



వరుణ్‌సందేశ్, గగన్, సత్యం రాజేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్యాస్ట్'. ఏకే జంపన్న దర్శకుడు. కశికా కపూర్, దివి కథానాయికలు. గురువారం గ్లింప్స్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'మనం చేసే పనిని బట్టి కులాన్ని నిర్ణయించే రోజుల్లో అంతా బాగుండేది. కానీ మనిషి పుట్టుకను బట్టి కులాన్ని నిర్ణయించడం మొదలైనప్పటి నుంచి పరిస్థితులు మారాయి. కులం మనుషుల మధ్య అడ్డుగోడగా మారింది. కులం నిత్యజీవితంలో ఎలాంటి ప్రభావం చూపిస్తుందనే అంశాన్ని ఈ సినిమాలో చర్చించాం' అన్నారు. సెన్సిటివ్ పాయింట్‌తో ఈ సినిమా తీశారని వరుణ్‌సందేశ్ తెలిపారు. ఇప్పటికే 90శాతం చిత్రీకరణ పూర్తయిందని నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వర రావు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

సందీప్ కిషన్ 'పవర్‌పేట'



సందీప్ కిషన్ కథానాయకుడిగా రచయిత కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందనున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పవర్ పేట'. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. పోస్టర్‌ని గమనిస్తే.. వ్యూహం, శక్తి, త్యాగాన్ని సూచించేలా రక్తంతో తడిసిన చెస్ బోర్డ్ కనిపిస్తున్నది. విరిగిపోయిన, కూలిపోయిన చెస్ పీసులు ఏదో కథ చెబుతున్న అనుభూతిని కలిగిస్తున్నాయి. ఈ గందరగోళం మధ్య నలిగిపోయిన ఓ గులాబీ పువ్వు రక్తంతో ముద్రింపబడి కనిపిస్తున్నది. ప్రేమ, గౌరవం, రాజకీయాల మేళవింపుగా సాగే భావోద్వేగపూరిత కథాంశమిదని మేకర్స్ చెబుతున్నారు. సందీప్‌కిషన్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మదీ, సంగీతం: మణిశర్మ, నిర్మాణం: 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్.

ప్రతాప్ మీతో మాట్లాడిస్తాడు



తిరువీర్ హీరోగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పాపం ప్రతాప్'. ఎస్‌పీ దుర్గ నరేష్ దర్శకుడు. రాకేశ్‌రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి నిర్మాతలు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నుంచి ఈ నెల 17న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. తిరువీర్ మాట్లాడుతూ 'కుటుంబసమేతంగా కలిసి చూసే మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ ఇది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో నుంచి తీసుకుని రాసిన కథ ఇదని, ఈ సినిమా మీతో మాట్లాడటమేకాక, మీరు మాట్లాడేలా చేస్తుందని దర్శకుడు ఎస్‌పీ దుర్గనరేశ్ చెప్పారు. ఇంకా ఈటీవీ విన్ ప్రతినిధి సాయికృష్ణ, మైత్రీ శశిధర్‌రెడ్డి కూడా మాట్లాడారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆ ఫీట్ సాధిస్తే పోర్షె కారు

లలిత్‌మోదీ ఆఫర్ కొట్టేసిన యువీ



ముంబై: సరిగ్గా 19 ఏండ్ల క్రితం భారత క్రికెట్ దిగ్గజం యువరాజ్‌సింగ్ బంపర్ ఆఫర్ కొట్టేశాడు. 2007 టీ20 ప్రపంచ కప్ సందర్భంగా లలిత్ మోదీ..టీమ్ఇండియా క్రికెటర్లకు అదిరిపోయే ఆఫర్ ప్రకటించాడు. మెగాటోర్నీలో ఎవరైనా ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లు లేదా ఆరు వికెట్లు తీస్తే వారికి ఖరీదైన పోర్షె కారు బహుమతి ఇస్తానని మాటిచ్చాడు. మోదీ ఆఫర్‌ను మనసులో పెట్టుకున్న యువీ..ఇంగ్లండ్‌తో పోరులో స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో వరుసగా ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లు కొట్టి కొత్త చరిత్ర లిఖించాడు. బ్రాడ్‌ను ఉతికి ఆరేస్తూ యువీ ఆరు బంతులను సిక్స్‌లుగా మలిచాడు. మ్యాచ్ అయిపోగానే మోదీని కలిసిన యువీ ఏమైంది తన కారు అంటూ ప్రశ్నించాడట. ఈ విషయాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మోదీ పంచుకున్నాడు. 'టీ20 ప్రపంచ కప్ సందర్భంగా ఒక రోజు టీమ్ఇండియా డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్లినప్పుడు వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఆఫర్ ఇచ్చాను. ఎవరైతే ఆరు సిక్స్‌లు లేదా ఆరు వికెట్లు తీస్తే పోర్షె కారు బహుమతి ఇస్తానన్నాను. ఇంగ్లండ్‌పై ఆ ఫీట్ సాధించిన యువీకి పోర్షె బదులుగా బీఎండబ్ల్యూ కారు గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పట్లో పోర్షె కారు భారత్‌కు దిగుమతి కావాలంటే చాలా రోజులు పట్టేది. అన్ని రోజులు ఆగలేను బీఎండబ్ల్యూ అయినా ఓకే అంటూ యువీ చెప్పడంతో ఇచ్చిన మాట ప్రకారం కారు కొనిచ్చాను. అందుకు ప్రతిగా ఆరు సిక్స్‌లు కొట్టిన బ్యాటు యువీ దగ్గర నుంచి తీసుకున్నాను. ఇప్పుడు అది 50 పోర్షె కార్లతో సమానం' అంటూ మోదీ వివరించాడు.

ఆందోళనకరంగానే కాంబ్లీ ఆరోగ్యం

- సచిన్ సాయం



ముంబై: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తున్నది. గత ఆరునెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అతడు ఇటీవల మళ్లీ దవాఖానాలో చేరాడు. కాంబ్లీకి జ్ఞాపకశక్తి క్రమంగా క్షీణిస్తున్నదని, ఇదే పరిస్థితి కొనసాగితే అతడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశమూ లేకపోలేదని వైద్యులు తెలిపినట్టు అతడి ప్రాణ స్నేహితుడు మార్కస్ కౌటో చెప్పాడు. కాంబ్లీకి ఆర్థికంగా సాయం అందించేందుకు గాను తాను క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూప్‌లో దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ సైతం చేరాడని, మాస్టర్ బ్లాస్టర్ అతడిని ఆర్థికంగా ఆదుకుంటున్నాడని కౌటో తెలిపాడు. కాంబ్లీకి గతంలో కూడా సచిన్ పలుమార్లు ఆర్థిక సాయం అందించాడు.

ముంబై క్రికెటర్లకు కాంట్రాక్టులు

- ఎంసీఏ కీలక నిర్ణయం

ముంబై: దేశానికి ఎందరో దిగ్గజ క్రికెటర్లను అందించిన ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవాళీలో తమ జట్టుకు ఆడే క్రికెటర్లకు బీసీసీఐ మాదిరిగా సెంట్రల్ కాంట్రాక్టులను అందించేందుకు సిద్ధమైంది. ఆటగాళ్ల ప్రదర్శన, ఫిట్‌నెస్, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకోనున్న ఎంసీఏ.. వారిని మూడు గ్రేడ్‌లుగా విభజించి వార్షిక కాంట్రాక్టులను అందించనుంది. గ్రేడ్-ఏలో ఉన్నవారికి ఏడాదికి రూ. 12 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు, గ్రేడ్-బీ క్రికెటర్లకు రూ. 8 లక్షల నుంచి రూ. 12 లక్షలు, గ్రేడ్-సీ ఆటగాళ్లకు రూ. 8 లక్షలు అందజేయనున్నది. 2026-27 దేశవాళీ సీజన్ నుంచి దీనిని అమలుచేయనున్నారు. అయితే పురుషుల జట్టుతో పాటు మహిళా జట్టుకూ దీనిని వర్తింపజేస్తారా? లేదా? అన్నది మాత్రం తెలియాల్సి ఉంది. కాగా దేశవాళీల్లో క్రికెటర్లకు కాంట్రాక్టులను అందించనున్న తొలి స్టేట్ అసోసియేషన్‌గా ఎంసీఏ నిలువనుంది.

కింగ్స్ అజేయంగానే..


ప్రభ్‌సిమ్రన్ (80*)

- పంజాబ్‌కు నాలుగో విజయం
- ముంబైకి తప్పని ఓటమి
- క్వింటన్ డికాక్ శతకం వృథా
- రాణించిన ప్రభ్‌సిమ్రన్, శ్రేయాస్

ముంబై: ఐపీఎల్-19లో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగించింది. బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తోడు టాపార్డర్ బ్యాటర్ల బాదుడుతో ఆ జట్టు ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసి సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదుచేసింది. వాంఖడే వేదికగా జరిగిన పోరులో పంజాబ్.. ముంబైని 7 వికెట్ల తేడాతో ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 80 నాటౌట్, 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (35 బంతుల్లో 66, 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఛేదనను ఆ జట్టు 16.3 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ముంబైకి డికాక్ (60 బంతుల్లో 112 నాటౌట్, 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఈ సీజన్‌లో తన ఆగమనాన్ని సెంచరీతో ఘనంగా చాటడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 రన్స్ చేసింది. నమన్ ధీర్ (31 బంతుల్లో 50, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) డికాక్‌కు అండగా నిలిచి అర్ధ శతకంతో రాణించాడు.

ప్రభ్‌సిమ్రన్, సర్పంచ్ సాబ్ జోరు

4, 4, 6, 4.. ఛేదనలో చాహర్ వేసిన తొలి ఓవర్లోనే పంజాబ్ ఓపెనర్ల జోరు అది. ఆదిలోనే రెండు కీలక వికెట్లను కోల్పోయినా ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్, 'సర్పంచ్ సాబ్' శ్రేయాస్ దూకుడుతో కింగ్స్ మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షంగా మార్చేసింది. రెండు బౌండరీలు, ఓ సిక్స్‌తో జోరు చూపించిన ప్రియాన్ష్ (15)తో పాటు కనోలి (17)ను గజన్‌ఫర్ ఔట్ చేసినా అది పంజాబ్ ఛేదనపై ప్రభావం చూపలేకపోయింది. ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్, ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చాహర్, హార్దిక్, శార్దూల్.. అందరూ అతడి బాదుడుకు బాధితులే. హార్దిక్ పదో ఓవర్లో రెండు బౌండరీలతో కింగ్స్ స్కోరుబోర్డు వంద పరుగులు దాటింది. ఆ తర్వాత శార్దూల్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో అతడి హాఫ్ సెంచరీ పూర్తయింది. అదే ఓవర్లో సిక్స్‌తో జోరందుకున్న శ్రేయాస్.. ఈ సీజన్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేక చతికిలపడుతున్న బుమ్రా బౌలింగ్‌లో డీప్‌మిడ్ వికెట్ మీదుగా చూడచక్కని సిక్స్ కొట్టాడు. అతడే వేసిన 15వ ఓవర్లో రెండు ఫోర్లతో అయ్యర్ కూడా సీజన్‌లో వరుసగా మూడో అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. శార్దూల్ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన శ్రేయాస్, మూడో బంతికి నిష్క్రమించడంతో 66 బంతుల్లోనే 139 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికే విజయం ఖాయమవగా.. స్టొయినిస్ (10*), ప్రభ్‌సిమ్రన్ మిగతా పని పూర్తిచేశారు.

నిలబెట్టిన డికాక్, నమన్

అర్ష్‌దీప్ విసిరిన రెండో ఓవర్లో ఇచ్చిన డబుల్ షాకులతో 12/2గా నిలిచిన ముంబైని ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన డికాక్, మిడిలార్డర్‌లో నమన్ ఆదుకున్నారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 68 బంతుల్లోనే శతాధిక (122) భాగస్వామ్యం నెలకొల్పి ఆతిథ్య జట్టుకు పోరాడగలిగే స్కోరునందించారు. రికెల్టన్ వికెట్‌తో ఐపీఎల్ కెరీర్‌లో వందో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్న అర్ష్‌దీప్ రెండో బంతికి సూర్యను డకౌట్ చేశాడు. ఈ దశలో డికాక్, ధీర్ పంజాబ్ బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగి బౌండరీలు, సిక్స్‌లతో రెచ్చిపోయారు. డికాక్‌కు పూర్తి సహకారం అందించిన నమన్.. శశాంక్ ఓవర్లో లాంగాన్ మీదుగా సింగిల్ తీసి హాఫ్ సెంచరీ సాధించినా అదే ఓవర్లో లాంగాఫ్ వద్ద బార్ట్‌లెట్‌కు చిక్కడంతో మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. శశాంక్ ఓవర్లో రెండు సిక్స్‌లతో 90లలోకి వచ్చిన డికాక్.. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో బౌండరీతో ఈ లీగ్‌లో మూడో సెంచరీని నమోదుచేశాడు.


డికాక్ (112*)

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లకు 195/6 (డికాక్ 112*, నమన్ 50, అర్ష్‌దీప్ 3/22, శశాంక్ 1/19); పంజాబ్: 16.3 ఓవర్లకు 198/3 (ప్రభ్‌సిమ్రన్ 80*, శ్రేయాస్ 66, గజన్‌ఫర్ 2/31)

అయ్యర్ సూపర్..



శ్రేయాస్ అయ్యర్ సూపర్ ఫీల్డింగ్‌తో అదరగొట్టాడు. యాన్సెన్ 18వ ఓవర్లో హార్దిక్ కొట్టిన షాట్‌ను బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న అయ్యర్ అమాంతం గాల్లోకి ఎగిరి బంతిని ఒడుపుగా పట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా బ్యాలెన్స్ కోల్పోతున్న సమయంలో అంతే సమయస్ఫూర్తితో బంతిని మైదానంలోకి విసరడంతో అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న బార్ట్‌లెట్ క్యాచ్‌ను పూర్తి చేశాడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఐపీఎల్-2026

జట్లు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
పంజాబ్	5	4	0	1	9	1.067
బెంగళూరు	5	4	1	0	8	1.503
రాజస్థాన్	5	4	1	0	8	0.889
హైదరాబాద్	5	2	3	0	4	0.576
ఢిల్లీ	4	2	2	0	4	0.322
గుజరాత్	4	2	2	0	4	-0.029
లక్నో	5	2	3	0	4	-0.804
చెన్నై	5	2	3	0	4	-0.846
ముంబై	5	1	4	0	2	-1.076
కోల్‌కతా	5	0	4	1	1	-1.383

నోట్: ఆ:ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, పా: పాయింట్లు, ర.రే: రన్‌రేట్, ఫ.తే:ఫలితం తేలనివి



తలా ఆగయా..

చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ గురువారం హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. తలా రాక కోసం అభిమానులు భారీ సంఖ్యలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు.ఈనెల 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ధోనీ బరిలోకి దిగేది ఆసక్తికరంగా మారింది.




సీఎస్‌కేకు ఎదురుదెబ్బ

- గాయంతో టోర్నీ మొత్తానికి ఖలీల్ అహ్మద్ దూరం

చెన్నై: ఐపీఎల్-19వ సీజన్‌లో వరుసగా రెండు విజయాలు సాధించిన జోష్‌లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే)ను గాయాలు వేధిస్తున్నాయి. గాయాలకారణంగా ఇప్పటికే ధోనీ, బ్రెవిస్ మ్యాచ్‌లకు దూరమవగా తాజాగా ఆ జట్టు ప్రధాన పేసర్ ఖలీల్ అహ్మద్ సేవలనూ కోల్పోయింది. తొడ కండరాల గాయం కారణంగా టోర్నీ మొత్తానికి ఖలీల్ దూరమైనట్టు ఆ ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది.

కమిన్స్ సిద్ధం

రాజస్థాన్‌తో మ్యాచ్‌కు ఆడే అవకాశం




ఢిల్లీ: సన్‌రైజర్స్ అభిమానులకు శుభవార్త! వెన్నునొప్పికి శస్త్రచికిత్స, అనంతర పరిణామాలతో గత జులై నుంచి ఆటకు దూరమైన ఆస్ట్రేలియా సారథి పాట్ కమిన్స్ ఐపీఎల్‌లోకి పునరాగమనం చేయనున్నాడు. ఈనెల 25న అతడు.. జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని సమాచారం. 2026 సీజన్ ఆరంభం నుంచి జట్టుతోనే ఉన్న అతడు.. వైద్య పరీక్షల నిమిత్తం ఇటీవలే స్వదేశానికి వెళ్లిన విషయం తెలిసిందే. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించిన కమిన్స్ మ్యాచ్‌లు ఆడేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఇదిలాఉండగా పైన్ కాలి మడమ గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగినట్టు ఒక ప్రకటనలో తెలిపింది.

రూబెల్ వీడ్కోలు



ఢాకా: బంగ్లాదేశ్ సీనియర్ పేసర్ రూబెల్ హొస్సేన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2009లోకి బంగ్లా తరఫున తొలి మ్యాచ్ ఆడిన ఈ పేసర్.. తన కెరీర్‌లో 159 మ్యాచ్‌లు ఆడి మూడు ఫార్మాట్లలోనూ తన దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 27 టెస్టుల్లో 36 వికెట్లు తీసిన అతడు.. 104 వన్డేల్లో 129, 28 టీ20ల్లో 28 వికెట్లను పడగొట్టాడు.

టైటిల్ చేరువలో శుభాంకర్!



హైదరాబాద్, ఆట ప్రతినిధి: బౌల్డర్‌హిల్స్ క్లాసిక్ గోల్ఫ్ టోర్నీలో భారత స్టార్ గోల్ఫర్ శుభాంకర్‌శర్మ టైటిల్ దిశగా దూసుకెళుతున్నాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగుతున్న శుభాంకర్ ప్రస్తుతం 20 అండర్ 196 స్కోరుతో ఏడు షాట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో హనీ బైసోయా(66-66-44) రికార్డును 29 ఏండ్ల శుభాంకర్ సమం చేశాడు. రెండు సార్లు డీపీ వరల్డ్ విజేత అయిన శుభాంకర్ మూడో రోజు ఆటలో ఏకంగా తొమ్మిది బర్డీలు సాధించగా, కేవలం ఒక్క బోగీకే పరిమితమయ్యాడు. మరోవైపు రషీద్‌ఖాన్(67-70-66). అంగద్ చీమా(68-69-66), హైదరాబాదీ విశేష్‌శర్మ(65-70-68) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.


గదులకు తాళం వేయడంతో వరండాలో కూర్చున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిల్లు రాలేదని పాఠశాలకు తాళం

- రూ.22 లక్షల బిల్లుల పెండింగ్‌పై మాజీ సర్పంచ్ భర్త ఆవేదన
- కరీంనగర్ జిల్లా వల్లంపట్లలో ఘటన

ఇల్లంతకుంట రూరల్, ఏప్రిల్ 16 : చేసిన పనులకు సంబంధించి బిల్లు రాకపోవడంతో ఓ మాజీ సర్పంచ్ భర్త పాఠశాలకు తాళంవేసి నిరసన తెలిపాడు. మూడేండ్ల క్రితం మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ భర్త వెంకటనర్సింహారెడ్డి రూ.44 లక్షలతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో రెండు పాఠశాల భవనాలతోపాటు డైనింగ్ హాల్ నిర్మించాడు. దీనికి సంబంధించి రూ. 22 లక్షల బిల్లులు రాగా, మరో రూ. 22 లక్షల బిల్లుల కోసం డీపీవో, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా రాకపోవడంతో విసిగిపోయాడు. ఈ క్రమంలో గురువారం పాఠశాల నూతనగదులతోపాటు డైనింగ్‌హాల్‌కు తాళం వేశాడు. ఎస్ఎంసీ తీర్మానం మేరకు నిర్మాణాలు చేశామని, ఇప్పుడు బిల్లుల కోసం ఇబ్బందులు పెడుతున్నారని, బిల్లు వచ్చేవరకు పాఠశాల తాళం తీసేదిలేదని వెంకటనర్సింహారెడ్డి స్పష్టంచేశాడు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వరండాలోనే కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పాఠశాలను సందర్శించి గదులను పరిశీలించారు.

కేటీపీపీలో భారీ అగ్నిప్రమాదం

- వంద ఎకరాల్లో ఎగిసిపడిన మంటలు

గణపురం, ఏప్రిల్ 16 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(కేటీపీపీ)లో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ప్లాంట్ ఆవరణలోని సోలార్ ప్రాజెక్టు కోసం కేటాయించిన స్థలంలో నిల్వ ఉంచిన రిజెక్ట్ బొగ్గు కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎండల తీవ్రత దృష్ట్యా బొగ్గులో సెల్ఫ్ ఇగ్నిషన్ జరుగడంతో మంటలు చెలరేగి 100 ఎకరాల మేర విస్తరించాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు, ప్లాంట్ కార్మికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది తొలుత మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. జిల్లా కేంద్రం నుంచి ఐదు ఫైర్ ఇంజిన్లను తెప్పించి మంటలను అదుపు చేశారు. ప్లాంట్‌కు నష్టం జరుగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వాణిజ్య



కష్టాల్లో దేశ ఎకానమీ

గత ఏడాది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఆరో స్థానానికి పతనం • 2024తో పోల్చితే జీడీపీ ర్యాంక్ డౌన్

ఐఎంఎఫ్ తాజా గణాంకాల్లో వెల్లడి • రూపాయి మారకం విలువ నష్టాలతో దెబ్బ

దేశ ఆర్థిక వ్యవస్థను మందగమనం ఆవహించిందా? 2028కల్లా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న భారత్ కలలు కల్లలేనా? అంతర్జాతీయ ద్రవ్య నిధి తాజా గణాంకాలు.. ఇవే ప్రశ్నల్ని లేవనెత్తుతున్నాయి. 2025లో దేశ జీడీపీ ర్యాంక్ 6వ స్థానానికి దిగజారిందీ మరి.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశ ఆర్థిక వ్యవస్థ కష్టాల్లో పడింది. గత ఏడాదికిగాను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తాజాగా విడుదల చేసిన జీడీపీ ర్యాంకుల్లో భారత్ టాప్-5 నుంచి దిగజారింది. ప్రపంచంలోని అతిపెద్ద ఎకానమీల్లో 6వ స్థానానికి పడిపోయింది. దీంతో 2028కల్లా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగాలన్న భారత్ కలలు కల్లలేననిపిస్తున్నది. ఆ లక్ష్యం నెరవేరాలంటే 2031దాకా ఆగాల్సిందేనని ఇప్పుడు ఐఎంఎఫ్ గణాంకాలు చెప్పకనే చెప్తున్నాయి మరి.

ఇదీ సంగతి..

2024తో పోల్చితే 2025లో దేశ జీడీపీ ర్యాంక్ ప్రపంచ స్థాయిలో 5 నుంచి 6కు క్షీణించింది. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం.. నిరుడు దేశ ఆర్థిక వ్యవస్థ విలువ 3.92 ట్రిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇదే సమయంలో బ్రిటన్ ఎకానమీ వాల్యూ 4 ట్రిలియన్ డాలర్లని తేలింది. దీంతో గత ఏడాదికిగాను వరల్డ్ జీడీపీ ర్యాంకింగ్స్‌లో భారత్‌ను బ్రిటన్ వెనుకకు నెట్టి 5వ స్థానంలో నిలిచింది. 2024లో భారత్ జీడీపీ విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. బ్రిటన్‌ది 3.4 ట్రిలియన్ డాలర్లే. అందుకే ఆ ఏడాది ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉన్నది. 6వ స్థానానికి బ్రిటన్ పరిమితమైంది.

రూపాయి దెబ్బ

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఏ స్థాయిలో పతనమవుతున్నదో చూస్తూనే ఉన్నాం. నానాటికీ పడిపోతున్న రూపీ వాల్యూ.. ఇటీవలికాలంలో ఆల్‌టైమ్ కనిష్ఠాన్నీ నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే కరెన్సీ నష్టాలు.. దేశీయ దిగుమతుల్ని భారం చేయడం మాత్రమేగాక, దేశ ఆర్థిక వ్యవస్థనూ కుప్పకూల్చగలదు. ఐఎంఎఫ్ తాజా జీడీపీ ర్యాంకింగ్స్‌లోనూ భారత్‌కు ముప్పు తెచ్చింది ఈ రూపాయే. 2025లో రూపీ ఎక్స్చేంజ్ వాల్యూ రూ.4.24 తగ్గింది. 2024 ఆఖర్లో డాలర్‌తో చూస్తే రూపాయి మారకం విలువ రూ.85.64గా ఉన్నది. 2025 చివర్లో ఇది రూ.89.88కి క్షీణించింది. ఈ క్రమంలో డాలర్లలోనే ఆయా దేశాల జీడీపీ విలువను కొలుస్తారు కాబట్టి.. రూపీ నష్టాలు ఆ మేరకు ప్రభావం చూపాయని ఐఎంఎఫ్ అంటున్నది. దీన్నిబట్టి ఈ ఏడాది దేశ జీడీపీ ర్యాంక్ ఇంకా తగ్గిపోతుందేమోనన్న భయాలు కనిపిస్తున్నాయి. ఈ మార్చి 27న రూపాయి మారకం విలువ తొలిసారి 94.85 వద్దకు దిగజారింది. ఒకానొక దశలోనైతే ఏకంగా 95 మార్కుకు ఎగువన 95.22 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకుతోడు దాదాపు 50 రోజులుగా జరుగుతున్న అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం.. కరెన్సీ మార్కెట్‌లో రూపాయిపై అమ్మకాల ఒత్తిడిని పెంచుతున్నది. దేశీయ దిగుమతిదారులు డాలర్ల కోసం ఎగబడుతున్నారు మరి. ఈ నేపథ్యంలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే భారత ఆర్థిక వ్యవస్థ.. సంక్షోభంలోకి జారుకోవడం ఖాయమన్న అభిప్రాయాలు వినిపిస్తుండటం గమనార్హం.

ఈ ఏడాదీ ఇంతేనా..!

ఈ ఏడాదిలోనూ ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ 6వ స్థానానికే పరిమితం కావచ్చని ఐఎంఎఫ్ అంచనా వేస్తున్నది. పశ్చిమాసియా సంక్షోభం, డాలర్ల డిమాండ్, రూపాయి నష్టాలు ఇతరత్రా కారణాల దృష్ట్యా.. 2026లోనూ దేశ ఎకానమీ వరల్డ్ టాప్-5 జీడీపీల్లో చోటుచేసుకోకపోవచ్చని అభిప్రాయపడుతున్నది. అయితే 2027లో బ్రిటన్‌ను అధిగమించి మళ్లీ భారత జీడీపీ ర్యాంకింగ్ మెరుగు పడవచ్చని చెప్తున్నది. అప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ విలువ 4.58 ట్రిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నది. బ్రిటన్ 4.47 ట్రిలియన్ డాలర్ల వద్దే ఆగిపోవచ్చని విశ్లేషిస్తున్నది. ఈ క్రమంలోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అమెరికా, చైనా తర్వాత మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశాలుండేది 2031లోనే అన్న అభిప్రాయాన్ని ఐఎంఎఫ్ వెలిబుచ్చింది. దేశ జీడీపీ 6.79 ట్రిలియన్ డాలర్లుగా, ఇదే సమయంలో జపాన్ జీడీపీ వాల్యూ 5.13 ట్రిలియన్ డాలర్లేనన్నది.

ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం

2025లో ప్రపంచంలోనే అతిపెద్ద ఎకానమీలివే..

ర్యాంక్	దేశం	జీడీపీ (డాలర్లలో)
1.	అమెరికా	30.8 ట్రిలియన్లు
2.	చైనా	19.6 ట్రిలియన్లు
3.	జర్మనీ	4.7 ట్రిలియన్లు
4.	జపాన్	4.44 ట్రిలియన్లు
5.	బ్రిటన్	4 ట్రిలియన్లు
6.	భారత్	3.92 ట్రిలియను

మహాధర్నాకు సీపీఎం మద్దతు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని నిరసిస్తూ ఆలిండియా నేషనల్ రక్షాసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించే మహాధర్నాకు సీపీఎం మద్దతు ప్రకటిస్తున్నదని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదల చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరానికి ముందే అడ్మిషన్లు, డొనేషన్ల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యా హక్కుచట్టం అమలులో ఉన్నా నిరుపయోగంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో విజిలెన్స్ తనిఖీలు

కరీమాబాద్/కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 16 : రాష్ట్రవ్యాప్తంగా గురువారం పలు జిల్లా కేంద్రాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కరీంనగర్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. ప్రైవేట్ వ్యక్తులు కార్యాలయంలో ఇష్టారాజ్యంగా తిరుగుతుండటాన్ని ప్రశ్నించారు. దీనిపై నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌లాల్‌ను విచారించి, పలు దస్తావేజులను తీసుకెళ్లినట్టు సమాచారం.



కరీంనగర్ సబ్ రిజిస్ట్రార్ చాంబర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ తెలంగాణ రాష్ట్ర యూనియన్

కవాడిగూడ, ఏప్రిల్ 16: డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలివ్వాలని డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ తెలంగాణ రాష్ట్ర యూనియన్ డిమాండ్ చేసింది. డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎండీ ఖాసీం, పుట్టోజు నారాయణాచారి, చెన్న రఘు, శ్రీనివాసులు, రాములు, విజయభాస్కర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ 1998లో ఉపాధ్యాయ నియామకాల్లో అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. నాడు జరిగిన నియామకాల్లో స్థానికులను కాదని, నాన్‌లోకల్ అభ్యర్థులను ఉపాధ్యాయులుగా నియమించారని తెలిపారు. తెలంగాణలో అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ క్యారీ ఫార్వర్డ్ చేశారని, ఇది నోటిఫికేషన్‌కు విరుద్ధమని అన్నారు. నాటి నుంచి నేటి వరకు డీఎస్సీ 1998 అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ.. చాలామంది ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, సత్యనారాయణరెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.


ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఇందిరాపార్కు వద్ద నిరసన వ్యక్తం చేసిన డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు



హైదరాబాద్‌లో కాండ్‌సెంట్ మరో టెక్నాలజీ సెంటర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: అమెరికాకు చెందిన డిజిటల్ బ్యాంకింగ్ సేవల సంస్థ కాండ్‌సెంట్.. హైదరాబాద్‌లో మరో టెక్నాలజీ సెంటర్‌ను గురువారం ప్రారంభించింది. 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ సెంటర్‌ను రహేజా మైండ్‌స్పేస్ ఐటీ పార్క్‌లో నెలకొల్పింది. 300 మంది కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ సెంటర్ సంస్థకు ఇది రెండోదని కంపెనీ సీవోవో జాన్ గార్వీ తెలిపారు. ఈ రెండు సెంటర్లలో మొత్తంగా 530 మంది సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం సంస్థకు ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌లో సెంటర్లు ఉండగా, వీటిలో 2 వేల వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు.

పెట్టుబడులను పెట్టేలా ప్రోత్సహించాలి

'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధులతో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామిక వేత్తల్ని ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. గురువారం సచివాలయంలో 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' బృందం సభ్యులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలను మంత్రి ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్నదన్నారు. ఈ రంగంలో రాష్ట్రం ఏటా 30 శాతానికి పైగా వృద్ధి రేటు నమోదు చేస్తున్నట్టు వివరించారు. మరోవైపు, పెట్టుబడులను ఆకట్టుకోవడానికి కేవలం 30 రోజుల్లోగా అనుమతులు మంజూరు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

విప్రో 15 వేల కోట్ల బైబ్యాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: విప్రో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,501.8 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం ఎగబాకి రూ.24,236.3 కోట్లకు చేరుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.92,624 కోట్ల ఆదాయంపై రూ.13,197.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా గురువారం కంపెనీ బోర్డు సమావేశమై రూ.15 వేల కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు ప్రక్రియకు ఆమోదం తెలిపింది. కంపెనీ చరిత్రలో ఇంతటి స్థాయిలో షేర్లను బైబ్యాక్ చేయడం ఇదే తొలిసారి.

లోక్‌సభ సీట్లు 816



III పేజీ తరువాయి...

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగబోతున్నదని ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ ప్రారంభంలోనే నిరసనలకు దిగారు. మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టే కంటే ముందు డివిజన్ ఆఫ్ ఓటును నిర్వహించాలని స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేశారు. విపక్షాల కోరిక మేరకు ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుల ప్రవేశానికి అనుకూలంగా 251 మంది ఓటేయగా, వ్యతిరేకిస్తూ.. 185 మంది సభ్యులు ఓటేశారు. దీంతో 131 రాజ్యాంగ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, యూటీ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లులపై వాడీవేడి చర్చ సాగింది.

దక్షిణాదికి పెరుగనున్న ప్రాతినిధ్యం: షా

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రతిపక్షాల వాదనలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 50 శాతం ఫార్ములాతో దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాలకు 129 సీట్లు ఉన్నాయన్న షా.. డీలిమిటేషన్ తర్వాత ఈ సంఖ్య 195కు చేరుతుందని తెలిపారు. దీంతోపాటు లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం ఇప్పుడున్న 23.76 శాతం నుంచి 23.89 శాతానికి పెరుగుతుందని పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రస్తుతం తెలంగాణకు 17 స్థానాలు ఉండగా, పెరిగిన తర్వాత సీట్ల సంఖ్య 26కు చేరుతుందన్నారు. అంటే లోక్‌సభలో 3.13 శాతంగా ఉన్న తెలంగాణ ప్రాతినిధ్యం.. డీలిమిటేషన్ తర్వాత 3.18 శాతానికి పెరుగుతుందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం లోక్‌సభ స్థానాలు 25 ఉండగా, డీలిమిటేషన్ తర్వాత 38కు చేరుతాయని తెలిపారు. ఇదేవిధంగా కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కు, కేరళ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయని వివరించారు.

అఖిలేశ్-షా వాగ్వాదం

మహిళా రిజర్వేషన్లతో ముడిపడిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ముస్లిం మహిళలకు రిజర్వేషన్ల విషయంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ముస్లిం మహిళలకు విడిగా రిజర్వేషన్లు దక్కాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. తమ పార్టీ కుల గణనను కోరుకుంటున్నదని ఆయన చెప్పారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ జనగణన ప్రక్రియ ఇదివరకే ప్రారంభమైందని చెప్పారు. ప్రస్తుతం ఇండ్ల గణన జరుగుతున్నదని, జన గణన జరిగినపుడు అందులో కులానికి సంబంధించిన ప్రస్తావన చేర్చుతామని అమిత్ షా చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను ఆయన తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతపరమైన కారణాలతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని అమిత్ షా అన్నారు. సమాజ్‌వాదీ పార్టీపై పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ తన పార్టీ టికెట్లన్నీ అఖిలేశ్ యాదవ్ ముస్లిం మహిళలకే ఇవ్వవచ్చని, అలాంటప్పుడు ఆయన పార్టీకి సమస్య ఎక్కడ ఉందని షా ప్రశ్నించారు.

ఏ వ్యక్తికీ రాష్ట్రానికీ అన్యాయం జరగదు: మేఘ్వాల్ హామీ

మహిళా రిజర్వేషన్ బిల్లు వల్ల ఏ వ్యక్తి గానీ ఏ రాష్ట్రం గానీ ప్రతికూలంగా ప్రభావితం కాబోదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం లోక్‌సభకు తెలియజేశారు. మహిళలకు వారి హక్కులను కల్పించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని మేఘ్వాల్ అన్నారు. మూడింట ఒక వంతు కోటాను ఏకరీతిగా అమలు చేసేందుకు లోక్‌సభను విస్తరించడంపైనే ఈ ప్రణాళిక ఆధారపడి ఉందని మంత్రి అన్నారు. దీనితో సభ బలం 50 శాతం పెరిగి 815 సీట్లకు చేరుతుందని, వాటిలో 272 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయని ఆయన చెప్పారు.

అరగంటకుపైగా వాగ్వాదం

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల మహిళలకు ఉప కోటాలను పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు దీని స్వరూపంలో పొందుపరుస్తాయని ఆయన వివరించారు. విపక్ష సభ్యులు డివిజన్ ఆఫ్ ఓటింగ్ కోసం డిమాండు చేయడంతో 40 నిమిషాల పాటు వాదోపవాదాలతో కూడిన చర్చ అనంతరం లోక్‌సభ గురువారం రాజ్యాంగ(131వ సవరణ) బిల్లు, 2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల(సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026ను చర్చ, ఆమోదం కోసం చేపట్టింది.

ప్రజాస్వామ్యంపై బీజేపీ బహిరంగ దాడి: ప్రియాంక విమర్శ

ఎన్నికల కమిషన్(ఈసీ), న్యాయవ్యవస్థ వంటి సంస్థలపై ఒత్తిడి తేవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు రాజ్యాంగ సవరణ బిల్లుతో ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి ప్రారంభించిందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. గురువారం మూడు బిల్లులపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ లోక్‌సభలో ప్రస్తుతమున్న 543 సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల డాటా ఆధారంగా డీలిమిటేషన్ కమిషన్ ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్యను 850 వరకు పెంచేందుకు ఈ బిల్లులో ప్రస్తావన ఉందని ఆమె చెప్పారు. పైకి చూస్తే ఇది బాగానే ఉన్నట్లు అనిపిస్తుందని, కానీ జాగ్రత్తగా చదివితేనే అసలు అర్థం బయటపడుతుందని, ఇందులో రాజకీయ ఛాయలు కనిపిస్తున్నాయని ప్రియాంక అన్నారు. నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలిస్తే డీలిమిటేషన్ కమిషన్‌లోని ముగ్గురు సభ్యులే రాష్ట్రాల భవితవ్యాన్ని, పార్లమెంట్‌లో వాటి ప్రాతినిధ్యాన్ని నిర్ణయిస్తారని తెలుస్తుందని ఆమె చెప్పారు. అమిత్ షాను ఉద్దేశిస్తూ "ఒకవేళ చాణక్యుడు ఇప్పుడు జీవించి ఉంటే మీ రాజకీయ చతురతకు (రాజనీతి కుటిలత) ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారు. ఈ మొత్తం ప్రణాళికను ఆయనే(షా) రూపొందించారు. ఇప్పుడు నవ్వుతున్నారు. ఆయన నాతో ఏకీభవిస్తున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించారు.

'నారీ'ని 'నారా'గా మార్చేసిన బీజేపీ

అధికార బీజేపీ నారీ(మహిళ)ని నారా(నినాదం)గా మార్చేసిందని అఖిలేశ్ యాదవ్ గురువారం విమర్శించారు. జన గణను జాప్యం చేసేందుకే బీజేపీ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణలు తీసుకువస్తున్నదని ఆయన అన్నారు. లోక్‌సభలో జరిగిన చర్చలలో అఖిలేశ్ పాల్గొంటూ తమ పార్టీ మహిళలకు రిజర్వేషన్లను ఎల్లప్పుడూ బలపరించిందని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్దేశిస్తూ బీజేపీ మాతృసంస్థ అధినాయకత్వంలో ఎందరు మహిళలు ఉన్నారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంతమంది మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారని ఆయన ప్రశ్నించారు.

డీలిమిటేషన్‌తో ముడిపెట్టవద్దు: గొగోయ్

మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెడుతూ లోక్‌సభ స్థానాల్ని పెంచడాన్ని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తప్పుబట్టారు. గురువారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై గొగోయ్ మాట్లాడుతూ, ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తుత లోక్‌సభ సీట్ల సంఖ్య 543కు వర్తింపజేయాలని, భవిష్యత్ డీలిమిటేషన్‌తో ముడిపెట్టవద్దని అన్నారు.

డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల మార్పు ఇలా..

రాష్ట్రం	ప్రస్తుత సీట్లు	ప్రస్తుత ప్రాతినిధ్యం	మారే సీట్లు	మారే ప్రాతినిధ్యం	ఎన్ని సీట్లు పెరిగాయి?
తమిళనాడు	39	7.18%	59	7.23%	+20
కర్ణాటక	28	5.15%	42	5.14%	+14
ఆంధ్రప్రదేశ్	25	4.60%	38	4.65%	+13
కేరళ	20	3.68%	30	3.67%	+10
తెలంగాణ	17	3.13%	26	3.18%	+9

డీలిమిటేషన్ తర్వాత మిగతా రాష్ట్రాల్లో సీట్ల మార్పు ఇలా..

రాష్ట్రం	ప్రస్తుత సీట్లు	ప్రస్తుత ప్రాతినిధ్యం	మారే సీట్లు	మారే ప్రాతినిధ్యం	ఎన్ని సీట్లు పెరిగాయి?
ఉత్తరప్రదేశ్	80	14.73%	120	14.70%	+40
మహారాష్ట్ర	48	8.83%	72	8.82%	+24
పశ్చిమబెంగాల్	42	7.73%	63	.72%	+21
బీహార్	40	7.36%	60	7.35%	+20
మధ్యప్రదేశ్	29	5.34%	43	5.27%	+14
గుజరాత్	26	4.78%	39	4.78%	+13
రాజస్థాన్	25	4.60%	38	4.65%	+13
ఒడిశా	21	3.86%	32	3.92%	+11
జార్ఖండ్	14	2.57%	21	2.57%	+7
అసోం	14	2.57%	21	2.57%	+7
పంజాబ్	13	2.39%	20	2.45%	+7
ఛత్తీస్‌గఢ్	11	2.02%	17	2.08%	+6
హర్యానా	10	1.84%	15	1.84%	+5
ఢిల్లీ	7	1.29%	11	1.35%	+4
జమ్ముకశ్మీర్	5	0.92%	8	0.98%	+3
ఉత్తరాఖండ్	5	0.92%	8	0.98%	+3
హిమాచల్	4	0.73%	6	0.73%	+2
అరుణాచల్	2	0.36%	3	0.36%	+1
గోవా	2	0.36%	3	0.36%	+1
మణిపూర్	2	0.36%	3	0.36%	+1
మేఘాలయ	2	0.36%	3	0.36%	+1
మిజోరం	2	0.36%	3	0.36%	+1
త్రిపుర	2	0.36%	3	0.36%	+1
అండమాన్	1	0.18%	1	0.12%	0
చండీగఢ్	1	0.18%	1	0.12%	0
దాద్రానగర్	1	0.18%	1	0.12%	0
డామన్‌డయ్యూ	1	0.18%	1	0.12%	0
లద్దాఖ్	1	0.18%	1	0.12%	0
లక్షద్వీప్	1	0.18%	1	0.12%	0
నాగాలాండ్	1	0.18%	1	0.12%	0
పుదుచ్చేరి	1	0.18%	1	0.12%	0
సిక్కిం	1	0.18%	1	0.12%	0
మొత్తం	543	100%	816	100%	+273

ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం లేదు

- **పునర్విభజనలో ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపబోం**
- **మహిళా బిల్లును వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు**
- **లోక్‌సభలో ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజనలో పెద్దదైనా, చిన్నదైనా, ఉత్తరాది అయినా దక్షిణాది అయినా, తూర్పు అయినా పడమర అయినా ఏ రాష్ట్రం పట్ల వివక్ష ఉండదని ప్రధాని మోదీ గురువారం స్పష్టం చేశారు. ఈ సంస్కరణను వ్యతిరేకించే వారిని దేశంలోని మహిళలు క్షమించబోరని ఆయన హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో పాల్గొన్న ప్రధాని.. డీలిమిటేషన్ ప్రక్రియ ఫలితంగా ఏ రూపంలోనూ లోక్‌సభ సీట్ల నిష్పత్తి తగ్గదని స్పష్టం చేశారు.

ఆ క్రెడిట్ మీకే ఇస్తాం

2029లో మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుకు తాము ఘనతను కోరుకోవడం లేదని, ఆ ఘనతను ప్రతిపక్షానికే ఇస్తామని మోదీ అన్నారు. "మీరు వ్యతిరేకిస్తే నాకు రాజకీయ లబ్ధి చేకూరడం సహజం. కాని మీరు నాతోపాటే నడిస్తే ఎవరికీ ఎలాంటి రాజకీయ ప్రయోజనం చేకూరదు" అని ఆయన అన్నారు. ఈ దేశ మహిళలకు తామే ఏదో అందచేస్తున్నామన్న భ్రమలో ఎవరూ ఉండకూడదని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ అది వారి హక్కని ప్రధాని చెప్పారు. "మాకు ఎటువంటి ఘనత వద్దు. మీరు నన్ను గ్యారెంటీ(హామీ) అనే పదం వాడమంటే నేను గ్యారెంటీ అనే పదం వాడతాను. మీరు నన్ను ప్రామిస్(వాగ్దానం) చేయమంటే నేను ప్రామిస్ అనే పదం వాడతాను. ఎందుకంటే ఉద్దేశం స్పష్టంగా ఉంటే మాటలతో ఆటలు ఆడాల్సిన అవసరం లేదు" అని మోదీ స్పష్టం చేశారు.

వ్యతిరేకులు పర్యవసానాలు చూశారు



గతంలో మహిళలకు ఈ హక్కు ఇవ్వడాన్ని వ్యతిరేకించిన వారిని ఈ దేశ మహిళలు క్షమించలేదని, వారు పర్యవసానాలను ఎదుర్కొన్నారని మోదీ అన్నారు. దీన్ని రాజకీయ త్రాసులో తూచవద్దని, ఇది జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన నిర్ణయమని ప్రధాని అన్నారు. "దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు మనల్ని చూస్తున్నారు. మన నిర్ణయాలను చూస్తారు. కానీ నిర్ణయం కంటే ఎక్కువగా వారు మన ఉద్దేశాన్ని విశ్లేషిస్తారు. మన ఉద్దేశంలో ఏ మాత్రం లోపం ఉన్నా ఈ దేశ మహిళలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన చెప్పారు.

అప్పుడు సమయం లేదు

2023లో పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చిస్తున్నపుడు త్వరపడండి అని ప్రజలు అన్నారని మోదీ చెప్పారు. "కానీ అది 2024లో(ఎన్నికలు) జరగలేదు. ఎందుకంటే అంత తక్కువ సమయంలో దీన్ని పూర్తి చేయడం సాధ్యం కాదు. ఇప్పుడు 2029 వరకు మనకు సమయం ఉంది. ఒకవేళ 2029లో కూడా దీన్ని అమలు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించవచ్చు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదన్నదే ప్రస్తుత అవసరం" అని ఆయన చెప్పారు.

అమల్లోకి మహిళా రిజర్వేషన్ చట్టం

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టం 2023, గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2029లో అమలు చేసేందుకు అదే చట్టాన్ని సవరించాలని పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న క్రమంలో, ఈ 2023 చట్టాన్ని ఏప్రిల్ 16 నుంచి అమలులోకి వచ్చేలా ఎందుకు నోటిఫై చేశారో అన్న విషయం తెలియరాలేదు.



సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

డీలిమిటేషన్ బిల్లుపై పార్లమెంట్‌లో ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్

న్యూఢిల్లీ: డీలిమిటేషన్ బిల్లు సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టంచేశారు. డీలిమిటేషన్ బిల్లుపై గురువారం పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజాస్వామ్యం, ఫెడరలిజానికి ఈ బిల్లు పూర్తి విరుద్ధమని మండిపడ్డారు. డీలిమిటేషన్ ఫ్రీజ్‌ను తొలగించడం ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు దక్కాల్సిన న్యాయమైన వాటాను ఈ బిల్లు కాలరాస్తున్నదని దుయ్యబట్టారు. దక్షిణాది రాష్ట్రాలను ఎప్పటికీ ఇతర రాష్ట్రాలే పరిపాలించాలనే కుట్ర ఈ బిల్లు వెనుక దాగి ఉన్నదని విమర్శించారు. చట్టసభల్లో ఓబీసీ, ముస్లింల ప్రాతినిధ్యాన్ని తగ్గించేలా బిల్లు ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, శాసనసభల్లో సీట్లు పెంచితే ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకే మరిన్ని అధికారాలు ఇచ్చినట్టు కాదా? అని ప్రశ్నించారు. చిన్న రాష్ట్రాలు తమ గొంతు వినిపించే హక్కు కోల్పోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలకు ఇప్పటికే 38.1% ప్రాతినిధ్యం ఉండగా.. డీలిమిటేషన్‌తో 43.1 శాతానికి చేరుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు 24% ఉన్న ప్రాతినిధ్యం 20 శాతానికి పడిపోతుందని వివరించారు. 'బిల్లు ప్రవేశపెట్టడానికి ఏడు రోజుల ముందు సభ్యులకు కేంద్ర మంత్రి నోటీసులు ఇవ్వాలి. బిల్లు కాపీలను రెండు రోజుల ముందు ఇవ్వాలి. ఈ విషయంలో ఆర్పీఏ 1951లోని 123 బీ నిబంధనలను కేంద్రం ఉల్లంఘించింది' అని ఒవైసీ పేర్కొన్నారు.

సొంతభూమిలోనే

శరణార్థులుగా..!

- **డీలిమిటేషన్.. నల్ల చట్టం**
- **బిల్లు ప్రతులు దగ్ధం చేసిన స్టాలిన్**

చెన్నై, ఏప్రిల్ 16: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లు ప్రతిని దగ్ధం చేసి దాన్ని నల్ల చట్టంగా అభివర్ణించారు. ఇది తమిళ ప్రజలను వారి సొంత భూమిలోనే శరణార్థులుగా మార్చాలని చూస్తున్నదని ఆయన ఆరోపించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి కొన్ని గంటల ముందు స్టాలిన్ నల్ల జెండాను ఎగురవేసి కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిన డీలిమిటేషన్ బిల్లు ప్రతిని దహనం చేసి బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార నిమిత్తం పశ్చిమ తమిళనాడులోని నామక్కల్‌లో పర్యటిస్తున్న స్టాలిన్ నల్ల దుస్తులు ధరించి బిల్లుపై నిరసన తెలిపారు. కలసి పోరాడి గెలుద్దాం వంటి నినాదాలతో డీఎంకే కార్యకర్తలు ఈ సందర్భంగా హోరెత్తించారు. డీఎంకే నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా తమ నియోజకవర్గాలు, ఇండ్లపైన నల్ల జెండాలు ఎగురవేశారు. చెన్నైలోని డీఎంకే రాష్ట్ర కార్యాలయం అన్నా అరివాలయంతోపాటు నగరంలోని అనేక కీలక ప్రదేశాల్లో నల్ల జెండాలు ఎగిరాయి. డీఎంకే మిత్రపక్షాలైన కమల్ హాసన్‌కు చెందిన మక్కల్ నీది మయ్యమ్, వైకో సారథ్యంలోని ఎండీఎంకే కూడా తమ సంఘీభావం ప్రకటించాయి.



సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం

డీలిమిటేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించినా, దానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని డీఎంకే ప్రకటించింది. డీఎంకే అసెంబ్లీ ఎన్నికల ప్రచార గీతాన్ని విడుదల చేస్తూ, పార్టీ న్యాయ విభాగం కార్యదర్శి ఇలంగో ఈ విషయాన్ని వెల్లడించారు. 'దక్షణాది ప్రయోజనాల దృష్ట్యా కోర్టును ఆశ్రయిస్తాం. బిల్లుకు పార్లమెంట్ ఆమోదం దక్కినా.. రాష్ట్రపతి ఆమోదం పొందగలదా? అన్నది సందేహమే' అని అన్నారు. డీఎంకే మరో నేత ఆర్‌ఎస్ భారతి మాట్లాడుతూ, 'సుప్రీంకోర్టుపై మాకు విశ్వాసముంది. కోర్టును ఆశ్రయించడానికి మా వద్ద సరైన కారణాలు కూడా ఉన్నాయి' అని అన్నారు. పీఎం మోదీ చేపట్టిన పెద్ద నోట్ల రద్దును గుర్తుచేస్తూ, అది పూర్తిగా వైఫల్యం చెందిందని, దాని ద్వారా ప్రభుత్వం ఎలాంటి నల్లధనాన్ని రాబట్టలేకపోయిందని అన్నారు. అదే విధంగా మోదీ సర్కార్ తీసుకొస్తున్న డీలిమిటేషన్ ప్రక్రియ కూడా విఫలమవుతుందని అన్నారు. ఇది ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య సమతుల్యతను దెబ్బ తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళా బిల్లు గట్టెక్కేనా?

- **అధికార ఎన్డీయే కూటమికి అనుకూలంగా లేని నంబర్లు**
- **రాజ్యాంగ సవరణకు బిల్లుకు 2/3 వంతుల మద్దతు కావాలి**



	మొత్తం సభ్యులు	బిల్లు ఆమోదానికి కావాల్సిన ఓట్లు	ఎన్డీయే సభ్యులు	ఇంకా కావాల్సిన ఓట్లు
లోక్‌సభ	540	360	293	67
రాజ్యసభ	244	163	141	22

న్యూఢిల్లీ: ఎన్నో ఏండ్ల ఎదురుచూపుల అనంతరం పార్లమెంట్ గడప తొక్కిన మహిళా బిల్లుకు ఆమోదంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టేందుకే ఓటింగ్‌ను కోరిన సభ్యులు ఇక దానిని ఆమోదించేందుకు అంత సునాయాసంగా అంగీకరిస్తారా అన్న అనుమానాలు వస్తున్నాయి. బిల్లును సొంతంగా గట్టెక్కించేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి సొంతంగా సభ్యుల బలం లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. రాజ్యాంగ సవరణ అవసరమయ్యే మహిళా బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యులు మద్దతు తెలపాలి. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లోనూ అంత బలం లేదు. లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 మంది (54%) సభ్యుల మద్దతు ఉండగా, ప్రతిపక్ష కూటమిలో 233 మంది సభ్యులు ఉన్నారు. ఏడుగురు ఎంపీలు స్వతంత్రులు కాగా, మరో ఏడుగురు వైసీపీ, ఎంఐఎం, శిరోమణి అకాలీదళ్‌కు చెందినవారు ఉన్నారు. వీరు ఇంతవరకు బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్టు బహిరంగంగా ప్రకటించలేదు. లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు మహిళా బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది ఎంపీలు మద్దతునివ్వాలి. లేదా సమాజ్‌వాదీ (37 మంది ఎంపీలు), తృణమూల్(28 మంది ఎంపీలు) లేదా డీఎంకే (22 మంది ఎంపీలు) వంటి ఏవైనా రెండు విపక్ష పార్టీలు ఓటింగ్‌లో పాల్గొనకుండా గైర్హాజరు కావాలి. అప్పుడే ఈ బిల్లులు ఆమోదం పొందే అవకాశం ఉంటుంది.

వారి ఓట్లు కీలకం..

ఒకవేళ ఈ బిల్లులు లోక్‌సభలో ఆమోదం పొందకపోతే.. వాటిని రాజ్యసభలో ప్రవేశపెట్టే అవకాశం ఉండదు. రాజ్యసభలో ఎన్డీయేకు అనుకూలంగా 141 మంది (58%) సభ్యులు ఉండగా, ప్రతిపక్షానికి 83 మంది ఎంపీల మద్దతు ఉన్నది. బీఆర్‌ఎస్, వైసీపీ, బీజేడీ, బీఎస్పీ, ఇండిపెండెంట్లు కలిపి 20 మంది ఉన్నారు. వీరి ఓట్లు బిల్లు ఆమోదానికి కీలకం కానుంది. ఎగువ సభలో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే అధికార కూటమికి 163 మంది సభ్యులు (మూడింట రెండు వంతుల మంది) కావాలి. రాజ్యసభలో బీజేపీకి 107 మంది ఎంపీలుండగా, కాంగ్రెస్‌కు 28, టీఎంసీ 13, ఆప్ 10, డీఎంకేకు 8 మంది సభ్యులున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులు ఆమోదం పొందేందుకు ఉభయ సభల్లో తమకు కావాల్సినంత సభ్యుల మద్దతు లేదని బీజేపీ నేతలు ప్రైవేట్‌గా అంగీకరిస్తున్నారు.

మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం

రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికి (50%)కు పైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. ఒకవేళ లోక్‌సభలోని 540 మంది సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లులకు మద్దతు తెలపాలి.



ఓటర్ల పేర్లను తొలగించేందుకే

డీలిమిటేషన్ బిల్లు

మమతా బెనర్జీ ఆరోపణ

కోల్‌కతా: ఓటర్ల పేర్లను ఎలక్టోరల్ జాబితా నుంచి తొలగించడం కోసమే కేంద్రం మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం ఆరోపించారు. జాతీయ పౌరుల రిజిస్టర్(ఎన్‌ఆర్‌సీ) అమలు కోసం చేస్తున్న కుట్రగా ఈ బిల్లులను ఆమె అభివర్ణించారు. కూచ్‌బెహార్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులను కలిపి ప్రవేశపెట్టడం ద్వారా దేశాన్ని విభజించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆమె ఆరోపించారు. గతంలోనే ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల బిల్లును ఎందుకు అమలు చేయలేదని కేంద్రాన్ని నిలదీశారు. తమ పార్టీ ఎంపీల్లో 37 శాతం మహిళలేనని పేర్కొన్నారు. తమ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మల ఓటర్లకు 'కార్డులు' పంచడంపై మమత ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖజానాపై అదనపు భారం!

- ***సంఖ్య పెంపుతో భారీగా పెరగనున్న ఖర్చు***
- ***సీటింగ్ నుంచి వసతి దాకా కొరతే***

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: 850 మంది సభ్యులతో కూడిన లోక్‌సభను ప్రతిపాదిస్తున్నందున ప్రభుత్వం పెరిగే వ్యయంతోపాటు దేశ రాజధానిలో ప్రతిపాదిత కొత్త ఎంపీలకు వసతి కొరతను కూడా ఎదుర్కోనున్నది. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశానికి కూడా స్థల సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. సాధారణ అంచనాల ప్రకారం సభ సమావేశంలో ఉన్న ప్రతిరోజు ప్రతి నియోజకవర్గంపై చేసే ఖర్చుకు అదనంగా ప్రభుత్వం ఒక్కో సభ్యుడిపైన దాదాపు రూ.1 లక్ష ఖర్చు చేస్తుంది. ఇందులో జీతాలు, ప్రయాణ భత్యాలు, వైద్య సౌకర్యాలపై ప్రభుత్వం చేసే ఖర్చు చేర్చలేదు. లూటియన్స్ జోన్‌లో ఇండ్ల కొరత ఉన్నందున పెరిగిన సంఖ్యలతో కేటాయింపుల విషయంలోనే తాము అడ్డంకిని ఎదుర్కొంటామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రతి సభ్యునికి రోజుకు సమారు రూ.1 లక్ష, అంటే మొత్తం రూ. 8 కోట్లు ఖర్చు చేస్తుంది. మరో అంచనా ప్రకారం పార్లమెంట్ సమావేశాల సమయంలో నిమిషానికి రూ. 2.5 లక్షలు అంటే మొత్తం రోజుకు రూ. 8-9 కోట్లు ఖర్చు చేస్తుంది. సభ్యుల సంఖ్య 850కి పెరిగితే రోజువారీ ఖర్చు రూ. 3 కోట్లు అదనంగా పెరుగుతుంది. అయితే ఇది పార్లమెంట్ ప్రాంగణాన్ని నడపడానికి అయ్యే నిర్వహణ ఖర్చు మాత్రమే. పార్లమెంట్ సభ్యుల జీతంతోపాటు అనేక ఇతర సౌకర్యాలకు అర్హులు. ఒక ఎంపీ ప్రస్తుత జీతం నెలకు రూ. 1 లక్ష. ఐదేండ్ల పదవీ కాలంలో ప్రతి సంవత్సరానికి రూ. 2,000తోపాటు అదనంగా రూ. 25,000 పింఛను ఉంటుంది. సభ్యులకు వసతి, తాత్కాలిక వసతి, ఉచిత రైల్వే టికెట్లు, ఉచిత ఫోన్ కనెక్షన్, ఉచిత విద్యుత్తు, ఒక నిర్దిష్ట పరిమితి వరకు ఉచిత నీరు వంటి సౌకర్యాలు లభిస్తాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు ఒక్క ఎంపీకి ఏడాదికి రూ. 4.29 కోట్లు ఖర్చవుతుంది. ప్రస్తుత ఎంపీల సంఖ్యకు అదనంగా 272 మంది కొత్త ఎంపీలను చేర్చడం వల్ల కేవలం పార్లమెంట్‌లోనే ఏటా అదనంగా రూ. 1,171 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్ర అసెంబ్లీల విస్తరణ, 4,000 మంది కొత్త సభ్యుల చేరికతో మరో రూ. 5,000-8,000 కోట్ల అదనపు ఖర్చు ఉండే అవకాశం ఉంది. సభ్యులకు వసతి సమకూర్చడం పెద్ద సమస్యగా మారవచ్చు. లుటియన్స్ జోన్‌లో సుమారు 850 బంగళాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఇండ్లను రాయబార కార్యాలయాలకు, ప్రజా స్మారక చిహ్నాలకు కేటాయించారు. మిగిలిన వాటిని వివిధ పూల్స్‌లో ప్రభుత్వానికి కేటాయించారు. 2015 వరకు లోక్‌సభ సభ్యుల పూల్‌లో 517 బంగళాలు ఉండేవి. బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో 8-9 సముదాయాల నిర్మాణం తర్వాత మరో 349 ఫ్లాట్లు దీనికి జత అయ్యాయి. కాగా, కొత్త భవనంలోని లోక్‌సభలో తగినంత సీటింగ్ ఉంది. ఒక్కో సభలో 880-890 సీట్లతో సీటింగ్ ఉంది. అయితే 1,100 మంది ఎంపీలు కూర్చునేంత సీటింగ్ లేదు. దశాబ్దం క్రితం 1927లో నిర్మించిన సంవిధాన్ సదన్‌లో ఉమ్మడి సమావేశం కోసం 800 ఎంపీలకు సరిపడ సీటింగ్ ఉందని, కొత్త భవనంలో ఆ సౌకర్యం లేదని ఒక అధికారి చెప్పారు.



డీలిమిటేషన్‌తో లింక్ పెట్టొద్దు!

తక్షణం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి: మహిళా సంఘాలు

న్యూఢిల్లీ: 'మమ్మల్ని పూజించ వద్దు.. సమానత్వం ఇవ్వండి చాలు' అంటూ రాజధానిలో మహిళలు నినదించారు. చట్టసభల్లో మహిళలకు వెంటనే రిజర్వేషన్లు అమలు చేయాలని 60 మందికి పైగా మహిళా సంఘాలు ఎంపీలకు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు గురువారం ఢిల్లీ ప్రెస్ క్లబ్‌లో పలు సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. రిజర్వేషన్లను తక్షణం అమలు చేసేలా నారీ శక్తి వందన్ అధినియమ్‌ను జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన నుంచి వేరు చేసి సవరణలు చేయాలని వారు కోరారు. దామాషా పద్ధతిలో సీట్ల కేటాయింపు, బలహీన వర్గాల మహిళలకు ఆర్థిక సహాయం, రాజ్యసభలో రిజర్వేషన్లు కూడా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు మూడు రోజుల పాటు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతున్న ఎంపీలకు తమ డిమాండ్లతో కూడిన వినితిపత్రాన్ని పంపారు. తాము ప్రధానంగా మూడు డిమాండ్లను పిటిషన్‌లో ప్రస్తావించినట్టు రచయిత్రి రాధా కుమార్ వెల్లడించారు. రాష్ట్రాలకు వాటి ప్రస్తుత సీట్ల వాటాకు దామాషా పద్ధతిలో 33 శాతం రిజర్వ్ సీట్లను కేటాయించాలని, అంతేకాకుండా దానికి అదనంగా బలహీన వర్గాలకు, అణగారిన వర్గాలతో పాటు ఓబీసీ, ఎల్జీబీటీ, డీనోటిఫై చేసిన తెగలకు చెందిన మహిళల ఎన్నికల ప్రచారానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా వచ్చే వర్షాకాల సమావేశంలో రాజ్యాంగ సవరణ చేయాలని వారు కోరారు.